నిజాలు మాట్లాడితే దేశద్రోహ ముద్ర

- శ్రమజీవుల ఉద్యమాలు కవర్ చేసినందునే న్యూస్‌క్లిక్‌పై కక్షసాధింపు
- జంతర్ మంతర్ వద్ద వామపక్షాల ఆందోళనలో బృందాకరత్

7

PRAJASAKTI Regd.No. 15795/68
సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 71 | విజయవాడ, బుధవారం 11 అక్టోబర్ 2023 | 8 + 8 పేజీలు వెల : 5.50
Vol No | Vijayawada, Wednesday 11 October 2023 | Rs



టాప్‌లో సాత్విక్-చిరాగ్

- నంబర్ వన్ ర్యాంక్‌తో కొత్త చరిత్ర

8

వారంలో కౌంటర్ దాఖలు చేయండి

కృష్ణా జలాల విద్యుత్ ఉత్పత్తి పై సుప్రీం ఆదేశం

కేంద్ర ప్రభుత్వం, కెఆర్ఎంబిలకు నోటీసులు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కృష్ణా నదీ నీటి వినియోగం, విద్యుదుత్పత్తి కి సంబంధించి వారం రోజుల్లో కౌంటర్ దాఖలు చేయాలని కేంద్ర ప్రభుత్వం, కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కెఆర్ఎంబి)లకు సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. అలాగే రిజాయిండర్ దాఖలుకు ఎపి ప్రభుత్వానికి రెండు వారాల సమయం ఇచ్చింది. విద్యుదుత్పత్తి కోసం తెలంగాణ ప్రభుత్వం కృష్ణా నీటి విడుదల చేయడాన్ని వ్యతిరేకిస్తూ, 2021లో ఎపి ప్రభుత్వం సర్వోన్నత న్యాయ స్థానాన్ని ఆశ్రయించింది. ఈ పిటిషన్‌ను మంగళవారం సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ పంకజ్ మిత్తల్‌లతో కూడిన ధర్మాసనం విచారించింది. అయితే ఈ పిటిషన్‌కు సంబంధించి ఇప్పటికే కౌంటర్ దాఖలు చేసినట్లు తెలంగాణ తరపున సీనియర్ న్యాయవాది సిఎస్ వైద్యనాథన్ కోర్టుకు నివేదించారు. ఇదే అంశంపై కేంద్రం తరపున న్యాయవాది స్పందిస్తూ, వారం రోజుల్లో కౌంటర్ దాఖలు చేస్తామని, ఇందుకు అనుమతివ్వాలని కోరారు. ఈ విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకొన్న ద్విసభ్య ధర్మాసనం ఏడు రోజుల్లో కౌంటర్ దాఖలు చేయాలని కేంద్రానికి, కెఆర్ఎంబికి ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణను నవంబరు 21కి వాయిదా వేసింది.

పోలీసు తనిఖీల్లో భారీగా నగదు, బంగారం సీజ్

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన నేపథ్యంలో అంతర్రాష్ట్ర సరిహద్దులు, జిల్లా సరిహద్దుల్లో పోలీసు శాఖ ముమ్మర తనిఖీలు మొదలుపెట్టింది. ప్రత్యేక చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి ద్విచక్ర వాహనాలు సహా కార్లు, ఇతర వాహనాలను తనిఖీ చేస్తోంది. ఈ క్రమంలో సరైన పత్రాలు చూపని వారి నుంచి నగదును, బంగారాన్ని పోలీసులు స్వాధీనం చేసుకుని ఎన్నికల అధికారులకు అప్పగించారు. హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో సోమ, మంగళవారాల్లో నిర్వహించిన తనిఖీల్లో సుమారు రూ.5 కోట్ల నగదు, 7 కిలోల బంగారం, 300 కిలోల వెండిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలో రూ.41.8 లక్షల నగదును సీజ్ చేశారు. హైదరాబాద్‌లో నార్త్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు, బంజారాహిల్స్ పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన తనిఖీల్లో భారీగా నగదు దొరికింది. కియా వాహనంలో రూ.3.35 కోట్లను స్వాధీనం చేసుకున్నట్టు వెస్ట్ జోన్ డిసిపి జోయల్ డేవిస్ తెలిపారు. మేడ్చల్ జిల్లా మేడిపల్లి మండలంలో ఓ వాహనంలో 6,01,940 నగదును స్వాధీనం చేసుకున్నారు. నల్లగొండ జిల్లా అనుముల మండల కేంద్రంలోని హాలియా పాత ఐటి సమీపంలో ఆర్‌టిసి బస్సులో రూ.30 లక్షలు, దేవరకొండకు వెళ్తున్న ఆర్‌టిసి బస్సులో రూ.30 లక్షలు సీజ్ చేశారు. నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలంలోని గోసంపల్లె గ్రామంలో సుమారు 193 లీటర్ల మద్యాన్ని పట్టుకున్నట్టు ఎస్ఐ లింబాద్రి తెలిపారు. కర్ణాటక నుంచి మద్యం వస్తుందన్న సమాచారంతో తెలంగాణ-కర్ణాటక సరిహద్దులో ఎక్సైజ్ శాఖ చెక్‌పోస్టులను ఏర్పాటు చేసింది.

లోకేష్‌ను విచారించిన సిఐడి

6 గంటలు.. 50 ప్రశ్నలు

ఇన్నర్ రింగ్‌రోడ్ కేసులో నేడూ కొనసాగనున్న విచారణ

విచారణ అనంతరం కార్యకర్తలతో కరచాలనం చేస్తున్న లోకేష్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అమరావతి ఇన్నర్ రింగ్ రోడ్డు కేసులో ఎ14గా వున్న తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌ను సిఐడి మంగళవారం నాడు సుమారుగా ఆరు గంటల పాటు విచారించింది. ఈ సమయంలో దాదాపు 50 ప్రశ్నలు అడిగినట్లు సమాచారం. నేడు (బుధవారం) కూడా విచారణ కొనసాగనుంది. రాష్ట్ర హైకోర్టు ఉత్తర్వుల మేరకు మంగళవారం ఉదయం 10 గంటలకు తాడేపల్లిలోని ఎపిసిఐడి క్యాంప్ కార్యాలయంలో నారా లోకేష్ విచారణకు హాజరైనారు. ఈ కేసులో నారా లోకేష్ పాత్రకు సంబంధించి పలు ప్రశ్నలు అడిగినట్లు సమాచారం. మధ్యాహ్నం ఒంటిగంట తర్వాత గంటపాటు భోజన విరామాన్ని ఇచ్చారు. విరామం అనంతరం తిరిగి 2గంటలకు విచారణను ప్రారంభించి సాయంత్రం 5గంటలకు విచారణను ముగించారు. విచారణ ముగిశాక మరికొన్ని అంశాలపై విచారించాల్సి వుందని బుధవారం కూడా విచారణకు రావాలనే అక్కడే నారా లోకేష్‌కు 41ఎ నోటీస్‌ను సిఐడి అధికారులు అందజేశారు. విచారణ అనంతరం బయటకు వచ్చిన నారా లోకేశ్ మీడియాతో మాట్లాడారు. గత నెల 30న 41ఎ కింద తనకు సిఐడి అధికారులు ఇన్నర్ రింగ్‌రోడ్‌కు సంబంధించి విచారణకు రమ్మని నోటీసులు ఇచ్చాం న్నారు. విచారణ సందర్భంగా సిఐడి అధికారులు ఇన్నర్ రింగ్ రోడ్డుతో సంబంధం లేని ప్రశ్నలు వేశారని అన్నారు. 49 ప్రశ్నలు గూగుల్‌లో సెర్చ్ చేసినా దొరికే తన వ్యక్తిగత సమాచారం అడిగారని, ఇన్నర్ రింగ్ రోడ్‌కు సంబంధించి ఒక్క ప్రశ్న మాత్రమే అడిగారని తెలిపారు. ఎలాంటి ఆధారాలు తన ముందు వుంచలేదన్నారు. లేని ఇన్నర్ రింగ్ రోడ్డు విషయంలో తాను, తన కుటుంబసభ్యులు ఎలా లాభపడ్డారో అన్న అంశంపై ఒక్క ప్రశ్న కూడా వేయలేదన్నారు. ఇది కక్షసాధింపు తప్ప మరొకటి కాదన్నారు. ఎలాంటి ఆధారాలు లేని కేసులు పెడుతున్నారని విమర్శించారు. ప్రభుత్వం దొంగ ఎఫ్ఐఆర్‌లు నమోదు చేస్తోందన్నారు. ఎన్ని ప్రశ్నలు అయినా అడగండి ఎంతలేట్ అయినా వుంటానని చెప్పినా మరో రోజు రావాలని సిఐడి నోటీసులు ఇచ్చిందని తెలిపారు. బుధవారం కూడా తాను విచారణకు హాజరవుతున్నట్లు తెలిపారు. హెరిటేజ్ సంస్థకు లబ్ధి చేకూరేలా ఇన్నర్ రింగ్‌రోడ్డు అలైన్‌మెంట్ మార్చారన్నది తనపై మోపుతున్న అభియోగమని తాను మంత్రిగా ఏ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నానో సిఐడి చెప్పలేక పోతోందన్నారు.

విచారణ అధికారి మార్పు

ఇన్నర్ రింగ్ రోడ్డు కేసు విచారణ అధికారిని మారుస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అడిషన్ ఎస్‌పి జయరాజుకు బదులుగా డిఎస్‌పి విజయ్ భాస్కర్‌కు విచారణ బాధ్యతలను అప్పగించినట్లు మంగళవారం విజయవాడ ఎసిబి కోర్టుకు ప్రభుత్వం సమాచారం అందించింది. ఈ కేసులో నారా లోకేష్ విచారణకు హాజరవుతున్న రోజునే విచారణ అధికారిని మారుస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం చర్చనీయాంశం అయ్యింది. అలాగే వ్యక్తిగత కారణాలతో ఎసిబి కోర్టు జడ్జి హిమబిందు మంగళవారం సెలవుపై వెళ్లారు. దీంతో చంద్రబాబునాయుడుపై సిఐడి దాఖలు చేసిన పిటి వారెంట్ల విచారణ బుధవారానికి వాయిదా పడింది.

చంద్రబాబు పిటిషన్‌పై విచారణ వాయిదా

2

గాజా దిగ్బంధం

- ఆహారం, నీరు, ఇంధనం నిలిపివేత
- కొనసాగిన బాంబుల వర్షం
- 1600 మందికి పైగా మృతి
- సర్వం వదిలి లక్షలాది మంది వలస

గాజాలో ఎటుచూసినా ఇలాంటి దృశ్యాలే

జెరూసలేం : ఒకవైపు వైమానిక దాడులు మరోవైపు దిగ్బంధం..ఉగ్రవాద నెపం మోపి ఇజ్రాయిల్ యుద్ధోన్మాదంతో ఊగిపోతోంది. గాజాపై వైమానిక దాడులు కొనసాగిస్తూనే ఆహారం, నీరు, ఇంధనం వంటి నిత్యవసరాలు ఆ ప్రాంతంలోకి వెళ్లనీయకుండా అడ్డంకులు సృష్టించి అన్నివిధాలా దిగ్బంధం చేస్తోంది. ఇజ్రాయిల్ యుద్ధాన్ని ప్రారంభించలేదని, హమస్ తెరలేపగా తాము యుద్ధాన్ని ముగిస్తిన్నామని ఆ దేశ ప్రధానమంత్రి నెతన్యాహే పేర్కొన్నారు. హమస్ దాడిని బూచిగా చూపి అమాయకులపై పాలస్తీనా ప్రజలే లక్ష్యంగా గాజాపై వైమానిక దాడులతో ఇజ్రాయిల్ విరుచుకుపడుతోంది. గాజాపైనా, పరిసర ప్రాంతాలపైనా మంగళవారం కూడా బాంబుల వర్షం కురిపించింది. భవనాలన్నీ శిథిలాల కుప్పలుగా మారాయి. భయకంపితులైన లక్షలాది మంది ప్రజలు సురక్షితంగా వుండే చోటు కోసం వెతుకులాడుతున్నారు. నలుదిక్కులా ఇజ్రాయిల్ సైన్యంతో దిగ్బంధించడంతో 'పట్టీ' లాంటి చిన్న ప్రాంతంలో సురక్షితమైన ప్రదేశమే కానరాకుండా పోయింది. ఎటు చూసినా బాంబుల మోతే, ఆర్తనా దాలే. ఆయుధాల గిడ్డంగులు, తయారీ ఫ్యాక్టరీలతో పాటూ సైనిక లక్ష్యాలపై ఇజ్రాయిల్ యుద్ధ విమానాలు దాడులు కొనసాగిస్తున్నాయి. గాజాలో బాధితులకు సాయమందించేందుకు మానవతా కారిడార్‌లను ఏర్పాటు చేయాల్సిందిగా సహాయక సంస్థలు విజ్ఞప్తులు చేస్తున్నాయి. బాధితుల ఆక్రందనలతో ఆస్పత్రులు భీతి గొలుపుతున్నాయి. చాలాచోట్ల ఔషధాలకు కొరత ఏర్పడుతోంది. గాజాలోకి ఆహారం, మందులు, ఇంధన సరఫరాలు ఏవీ వెళ్లకుండా ఇజ్రాయిల్ కట్టడి చేసింది. ఈజిప్ట్ నుండి వున్న ఏకైక దారిని కూడా మంగళవారం నాడు మూసివేశారు. ఇజ్రాయిల్ సైన్యం ఆపకుండా దాడులు కొనసాగిస్తుండడంతో పరిస్థితి బీభత్సంగా మారింది. ఇప్పటికే ఇరు పక్షాల వైపు 1600 మంది మరణించినట్లు తెలుస్తోంది. వాస్తవానికి ఈ సంఖ్య ఇంకా ఎక్కువగానే వుంటుందని భావిస్తున్నారు. మరోవైపు గాజాలోని హమస్, ఇతర మిలిటెంట్ గ్రూపులు 150 మందికి పైగా సైనికులను, పౌరులను బందీలుగా వుంచినట్లు ఇజ్రాయిల్ పేర్కొంది. మంగళవారం నాడు 3,60,000 మందికి పైగా రిజర్విస్టులను రంగంలోకి దింపడంతో ఈ ఘర్షణలు ఇంకా పెచ్చరిల్లుతాయని భావిస్తున్నారు. ఇజ్రాయిల్ దక్షిణ ప్రాంతంలో హమస్ దాడి చేసి స్వాధీనం చేసుకున్న ప్రాంతాలపై తాము పట్టు సాధించామని ఇజ్రాయిల్ సైన్యం మంగళవారం తెలిపింది.

(ఇజ్రాయిల్ చర్యలను ఖండించిన ఐరాస - 7లో)

వయోపరిమితి 42కు పెంపు

- గెజిట్ నోటిఫికేషన్ విడుదల

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పబ్లిక్ సర్వీసెస్-డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా ఎపి పబ్లిక్ సర్వీస్ కమిషన్, ఇతర రిక్రూటింగ్ ఏజెన్సీల ద్వారా 30.09.24 వరకు జరిగే రిక్రూట్‌మెంట్ల కోసం అన్ని నాన్ - యూనిఫామ్ సర్వీసుల్లోని పోస్టులకు గరిష్ట వయోపరిమితిని 34 నుంచి 42 ఏళ్లకు ప్రభుత్వం పెంచింది. ఈ మేరకు మంగళవారం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇటీవల కాలంలో రిక్రూట్‌మెంట్లు లేకపోవడంతో నిరుద్యోగుల నుంచి నిరసనలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలోనే వయోపరిమితి పెంచారని పరిశీలకులు పేర్కొంటున్నారు.

గింజకట్టని మొక్కజొన్న!

- నిండాముంచిన విత్తన కంపెనీలు
- ఖరీఫ్‌లో పూర్తిగా దెబ్బతిన్న పంట
- పరిహారం కోసం రైతుల ఎదురుచూపులు
- నాన్చుతున్న కంపెనీలు

ఎండిపోయిన మొక్కజొన్న (ఇన్‌సెట్‌లో) గింజలు లేని ఎన్ను

ప్రజాశక్తి- సాలూరు (విజయనగరం జిల్లా)

ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో మొక్కజొన్న సాగు చేసిన రైతులు నిండా మునిగిపోయారు. వెన్ను కట్టకపోవడం, వెన్ను వచ్చినా గింజ కట్టకపోవడంతో దిగుబడి పూర్తిగా తగ్గిపోయింది. దీంతో, రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఒప్పందం ప్రకారం తమకు రావాల్సిన పరిహారం కోసం వారు ఎదురు చూస్తున్నారు. దీనిపై విత్తన కంపెనీలు నాన్చుతుండడం, షరతులు పెడుతుండడంతో ఆందోళన చెందుతున్నారు. పార్వతీపురం మన్యం జిల్లాలోని సాలూరు, పాచిపెంట, మక్కువ మండలాల్లో మొక్కజొన్న ఎక్కువగా సాగు చేస్తున్నారు. సాలూరు నియోజకవర్గంలో ఎక్కువ విస్తీర్ణంలో ఈ పంట వేశారు. పాచిపెంట మండలంలో 5,990 ఎకరాలు, సాలూరు మండలంలో 3,442 ఎకరాలు, మక్కువ మండలంలో 767 ఎకరాలు... మొత్తంగా 10,199 ఎకరాల్లో సాగు చేశారు. ఎక్కువగా కావేరీ, బేయర్ రకం విత్తనాలను వేశారు. ఈ విత్తనాలు మొలకెత్తి నప్పటికీ వెన్నులకు గింజలు లేకపోవడంతో దిగుబడి పూర్తిగా తగ్గిపోయింది. తమ విత్తనాల వల్ల ఎవరైనా నష్టపోతే వారికి ఎకరాకు రూ.30 వేల నుంచి రూ.35 వేల వరకు పరిహారం చెల్లిస్తామని విత్తన కంపెనీలు రైతులతో ముందుగానే నోటిమాటగా ఒప్పందం చేసుకున్నాయి. తమ కంపెనీ విత్తనాలు నాటితే ఎకరానికి 1,500 నుంచి 2 వేల కిలోల దిగుబడి వస్తుందని ఆయా కంపెనీలు మిగతా 7లో

సదస్సులో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

జీడి రైతుల నడ్డి విరిచిన కేంద్రం

- దిగుమతి సుంకాన్ని తగ్గించి పొట్టకొట్టారు
- మద్దతు ధర జిఒ ఇచ్చిన తరువాతే జిల్లా పర్యటనకు సిఎం రావాలి
- సదస్సులో వి.శ్రీనివాసరావు

2

క్షేమంగానే అమర్త్యసేన్

- ఆయన కుమార్తె నందన వెల్లడి

బస్సు యాత్రను జయప్రదం చేయండి

- రీజనల్ కో ఆర్డినేటర్‌లతో సిఎం జగన్‌మోహన్‌రెడ్డి

అలుపెరుగని పోరాట ఫలితం

- 'సిఐటియు'తో కార్మికుల జీవితాల్లో వెలుగు
- టిటిడిలో ఆరువేల మందికి వేతనాల లబ్ధి

లోపలి పేజీల్లో...

సర్క్యులర్ 64ను రద్దు చేయాల్సిందే

- రాష్ట్ర వ్యాప్తంగా యానిమేటర్ల ఆందోళన
- కలెక్టరేట్ల వద్ద 36 గంటల దీక్షలు, వంటా-వార్పు
- సమస్యలు పరిష్కరించకపోతే డిసెంబర్లో 'చలో విజయవాడ'
- ఎపి వెలుగు విఒఎ (యానిమేటర్స్) ఉద్యోగుల సంఘం

అనకాపల్లి కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న యానిమేటర్లు

ప్రజాశక్తి- యంత్రాంగం

మూడేళ్ల వరకే ఉద్యోగం ఉండేలా విడుదల చేసిన కాలపరిమితి సర్క్యులర్ 64ను వెంటనే రద్దు చేయాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వెలుగు విఒఎలు (యానిమేటర్లు) మంగళవారం రాష్ట్ర వ్యాప్తంగా 36 గంటల నిరసన దీక్షలకు దిగారు. కలెక్టరేట్ల వద్ద వంటా-వార్పు కార్యక్రమం నిర్వహించారు. రాత్రి అక్కడే నిద్రించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ గ్రామాల్లో పేదరిక నిర్మూలనకు పొదుపు సంఘాల ద్వారా ఆర్థిక ప్రగతికి తోడ్పడుతున్న 28 వేల మంది యానిమేటర్ల కుటుంబాలు ప్రభుత్వం అనాలోచనతో విడుదల చేసిన 64వ సర్క్యులర్ వల్ల రోడ్డున పడతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం పునరాలోచించుకొని మూడు సంవత్సరాల కాలపరిమితి రద్దు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని, వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత తొలగించిన యానిమేటర్లను అందరినీ వెంటనే విధులోకి తీసుకోవాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సిపిఎం, సిఐటియు, ఎపి కౌలు రైతు సంఘం, ఐద్వా నాయకులు, పిడిఎఫ్ ఎమ్మెల్సీలు పాల్గొని యానిమేటర్ల ఆందోళనకు సంఘీభావం తెలిపారు. అనకాపల్లి కలెక్టరేట్ వద్ద జరిగిన కార్యక్రమంలో ఎపి వెలుగు విఒఎ (యానిమేటర్స్) ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.రూపాదేవి మాట్లాడుతూ విఒఎలపై పని భారం పెంచడం తగదని, లక్ష్యాల పేరుతో వేధింపులకు గురి చేయడం దారుణమని అన్నారు. పొమ్మనకుండా పొగబెట్టే చర్యలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

బాపట్లలో పాత బస్టాండ్ వద్ద ధర్నాలో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధనలక్ష్మి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ అమలు మిగతా 7లో

'ఇన్నర్' కేసులో ముందస్తు బెయిల్ ఇవ్వండి

- హైకోర్టులో చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతి

ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ మార్పు పేరుతో పలు అక్రమాలు జరిగాయంటూ సిఐడి నమోదు చేసిన కేసులో తాను అరెస్టు అయినట్లుగా పరిగణించాలన్న (డీమ్డ్) పిటిషన్‌ను హైకోర్టు కొట్టేసిన తరుణంలో టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు మరోసారి హైకోర్టును ఆశ్రయించారు. ఆ కేసులో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ మంగళవారం లంచ్‌మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. అత్యవసరంగా విచారణ చేసేందుకు హైకోర్టు నిరాకరించింది. సాధారణ పద్ధతిలోనే పిటిషన్‌ను విచారిస్తామని జస్టిస్ కె సురేష్‌రెడ్డి ప్రకటించారు. బుధవారం విచారణ చేపడతామని తెలిపారు. ఈ పిటిషన్‌పై తుది తీర్పు వెలువడే వరకు ఇన్నర్ కేసులో తనకు మధ్యంతర ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని చంద్రబాబు పిటిషన్‌లో కోరారు.

నారాయణ బావమరిది కేసులో..

ఇన్నర్ రింగ్ రోడ్డు కేసులో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ మాజీ మంత్రి పొంగూరు నారాయణ బావమరిది, ఆ కేసులో17వ నిందితుడు ఆవుల మునీ శంకర్ కూడా హైకోర్టును ఆశ్రయించారు.

నారాయణ కేసు నేటికి వాయిదా

ఇన్నర్ రింగ్ రోడ్డు కేసు విచారణకు హాజరుకావాలని సిఐడి జారీ చేసిన నోటీసును కొట్టేయాలని కోరుతూ మాజీ మంత్రి పొంగూరు నారాయణ దాఖలు చేసిన వ్యాజ్యంపై విచారణ బుధవారానికి వాయిదా పడింది. పోలీసుల వాదన తెలియజేయాలని అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ దుష్యంత్‌రెడ్డిని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బివిఎస్ఎన్ చక్రవర్తి ఉత్తర్వులు జారీ చేశారు. ఇన్నర్ కేసులో నారాయణను విచారించడం తప్పనిసరని సిఐడి భావిస్తే, తన ఇంటి వద్దనే విచారించేలా ఉత్తర్వులివ్వాలని ఆయన తరపున న్యాయవాది వాదించారు.

సిఐడి విచారణకు హాజరవ్వండి

ఇన్నర్ రింగ్ రోడ్డు కేసు విచారణకు తమ ఎదుట హాజరుకావాలని సిఐడి జారీ చేసిన నోటీసును కొట్టేయాలని కోరుతూ మాజీ మంత్రి పొంగూరు నారాయణ అల్లుడు కె పునీత్ దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు పరిష్కరించింది. జస్టిస్ కొనకంటి శ్రీనివాసరెడ్డి విచారణ జరిపారు. పిటిషనరు సిఐడి విచారణకు హాజరుకావాలని ఆదేశించారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పిటిషనర్‌ను విచారించాలని, న్యాయవాది సమక్షంలోనే విచారణ చేయాలని సిఐడిని ఆదేశించారు. మధ్యాహ్నం గంటపాటు లంచ్ విరామం ఇవ్వాలన్నారు.

అంగళ్లు కేసులో చంద్రబాబు అభ్యర్థనను తోసిపుచ్చిన హైకోర్టు

అన్నమయ్య జిల్లా, అంగళ్లు వద్ద జరిగిన గొడవల నేపథ్యంలో టిడిపి నేతలపై ముదివీడు పోలీసులు నమోదుచేసిన కేసులో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలంటూ టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. మంగళవారం దాఖలు చేసిన లంచ్‌మోషన్ పిటిషన్‌ను అత్యవసరంగా విచారణ చేసేందుకు హైకోర్టు నిరాకరించింది. దీనిని సాధారణ పద్ధతిలోనే విచారణ చేపడతామని జస్టిస్ కె సురేష్‌రెడ్డి ప్రకటించారు.

దసరా ఉత్సవాలకు సిఎంకు ఆహ్వానం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

శ్రీశైల ఆలయంలో ఈ నెల 15 నుంచి 24 వరకు జరగనున్న దసరా మహోత్సవాలకు హాజరుకావాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని దేవాదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి, ధర్మకర్తల మండలి అధ్యక్షులు రెడ్డివారి చక్రపాణిరెడ్డి మంగళవారం ఆహ్వానపత్రిక అందజేశారు. అలాగే విజయవాడలోని దుర్గా మల్లేశ్వరస్వామి వార్ల ఆలయంలో జరిగే దసరా ఉత్సవాలకు ఆహ్వానిస్తూ ఆహ్వాన పత్రికను మంత్రితోపాటు ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, ధర్మకర్తల మండలి అధ్యక్షులు కర్నాటి రాంబాబు దుర్గ గుడి నూతన ఇఒ కెఎస్ రామారావు అందజేశారు. విజయవాడలోని కనకదుర్గమ్మ ఆలయ ఇఒ కెఎస్ రామారావు భారతీనగర్‌లోని మంత్రి కొట్టు సత్యనారాయణ నివాసంలో భేటీ అయ్యారు. అన్ని శాఖల సమన్వయంతో దసరా ఉత్సవాలను విజయవంతం చేయాలని, యాత్రికులకు ఎటువంటి ఇబ్బందులు, అసౌకర్యాలు కలగకుండా చూడాలని ఇఒకు మంత్రి సూచించారు.

జీడి రైతుల నడ్డి విరిచిన కేంద్రం

- దిగుమతి సుంకాన్ని తగ్గించి పొట్టకొట్టారు
- మద్దతు ధర జిఒ ఇచ్చిన తరువాతే జిల్లా పర్యటనకు సిఎం రావాలి
- సదస్సులో వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

కేంద్ర ప్రభుత్వం జీడిపిక్కలపై దిగుమతి సుంకాన్ని ఐదు నుంచి 2.5 శాతానికి తగ్గించి దేశీయ జీడి రైతుల నడ్డి విరిచిందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. జీడికి గిట్టుబాటు ధర, జీడి పంట సమగ్రాభివృద్ధికి బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యాన శ్రీకాకుళం జిల్లా పలాసలోని టికెఆర్ కల్యాణ మండపంలో మంగళవారం సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో వి.శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. దిగుమతి సుంకం తగ్గించడంతో ఇండోనేషియా, వియత్నాం తదితర దేశాల నుంచి భారీగా జీడి పిక్కల దిగుమతులు వచ్చి పడుతున్నాయన్నారు. బహుళజాతి కంపెనీలకు జీడి రైతుల ప్రయోజనాలను బలిపెట్టాలని కేంద్ర ప్రభుత్వం చూస్తోందని విమర్శించారు. బిజెపి సర్కారుకు నిజంగా రైతులపై ప్రేమ ఉంటే దిగుమతి సుంకాన్ని పెంచి ఎగుమతులకు ప్రోత్సాహం కల్పించాలని డిమాండ్ చేశారు. కేరళలోని ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం జీడి పంట అభివృద్ధికి ప్రత్యేకంగా రాష్ట్ర స్థాయి బోర్డు ఏర్పాటు చేసిందని చెప్పారు. జీడి పిక్కల మార్కెటింగ్ కోసం రెండు కార్పొరేషన్లను ఏర్పాటు చేసిందని తెలిపారు. జీడి కార్మికుల కోసం సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసింది కేరళ ప్రభుత్వమేనని వివరించారు. ఒడిశా, తమిళనాడు, మహారాష్ట్ర ప్రభుత్వాలు జీడి పరిశ్రమ అభివృద్ధికి బోర్డులు ఏర్పాటు చేశాయని, రాష్ట్రంలో ఎందుకు ఏర్పాటు చేయలేదని ప్రశ్నించారు. జీడి పంటకు మద్దతు ధర ప్రకటించడంతో పాటు ఇ-క్రాప్ బుక్ చేసి పరిహారం వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. జీడి పిక్కలకు మద్దతు ధర, కొనుగోళ్లపై జిఒ ఇచ్చిన తర్వాతే జిల్లా పర్యటనకు ముఖ్యమంత్రి రావాలన్నారు.

సదస్సుకు హాజరైన జీడి రైతులు

ఎపి రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మర్రాపు సూర్యనారాయణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 16 రకాల పంటలకు, రాష్ట్ర ప్రభుత్వం ఏడు రకాల పంటలకు మద్దతు ధర ప్రకటించినా అందులో జీడి పంటకు చోటు కల్పించకపోవడం జీడి రైతులపై నిర్లక్ష్య ధోరణికి నిదర్శనమన్నారు. జీడి పప్పుకు ఎక్కువ ధర పలుకుతున్నా, పిక్కలకు ఆ మేరకు ధర రాకపోవడం వ్యాపారుల మాయాజాలమని తెలిపారు. ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించకపోవడం, ఆర్‌బికెల ద్వారా కొనుగోలు చేయకపోవడం వల్లే ఈ దుస్థితి వచ్చిందన్నారు. 80 కిలోల జీడిపిక్కల బస్తాకు రూ.16 వేలు గిట్టుబాటు ధర ఇవ్వాలని, ఆర్‌బికెల ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని ప్రవేశపెట్టిన తీర్మానాన్ని సదస్సు ఏకగ్రీవంగా ఆమోదించింది. దీంతోపాటు జీడి కార్మికులకు కనీస వేతనాలు, పిఎఫ్, ఇఎస్ఐ అమలు చేయలంటూ ప్రవేశపెట్టిన తీర్మానానికి ఆమోదం లభించింది. సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు అధ్యక్షతన సదస్సులో వామపక్ష పార్టీల నాయకులు చాపర వేణుగోపాల్, తామాడ సన్యాసిరావు, వంకల మాధవరావు, జీడి రైతులు, కార్మికులు పాల్గొన్నారు.

99 శాతం సంపదను కార్పొరేట్లకు దోచిపెడుతున్న జగన్

రాష్ట్ర సంపదను 99 శాతం అంబానీ, అదానీ వంటి కార్పొరేట్లకు దోచిపెట్టడమే జగన్ ప్రభుత్వం నాలుగున్నరేళ్లలో సాధించిన విజయమని శ్రీనివాసరావు విమర్శించారు. వైసిపి ప్రభుత్వం రైతులకు గిట్టుబాటు ధర ఇవ్వలేదని, సిపిఎస్ రద్దు చేస్తామన్న హామీనీ నిలబెట్టుకోలేదన్నారు. బిసిలకు కార్పొరేషన్లు ఏర్పాటు చేసి వాటి నిధులు కేటాయించలేదని, ఎస్‌సి సబ్‌ప్లాన్‌కూ నిధులు ఇవ్వలేదని తెలిపారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన అనేక హామీలు నెరవేర్చలేదన్నారు. 99 శాతం హామీలను అమలు చేశామని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చెప్తున్నారని, రాష్ట్రంలో సమస్యలతో బాధపడుతున్న ప్రజలంతా మిగిలిన ఆ ఒక్క శాతంలోనే ఉన్నారని తెలిపారు. వారే వచ్చే ఎన్నికల్లో జగన్‌ను ఓడిస్తారని అన్నారు.

బస్సు యాత్రను జయప్రదం చేయండి

- రీజనల్ కో ఆర్డినేటర్లతో సిఎం జగన్‌మోహన్‌రెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను, అభివృద్ధి కార్యక్రమాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు రాష్ట్ర వ్యాప్తంగా పార్టీ చేపట్టిన బస్సు యాత్రను జయప్రదం చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించారు. మంగళవారం తాడేపల్లిలోని క్యాంప్ కార్యాలయంలో పార్టీ రీజినల్ కోఆర్డినేటర్లతో ఆయన భేటీ అయ్యారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ మాట్లాడుతూ సామాజిక న్యాయ యాత్ర పేరిట చేపట్టనున్న బస్సుయాత్రను విజయవంతం చేయడానికి ప్రాంతాల వారీగా బాధ్యతలను తీసుకొని పనిచేయాలన్నారు. దసరా పండుగ తర్వాత అక్టోబరు 26 నుంచి బస్సు యాత్ర మొదలుపెట్టాలన్నారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో బస్సు యాత్ర సందర్భంగా బహిరంగ సభలు జరగాలన్నారు. రాష్ట్రంలోని మూడు ప్రాంతాలనుంచి ప్రతి రోజూ ఒక మీటింగు చొప్పున మొత్తంగా మూడు మీటింగులు నిర్వహించాలన్నారు.. స్థానిక ఎమ్మెల్యే లేదా పార్టీ ఇన్‌ఛార్జి సహా ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీవర్గాలకు చెందిన నాయకులు ఈ సభల్లో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాలను కవర్ చేస్తూ రెండునెలలపాటు ఈ బస్సు యాత్రను నిర్వహించాలన్నారు. విజయవాడలో పార్టీ ఇచ్చిన పిలుపును క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లేందుకు ప్రతి నియోజకవర్గంలో కార్యకర్తలకు అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని తెలిపారు. ఈ అవగాహన కార్యక్రమాల్లో గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వార్డు మెంబర్లు, ఎంపిటిసిలు, సర్పంచులు, వలంటీర్లు పాల్గొనేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో విజయసాయిరెడ్డి, పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి, సజ్జల రామకష్ణారెడ్డి, వైవి సుబ్బారెడ్డి, ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, బొత్స సత్యనారాయణ, చెవిరెడ్డి భాస్కరరెడ్డి, మర్రి రాజశేఖర్, ఆకేపాటి అమర్‌నాథ్ రెడ్డి, రామసుబ్బారెడ్డి, తలశిల రఘురామ్, లేళ్ల అప్పిరెడ్డి పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సిహెచ్ నర్సింగరావు

కృష్ణా జలాల కేటాయింపులపై పోరాడతాం

- పిఎసి కమిటీ చైర్మన్ పయ్యావుల కేశవ్
- చంద్రబాబుతో భువనేశ్వరి, బ్రాహ్మణి, పయ్యావుల కేశవ్ ములాఖత్

విలేకర్లతో మాట్లాడుతున్న కేశవ్

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

కృష్ణా జలాల కేటాయింపులపై పోరాడాలని చంద్రబాబు సూచించారని పిఎసి కమిటీ చైర్మన్ పయ్యావుల కేశవ్ తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని సెంట్రల్ జైలులో ఉన్న టిడిపి అధినేత చంద్రబాబుతో భువనేశ్వరి, బ్రాహ్మణిలతో కలిసి కేశవ్ మంగళవారం ములాఖత్ అయ్యారు. అనంతరం జైలు వద్ద ఆయన మీడియాతో మాట్లాడారు. జైలులో చంద్రబాబును చూడగానే బాధేసిందన్నారు. చేయని తప్పునకు శిక్ష అనుభవించడం కళ్లారా చూశానని తెలిపారు. చంద్రబాబును కలిసిన వెంటనే కృష్ణా జలాల అంశంపై ఆయన ఆరా తీశారన్నారు. కృష్ణా జలాల అంశంలో ప్రభుత్వ విధానాల వల్ల రాష్ట్రానికి తీవ్ర నష్టం జరుగుతోందని చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారని తెలిపారు. ఎపి, తెలంగాణ రాష్ట్రాలకు కృష్ణా జలాల కేటాయింపుల పున:సమీక్ష అంశంపై పార్టీ తరుపున గట్టిగా పోరాడాలని సూచించారన్నారు. చంద్రబాబు నిరంతరం రాష్ట్ర ప్రజల కోసమే ఆలోచిస్తున్నారని తెలిపారు. ప్రత్యర్థులు ఆయనను జైలులో పెట్టి రాజకీయంగా, మానసికంగా దెబ్బకొట్టాలని చూసినా మానసికంగా మరింత బలంగా తయారయ్యారని చెప్పారు. 'వై ఎపి నీడ్స్ జగన్' అని ప్రచారం మొదలు పెట్టారని.... ప్రజలు కూడా 'వై' అనే అడుగుతున్నారని అన్నారు. పోలవరాన్ని ముంచినందుకు, జాబ్ కేలండర్ ఇవ్వనందుకు, రైతులను మట్టిలో కలిపినందుకు, సాగునీటి ప్రాజెక్టులను నిర్వీర్యం చేసిందుకు వై ఎపి నీడ్స్ జగన్ అంటున్నారా? అని ప్రశ్నించారు. పవన్ కల్యాణ్‌పైనా మానసిక దాడి చేసేందుకు వైసిపి నాయకులు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. జైలులో చంద్రబాబు భద్రతపై చర్యలు తీసుకోవాలని, దీనిపై కేంద్రాన్ని, న్యాయస్థానాన్ని కోరుతామని చెప్పారు. ఆయన వెంట మాజీ హోం మంత్రి నిమ్మకాయల చినరాజప్ప తదితరులు ఉన్నారు.

చంద్రబాబు పిటిషన్‌పై విచారణ వాయిదా

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు సుప్రీంకోర్టులో దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌పై విచారణ శుక్రవారానికి వాయిదా పడింది. శుక్రవారం మధ్యాహ్నం రెండు గంటలకు తదుపరి విచారణ ఉంటుందని ధర్మాసనం వెల్లడించింది. మంగళవారం కూడా ఈ పిటిషన్‌పై సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ అనిరుద్ బోస్, జస్టిస్ బేలా ఎం త్రివేది నేతృత్వంలో ద్విసభ్య ధర్మాసనం విచారణ కొనసాగించింది. ఇరుపక్షాల న్యాయవాదులు హోరాహోరీగా వాదనలు వినిపించారు. చంద్రబాబు తరపున సీనియర్ న్యాయవాది హరీష్ సాల్వే వాదించగా, సిఐడి తరపున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ వాదనలు వినిపించారు. ప్రధానంగా 17 ఎ చుట్టూనే వాదనలు జరిగాయి. తొలుత గంటపాటు న్యాయవాది హరీష్ సాల్వే వాదనలు వినిపించారు. అనంతరం న్యాయవాది ముకుల్ రోహత్గీ వాదనలు వినిపించారు. ప్రజా ధనం దుర్వినియోగం అయిందని, చంద్రబాబు చర్యలతో ఎపికి నష్టం జరిగిందని వాదించారు. సుదీర్ఘంగా వాదనలు జరగడంతో జోక్యం చేసుకున్న ధర్మాసనం వాదనలు వినిపించేందుకు ఇంకా ఎంత సమయం పడుతుందని అడగ్గా, మరో గంటపాటు పడుతుందని ముకుల్ రోహత్గీ తెలిపారు. మిగతా వాదనలు శుక్రవారం వింటామని ధర్మాసనం అనగా, అందుకు చంద్రబాబు తరపు న్యాయవాది సిద్ధార్థలూత్రా జోక్యం చేసుకుని 'ఈ రోజే వాదనలు పూర్తి చేయాలి' అని అన్నారు. చాలా కేసులు ఉన్నాయని, వినేందుకు సమయం లేదని ధర్మాసనం పేర్కొంది. శుక్రవారం వాదనలు వినిపిస్తామని ముకుల్ రోహత్గీ అనగా, చంద్రబాబు తరపు న్యాయవాది సిద్ధార్థ లూత్రా గురువారానికి వాయిదా వేయాలని కోరారు. దీంతో తదుపరి విచారణను ధర్మాసనం శుక్రవారానికి వాయిదా వేసింది.

జిందాల్‌ను స్టీల్‌ప్లాంట్‌లోకి అనుమతించం

- విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌లోకి జిందాల్ యాజమాన్యాన్ని అడుగుపెట్టనిచ్చేది లేదని, ఆ కంపెనీని దొడ్డిదారిన ప్లాంట్‌లోకి తీసుకురావాలనే ఉక్కు యాజమాన్య నిర్ణయాన్ని అంగీకరించబోమని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు స్పష్టం చేశారు. ఉక్కునగరంలో మంగళవారం పోరాట కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పోరాట కమిటీ చైర్మన్ సిహెచ్ నర్సింగరావు మాట్లాడుతూ ప్రయివేటీకరణపై ఉక్కు కార్మికుల పోరాటానికి భయపడి దొడ్డిదారిన ప్లాంట్‌లోని ఒక్కొక్క విభాగాన్నీ అమ్మకానికి పెడుతున్నారని అన్నారు. ఈ చర్యలకు వ్యతిరేకంగా ఈ నెల 12 నుంచి 20వ తేదీ వరకూ విస్తృత ప్రచారం చేపడతామన్నారు. త్వరలో రాష్ట్ర ముఖ్యమంత్రిని, ఉక్కు మంత్రిని కలుస్తామని తెలిపారు. ఉక్కు పరిరక్షణ పోరాటాన్ని మరింత ఉధృతం చేయనున్నామన్నారు. కార్మికులు పెద్ద సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. పోరాట కమిటీ చైర్మన్ డి ఆదినారాయణ మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ మనుగడను దెబ్బతీసేందుకు కేంద్రం కుట్రలు పన్నుతోందన్నారు. వాటిని ఐక్య పోరాటాలతో తిప్పికొడతామని చెప్పారు. పోరాట కమిటీ కో-కన్వీనర్ నీరుకొండ రామచంద్రరావు మాట్లాడుతూ స్థానిక స్టీల్ యాజమాన్యం హామీలను నెరవేర్చడంలో వైఫల్యం చెందిందని విమర్శించారు. సమావేశంలో పోరాట కమిటీ కన్వీనర్ కెఎస్ఎన్ రావు, కో - కన్వీనర్ జె అయోధ్యరామ్, ఉక్కు అధికారుల సంఘం ప్రధాన కార్యదర్శి కెవిడి.ప్రసాద్, పోరాట కమిటీ నాయకులు యు రామస్వామి, వైటి దాస్, జె రామకృష్ణ, మసేన్‌రావు, వై మస్తానప్ప, బొడ్డు పైడిరాజు, దొమ్మేటి అప్పారావు, వరసాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై పారిశుధ్య కార్మికుల మెరుపు సమ్మె

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

కార్మిక నేతలతో చర్చలు జరుపుతున్న మేయర్, కమిషనర్

ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేయాలని, పెండింగ్ సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పారిశుధ్య కార్మికులు మంగళవారం మెరుపు సమ్మెకు దిగారు. ఎపి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) ఆధ్వర్యంలో కార్మికులు ప్రకాశం జిల్లా ఒంగోలులోని అన్ని మస్టర్ పాయింట్ల వద్ద విధులు బహిష్కరించి కార్పొరేషన్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు చీకటి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ఈ ఏడాది ఆగస్టు ఒకటో తేదీన అధికారుల సమక్షంలో కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళనను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్మికుల సమ్మె విషయం తెలుసుకున్న మేయర్ గంగాడ సుజాత, డిప్యూటీ మేయర్ వెలనాటి మాధవరావు, కమిషనర్ ఎం వెంకటేశ్వరరావు, హెల్త్ ఆఫీసర్ మనోహర్‌రెడ్డి, శానిటరి సూపర్‌వైజర్ ఎన్ పిచ్చయ్య, కార్మికులు, కార్మిక నేతలతో చర్చలు జరిపారు. చనిపోయిన కార్మికుల స్థానంలో వారి కుటుంబ సభ్యులకు పనికల్పిస్తామని, కోవిడ్ కార్మికులు, ఇతర కార్మికులను ఆప్కాస్‌లో చేర్చే విషయంపై వెంటనే స్టాండింగ్ కమిటీ సమావేశంలో తీర్మానించామని, కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి నివేదిక పంపిస్తామని మేయర్, కమిషనర్ హామీ ఇచ్చారు. సమస్యల పరిష్కారానికి లిఖిత పూర్వక హామీ ఇవ్వడంతో కార్మికులు వారి ఆందోళనను తాత్కాలికంగా విరమిస్తున్నట్లు ప్రకటించారు.

ఉత్సాహంగా దసరా సాంస్కృతికోత్సవాలు

- అలరించిన కోలాట నృత్యాలు
- ప్రత్యేక ఆకర్షణగా బతుకమ్మ ఆట, పాట

ప్రజాశక్తి - విజయవాడ, విజయవాడ అర్బన్

మాట్లాడుతున్న సిద్ధార్థ మహిళా కళాశాల ప్రిన్సిపల్ పద్మజ

దసరా సాంస్కృతికోత్సవాల్లో సంప్రదాయ నృత్యం

దసరా సాంస్కృతికోత్సవాలు కోలాటం, శాస్త్రీయ నృత్యం, జానపద నృత్యాలు, బతుకమ్మ ఆటలతో ఎన్‌టిఆర్ జిల్లా విజయవాడలో మంగళవారం ఉత్సాహంగా జరిగాయి. నగరంలోని సంగీత కళాశాలలో దసరా సాంస్కృతిక ఉత్సవాల నిర్వహణ కమిటీ ఆధ్వర్యాన 'దసరా సాంస్కృతికోత్సవాలు' పేరుతో నిర్వహించిన ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. మహిళలు కోలాటాలతో అలరించారు. సుమారు 27 బృందాలు కోలాట నృత్యంలో పాల్గొన్నాయి. జానపద, శాస్త్రీయ నృత్యాలతో నగరంలోని వివిధ కళాశాలల విద్యార్థినులు చక్కని సందేశాలు ఇచ్చారు. ఆంధ్రా లయోలా, పిబి సిద్ధార్థ, సిద్ధార్థ మహిళా, నలంద, కెబిఎన్ కళాశాలల నుండి విద్యార్థినులు పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. ఫోరం ఫర్ ఆర్టిస్ట్స్ మహిళా విభాగం ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ ఎగ్జిబిషన్‌లో సుమారు 30 మంది మహిళలు, యువతులు వందకుపైగా కళాకృతులను ప్రదర్శించారు. ఈ ఎగ్జిబిషన్‌ను విజయవాడకు చెందిన ప్రముఖ సీనియర్ క్రాఫ్ట్ ఆర్టిస్ట్ అనుమకొండ సరోజినీదేవి లాంఛనంగా ప్రారంభించారు. ఉత్సవాల్లో బతుకమ్మ పాటలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ముగింపు కార్యక్రమంలో ప్రముఖ పారిశ్రామికవేత్త బాయన వెంకట్రావు పాల్గొని విజేతలకు బహుమతులను అందజేశారు. సాంస్కృతిక ఉత్సవాల్లో భాగంగా విజయవాడలోని ఘంటసాల ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాల ఆడిటోరియంలో జరిగిన సభలో సిద్ధార్థ మహిళా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.పద్మజ మాట్లాడుతూ సంస్కృతీ, సంప్రదాయాలు చారిత్రక సంపదలని, వాటిని పరిరక్షించుకోవాల్సిన కర్తవ్యం ప్రతి ఒక్కరిపై ఉందని తెలిపారు. దసరా సాంస్కృతికోత్సవాల నిర్వహణ కమిటీ కన్వీనర్ కె.స్వరూపరాణి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంబి విజ్ఞాన కేంద్రం నిర్వహణ కమిటీ కార్యదర్శి పి.మురళీకృష్ణ, సంగీత కళాశాల ప్రిన్సిపల్ విష్ణుభట్ల కృష్ణవేణి, ప్రముఖ ఆర్టిస్ట్ అమృపాలి పార్వతీ, సేఫ్ సెక్రటరీ పి.జ్యోత్స్న, జన శిక్షణ సంస్థాన్ డైరెక్టర్ ఎస్.విద్యా కన్నా, ప్రముఖ రచయిత్రి వేమూరి సత్యవతి, భారత మహిళా మండలి బాధ్యులు సూర్య కామేశ్వరి, సాహితీ సంస్థ నిర్వాహకులు కె ఉషారాణి, చిత్రకారిణి ఎ.సంధ్యారాణి, సుహృప్తి నాయకులు భారతీదేవి, ఇన్నర్ వీల్ ప్రెసిడెంట్ హరితాదేవి, హైకోర్టు అడ్వకేట్ మాగంటి అనూరాధ, రిటైర్డ్ వ్యవసాయాధికారి ఝాన్సీలక్ష్మీ, ఎంబివికె శిక్షణా కేంద్రం మహిళా విభాగం బాధ్యులు పి.విజయ, ఆక్వాడెవిల్, ఉత్సవాల కమిటీ సభ్యులు విజయశ్రీ గుప్తా పాల్గొన్నారు.

అలుపెరుగని పోరాట ఫలితం

- 'సిఐటియు'తో కార్మికుల జీవితాల్లో వెలుగు
- టిటిడిలో ఆరువేల మందికి వేతనాల లబ్ధి

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

తిరుమల తిరుపతి దేవస్థానంలో రెండు దశాబ్దాలపాటు సాగించిన పోరాటం ఫలించింది. ఆరువేల మంది కాంట్రాక్టు పారిశుధ్య కార్మికుల జీవితాల్లో వెలుగు నింపింది. తిరుమల అన్నమయ్య భవనంలో సోమవారం జరిగిన టిటిడి ధర్మకర్తల మండలి సమావేశంలో 3,500 మంది పారిశుధ్య కార్మికులకు, 2,500 మంది ఎఫ్ఎంఎస్ (ఫెసిలిటీ మేనేజిమెంట్ సర్వీసు) కార్మికులకు వేతనాలు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ప్రతి ఏటా మూడు శాతం వేతన పెంపు చేయనున్నట్లు వెల్లడించింది. టిటిడి బోర్డు తీసుకున్న నిర్ణయం వెనుక రెండు దశాబ్దాల పాటు సిఐటియు ఆధ్వర్యంలో జరిపిన పోరాటం ఉంది. జీతాల పెంపుతో పాటు శ్రీవారి లడ్డు కార్డు, బస్ పాసు, దర్శనం అవకాశం కల్పించాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు.

టిటిడిలో 1991 నుంచి కాంట్రాక్టు వ్యవస్థ

టిటిడిలో 1991 నుంచి రెగ్యులర్ పోస్టుల భర్తీని ఆలయ అధికారులు నిలిపేశారు. ఒకప్పుడు 18 వేల మంది పర్మినెంట్ కార్మికులు ఉండగా రిటైర్డ్ అవుతూ దాదాపు ఎనిమిది వేలకు కుదించబడ్డారు. ఉద్యోగ విరమణ చేసిన వారి స్థానంలో కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ కార్మికులను నింపుతూ వచ్చారు. ప్రస్తుతం వీరి సంఖ్య టిటిడిలో 16 వేలు దాటింది. ఎప్పటికైనా పర్మినెంట్ చేస్తారన్న నమ్మకంతో రూ.2,500 నుంచి రూ.3 వేల జీతం తీసుకుంటూ పని చేస్తున్నారు. తిరుమలలో రోడ్లు, మరుగుదొడ్లు శుభ్రం చేయడం, యాత్రికులు ఖాళీ చేసిన కాటేజీలను శుభ్రం చేయడం వంటి పనులు వీరు చేసేవారు. పరిశుభ్రతలో ప్రపంచంలోనే తిరుమల నంబర్ వన్‌గా ఉందంటే వీరు అందిస్తున్న సేవలే కారణం. జీతాలు పెంచాలని, కనీస వేతనం ఇవ్వాలని, ఇఎస్ఐ, పిఎఫ్ సౌకర్యం కల్పిస్తూ రెగ్యులర్ చేయాలని సిఐటియు ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులు దశలవారీగా ఆందోళనలు చేస్తూనే ఉన్నారు. ఎట్టకేలకు 20 సంవత్సరాల తరువాత జీతాలను పెంచుతూ టిటిడి బోర్డు నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం రూ.12 వేలు వేతనం ఇస్తున్నారు. ఇఎస్ఐ, పిఎఫ్ పోను రూ.9 వేలు చేతికి తీసుకుంటున్నారు. పెంచిన జీతం అమల్లోకి వస్తే ఇఎస్ఐ, పిఎఫ్ పోను రూ.14 వేలు చేతికి అందనుంది.

'సిఐటియు' వల్లే మా బతుకుల్లో వెలుగు : పార్థసారథిరెడ్డి, ఎఫ్ఎంఎస్ కార్మికుడు

20 ఏళ్లుగా మా హక్కులు, జీతభత్యాల కోసం ఎర్రజెండా నీడలో పోరాడుతూనే ఉన్నాం. సిఐటియు ఎల్లప్పుడు ప్రత్యక్షంగా మా వెన్నంటే ఉంది. జీతాల పెంపుదల సాధించామంటే సిఐటియు పోరాటాల ఫలితమే. టిటిడి చైర్మన్‌కు, ఇఒకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలుపుతున్నాం.

పోరాటాల ఫలితమే వేతనాల పెరుగుదల : టి.సుబ్రమణ్యం, యూనియన్ గౌరవాధ్యక్షులు

సిఐటియు ఆధ్వర్యంలో టిటిడిలో అలుపెరుగని పోరాటాలు చేసిన ఫలితంగానే కార్మికులకు ఐదువేల రూపాయల వేతనం పెరిగింది. రెండేళ్లుగా వివిధ దశల్లో పోరాటాలను విస్తృతంగా చేశాం. 14 రోజులపాటు టిటిడి పరిపాలనా భవనం ఎదుట వేలాదిమందితో ఎండవాన, రాత్రి పగలు తేడా లేకుండా దీక్షలు చేపట్టాం. ఈ సందర్భంగా కార్మికులపై, నాయకులపై 14 కేసులు నమోదయ్యాయి. కార్మికులు ఐక్యంగా పోరాడిన ఫలితంగానే వేతనాలు పెరిగాయి.

రాజ్‌భవన్ ధర్నాలకు స్టీరింగ్ కమిటీ

- ఎపి రైతు సంఘాల సమన్వయ సమితి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సమావేశంలో మాట్లాడుతున్న ఉమామహేశ్వరరావు, చిత్రంలో వడ్డే శోభనాద్రీశ్వరరావు, కేశవరావు, ప్రసాద్, ఓబులేషు తదితరులు

నవంబరు నెల 26, 27, 28 తేదీల్లో రాజ్‌భవన్ వద్ద చేపట్టనున్న మహాధర్నాను జయప్రదం చేసేందుకు 8మంది సభ్యులతో స్టీరింగ్ కమిటీని ఎపి రైతు సంఘాల సమన్వయ సమితి నియమించింది. ఇందులో మాజీమంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు, వై.కేశవరావు, కెవివి ప్రసాద్, జి.ఓబులేషు, యు.ఉమామహేశ్వరరావు, చుండూరు రంగారావు, సింహాద్రి ఝాన్సీ, చిట్టిపాటి వెంకటేశ్వర్లు ఉన్నారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఎపి రైతు సంఘాల సమన్వయ సమితి, కార్మిక సంఘాలు సంయుక్తంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్టీరింగ్ కమిటీ త్వరలో సమావేశమై మరికొన్ని సబ్ కమిటీలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అనంతరం వడ్డే శోభనాద్రీశ్వరరావు మీడియాతోమాట్లాడుతూ రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను అనుసరిస్తున్న మోడీ ప్రభుత్వాన్ని సాగనంపాలని దేశ వ్యాప్తంగా జరుగుతున్న ఉద్యమంలో భాగంగా రాజ్‌భవన్ వద్ద మహాధర్నాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు యు.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ప్రజాకంటకమైన ఉపా, దేశద్రోహం, మనీ లాండరింగ్ లాంటి నిరాధార ఆరోపణలతో ప్రతిపక్షనాయకులను ,సంస్థలను వేధిస్తోందని అన్నారు. అదే సమయంలో రైతు కార్మిక విధానాలను అనుసరిస్తోందన్నారు. ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు జి.ఓబులేషు మాట్లాడుతూ లక్షల కోట్ల రూపాయల ప్రజా సంపదను అదాని, అంబానీలకు కేంద్ర ప్రభుత్వం దోచిపెడుతోందన్నారు. కృష్ణా జలాల పంపిణీ సక్రమంగా లేదని, రాష్ట్రానికి అన్యాయం జరుగుతున్న విషయం సిఎంకు తెలిసినా ఏమీ మాట్లాడకపోవడం అన్యాయమన్నారు. ఈ సమావేశంలో రైతు సంఘం, కార్మిక సంఘాల నాయకులు, ఎపి రైతు స ంఘం ప్రధాన కార్యదర్శి కెవివి ప్రసాద్, రైతు సంఘం సీనియర్ నాయకులు వై.కేశవరావు, కుర్రా నరేంద్ర, పి.జమలయ్య, చేండూరు ర ంగారావు, ఎవి నాగేశ్వరరావు, వి.కృష్ణయ్య, వి.వెంకటేశ్వర్లు, దడాల సుబ్బారావు, వి.కృష్ణయ్య, ఎం.గిరీష్, కె.బసవయ్య. ఎ.రవిచంద్ర, గొల్లపూడి ప్రసాద్, కె.వీరబాబు పాల్గొన్నారు.

దేవాదాయ భూముల జాబితాలో చేర్చిన ప్రైవేటు భూములకు ఎన్‌ఓసిల జారీ

- మంత్రి కొట్టు సత్యనారాయణ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

దేవాదాయశాఖ భూముల జాబితాలో చేర్చిన ప్రైవేటు భూములకు ఎన్‌ఓసిలు జారీ చేయనున్నట్లు రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ పేర్కొన్నారు. దేవాలయాల ఆదాయాలకు అనుగుణంగా అప్‌గ్రేడేషన్‌కు సంబంధించిన ప్రతిపాదనలను త్వరలో కేబినెట్ ఆమోదం కోసం పెడుతున్నట్లు చెప్పారు. సచివాలయంలో నాల్గో బ్లాక్‌లో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఆలయాల వర్గీకరణ నేపథ్యంలో దాదాపు 14మంది అసిస్టెంట్ కమిషనర్లకు డిప్యూటీ కమిషనర్లుగా పదోన్నతి కల్పించే అవకాశం ఉందన్నారు. ఖాళీ కానున్న నాలుగు అసిస్టెంట్ కమిషనర్ల పోస్టుల భర్తీ గురించి వచ్చే సోమవారం ఆయా ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో చర్చించనున్నట్లు తెలిపారు. కోర్టుల్లో ఉన్న కేసులను ఉద్యోగులు ఉపసంహరించుకున్నట్లయితే అర్హత, సీనియారిటీ ప్రకారం పదోన్నతుల ద్వారా ఆయా పోస్టులను భర్తీ చేస్తామన్నారు. వాడపల్లి వెంకటేశ్వరస్వామి దేవాలయం డిప్యూటీ కమిషనర్ స్థాయి దేవాలయంగా అప్‌గ్రేడ్ అవుతున్న నేపథ్యంలో ఆ దేవాలయంలో సిబ్బంది కొరత సమస్య కూడా త్వరలోనే సమిసి పోతుందన్నారు.

సుడిదోమ కలవరం

- వేలాది ఎకరాలపై దోమపోటు
- సిక్కోలు రైతుకు మరో కష్టం

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

వర్షాభావంతో అసలే పంటలు సరిగా వేయలేని పరిస్థితుల్లో ఉన్న సిక్కోలు రైతులకు మరో కష్టం వచ్చి పడింది. వర్షపాతం తక్కువగా నమోదై, సాగునీరు అందించిన ప్రాంతాల్లో పంట సాగవుతోంది. కరువు పరిస్థితుల నుంచి బయటపడిన రైతాంగానికి సుడిదోమ రూపంలో మరో కష్టం వచ్చింది. జిల్లా వ్యాప్తంగా వరికి సుడిదోమ ఆశించిందంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతానికి పురుగుల మందులు వినియోగిస్తున్నా, అవి ఎంతవరకు పనిచేస్తాయన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. వాతావరణంలో వస్తున్న మార్పులే సుడిదోమ పోటుకు ప్రధాన కారణమని వ్యవసాయ శాస్త్రవేత్తలు చెప్తున్నారు. శ్రీకాకుళం జిల్లాలో ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో పంటల సాగు విస్తీర్ణం తగ్గింది. 4,37,153 ఎకరాల్లో పంటలు వేయాల్సి ఉండగా, 3,81,833 ఎకరాల్లో మాత్రమే వేయగలిగారు. ఇందులో వరి పంట 3,98,750 వేయాల్సి ఉండగా, 3,53,325 ఎకరాల్లోనే ప్రస్తుతం సాగులో ఉంది. పంట పూర్తి స్థాయిలో చేతికొచ్చే పరిస్థితి కనిపించడం లేదు. వేలాది ఎకరాల్లో సుడిదోమ ఆశించింది. దీంతోపాటు కొన్నిచోట్ల కుళ్లు తెగుళ్లు సోకాయి.

ప్రధానంగా స్వర్ణ (ఎండియు 7029), సాంబమసూరి (బిపిటి 5204), శ్రీధృతి (ఎంటియు 1121), మార్టూరు సాంబ (ఎంటియు 1224) రకాలతోపాటు ఇతర ప్రయివేట్ వరి వంగడాలు సాగు చేస్తున్న పొలాల్లో దోమ ఉధృతి ఎక్కువగా ఉన్నట్లు వ్యవసాయ శాస్త్రవేత్తలు గుర్తించారు. పొందూరు మండలంలో 2,500 ఎకరాలు, కోటబొమ్మాళి మండలంలో సుమారు 1500 ఎకరాలు, సోంపేటలో 200 ఎకరాలు, జి.సిగడాం మండలంలో వంద ఎకరాల వరకు వరి పంట దోమపోటుకు గురైంది. వ్యవసాయ శాఖాధికారుల క్షేత్రస్థాయి పరిశీలన తర్వాత ఎన్ని వేల ఎకరాలకు సుడిదోమ ఆశించిందనే వివరాలు తెలియనున్నాయి. పంట దిగుబడుల పైనా ప్రభావం చూపనుందని అధికారులు చెప్తున్నారు.

భుతపల్లిలో దోమపోటుకు గురైన పొలాలను పరిశీలిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

సోంపేట మండలం భుతపల్లిలో దోమపోటుతో ఎండిన వరి పైరు

శాస్త్రవేత్తలు గుర్తించిన కారణాలు ఇవే...

సుడిదోమ సోకిన పంట పొలాల్లో వ్యవసాయ శాస్త్రవేత్తలు పర్యటిస్తున్నారు. పగటి ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉండడం, రాత్రులు ఒక్కసారిగా చల్లబడడం వంటి తేడాల వల్ల సుడిదోమ వ్యాప్తికి కారణమైందని గుర్తించారు. ఎరువుల కొరత వల్ల పొటాష్ తగినంతగా వాడకపోవడమూ మరో కారణంగా భావిస్తున్నారు.

ప్రభుత్వం నుంచి ఏదీ సాయం?

వాతావరణ పరిస్థితుల ప్రభావంతో తెగుళ్లు, దోమపోటు ఉంటుందని అంచనా అధికారులకు ఉన్నా రైతులను అప్రమత్తం చేయలేదు. విత్తనం నుంచి ధాన్యం కొనుగోలు వరకు ఆర్‌బికెలు అంటూ ప్రచారం చేస్తున్న ప్రభుత్వం... విపత్తు సమయంలో రైతు భరోసా కేంద్రాల నుంచి సబ్సిడీపై ఉచిత మందులను పంపిణీ చేసే ఆలోచన చేయకపోవడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పొలమంతా వ్యాపించింది

నేను రెండు ఎకరాల్లో వరి వేశాను. పంట అంతా బాగుందనుకున్న సమయంలో పొలమంతా సుడిదోమ ఆశించింది. వెంటనే గుర్తించి పురుగుల మందులు వాడాను. వచ్చే రోజుల్లో ఎలా ఉంటుందోనని ఆందోళనగా ఉంది.

- సనపల వెంకటరావు, రైతు, సందిగాం

పురుగుమందుల కోసం రూ.3 వేలు ఖర్చు

సుడిదోమ సోకడంతో రెండు ఎకరాల్లో దోమపోటు నివారణ కోసం రూ.మూడు వేలు ఖర్చు చేసి మందులు చల్లాను. దిగుబడి తగ్గవచ్చని శాస్త్రవేత్తలు చెప్తున్నారు.

- మరిదా ఈశ్వరరావు, రైతు, సందిగాం

జాగిలాల శిక్షకులకు జ్ఞాపికలను అందజేస్తున్న మంత్రి

నేర పరిశోధనలో జాగిలాల పాత్ర ప్రసంశనీయం

- హోం మంత్రి తానేటి వనిత
- 6వ బెటాలియన్‌లో జాగిలాల డెమో పరిశీలన

ప్రజాశక్తి - మంగళగిరి (గుంటూరు జిల్లా)

ప్రస్తుత సమాజంలో పెరుగుతున్న నేరాలకు అనుగుణంగా నేర పరిశోధనకు, నియంత్రణకు, తీవ్రవాద చర్యలను సమర్థవంతంగా ఎదుర్కోవడానికి, ప్రముఖుల భద్రతా చర్యలకు అవసరమైన శిక్షణ జాగిలాలకు ఇవ్వడం ప్రశంసనీయమని రాష్ట్ర హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి డాక్టర్ తానేటి వనిత పేర్కొన్నారు. గుంటూరు జిల్లా మంగళగిరి 6వ బెటాలియన్ ఇంటలిజెన్స్ సెక్యూరిటీ వింగ్‌లోని కెనైన్ ట్రైనింగ్ సెంటర్‌లో శిక్షణ పూర్తి చేసుకున్న 21వ బ్యాచ్‌కు చెందిన 35 జాగిలాల డెమో ప్రదర్శనను హోం మంత్రి తిలకించారు. జర్మన్ షెఫర్డ్ ఇంగ్లీష్ కాకర్ స్పానియల్, గోల్డెన్ రిట్రైవర్, లాబ్రాడర్, బెల్జియన్ మెలినాయిస్ వంటి ఐదు జాతులకు చెందిన జాగిలాల విన్యాసాల ప్రదర్శనను, పోలీసుల ఔట్ పరేడ్ మార్చ్ ఫాస్ట్‌ను ఆసక్తిగా చూశారు. రాష్ట్ర విభజనానంతరం ప్రతికూల పరిస్థితుల మధ్య రాష్ట్రంలో పోలీసు జాగిలాలకు శిక్షణ కేంద్రం ఏర్పాటు చేసి, రాష్ట్ర పోలీసు వ్యవస్థ అవసరాలకు అనుగుణంగా జాగిలాలకు శిక్షణ ఇచ్చి, విధులకు సన్నద్ధం చేస్తున్న అధికారులను, 54 మంది డాగ్ హ్యాండ్లర్లను మంత్రి బహుమతులు, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేర విచారణలో, నేరస్తుల జాడ పసిగట్టే ప్రక్రియలో, మత్తు, పేలుడు పదార్థాలను గుర్తించడంలో, శాంతి భద్రతల పరిరక్షణలో జాగిలాల పాత్ర ప్రశంసనీయమన్నారు. నేర పరిశోధనకు, నేర నియంత్రణకు, ప్రముఖ వ్యక్తుల వ్యక్తిగత భద్రత విధుల్లో, కొత్తగా ఏర్పాటు అయిన జిల్లాల అవసరాలకు అనుగుణంగా మరిన్ని జాగిలాలకు శిక్షణ ఇవ్వాల్సిన అవసరం ఎంతో ఉందని తెలిపారు. కార్యక్రమంలో హోంశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ హరీష్ కుమార్ గుప్తా, ఇంటలిజెన్స్ డిజిపి పి.ఎస్.ఆర్. ఆంజనేయులు, ఫైర్ డిపార్ట్‌మెంట్ సర్వీసెస్ డిజిపి పి.వి.సునీల్ కుమార్, ఎపిఎస్‌పి అడిషనల్ డిజిపి అతుల్ సింగ్, ఎస్ఐబీ ఐజిపి వినీత్ బ్రిజ్ లాల్, ఇంటలిజెన్స్ డిఐజి కె.రఘురామ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మరిన్ని డెలివరీ సంస్థలతో అమెజాన్ జట్టు

హైదరాబాద్ : ప్రస్తుత పండుగ సీజన్‌లో వినియోగదారులకు మరింత వేగంగా సేవలను అందించడానికి అమెజాన్ ఇండియా కొత్తగా 12 మంది డెలివరీ సర్వీస్ పార్టనర్ (డిఎస్‌పి)లతో జట్టు కట్టినట్లు పేర్కొంది. తెలంగాణ, కర్ణాటక, ఢిల్లీ ఎన్‌సిఆర్, మహారాష్ట్ర వ్యాప్తంగా తన డిఎస్‌పి కార్యక్రమంలో భాగంగా డెలివరీ ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ఆన్‌బోర్డ్ చేసుకున్నామని ఆ సంస్థ ప్రకటించింది. పండుగ సీజన్ సమయంలో అమెజాన్ ఇండియా లాస్ట్ మైల్ నెట్‌వర్క్‌ను ఈ కార్యక్రమం బలోపేతం చేస్తుందని పేర్కొంది. ఇప్పటికే 300 మంది చిన్న, మధ్య తరహా ఔత్సాహికవేత్తలతో భాగస్వామ్యం కలిగి ఉన్నట్లు తెలిపింది.

అమిత్‌షాకు 'సిసిఐ' నిరసన

- ఆందోళనకారుల అరెస్ట్
- సిసిఐ పునఃప్రారంభంపై స్పందించని షా
- కెటిఆర్‌ను సిఎం చేసేందుకే కెసిఆర్ తాపత్రయం
- ఆదిలాబాద్ జనగర్జన సభలో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్ర హోంమంత్రి అమిత్ షా పర్యటనలో సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సిసిఐ) నిరసన తాకింది. సిసిఐని తెరిపించాలని డిమాండ్ చేస్తూ సిసిఐ సాధన కమిటీ నాయకులు ప్లకార్డులు, నల్ల బెలూన్లు పట్టుకుని, కండువాలు ధరించి నిరసన తెలిపారు. పోలీసులు ఆందోళనకారులను అరెస్టు చేశారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో మంగళవారం బిజెపి జన గర్జనసభకు అమిత్ షా హాజరయ్యారు. ఇందిరా ప్రియదర్శిని మైదానం నుంచి డైట్ మైదానానికి ఆయన వస్తున్నారనే విషయం తెలుసుకున్న కమిటీ నాయకులు బాబూజగ్జీవన్‌రాం చౌక్‌లో ఒక్కసారిగా రోడ్డు మీదకు వచ్చారు. సిసిఐని తెరిపిస్తామని సభలో ప్రకటన చేయాలంటూ నినాదాలు చేశారు. అప్రమత్తమైన పోలీసులు వారిని అడ్డుకొని బండి దత్తాత్రి, అరుణ్‌కుమార్, బుట్టి శివకుమార్, వాగ్మారే ప్రశాంత్, స్నుజన్‌జెట్టి, అఖిల్, ఆసిఫ్, సోహెల్, రఘు, కలీం అరెస్టు చేసి మావల పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

సభలో అమిత్‌షా మాట్లాడుతూ రాష్ట్రంలో కారు పార్టీ స్టీరింగ్ మజ్లిస్ చేతిలో ఉందని, ఎంఐఎంపై ఆధారపడి ఈ సర్కారు నడుస్తోందని అన్నారు. ముఖ్యమంత్రి కెసిఆర్ పదేళ్ల నుంచి తన కొడుకును సిఎం చేసేందుకే తాపత్రయ పడుతున్నారని, ఆయనకు పేదలపై ఎలాంటి ప్రేమా లేదన్నారు. రాష్ట్రంలో బిజెపి అధికారంలోకి వస్తే విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహిస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి సెంట్రల్ యూనివర్సిటీ ప్రకటిస్తే ముఖ్యమంత్రి కెసిఆర్ స్థలం కేటాయించలేదని తెలిపారు. ఇప్పటికే రాష్ట్రంలో పసుపు బోర్డు, గిరిజన యూనివర్సిటీ మంజూరైందని గుర్తుచేశారు. కృష్ణాజలాల అంశంపైనా పార్లమెంటులో మాట్లాడి పరిష్కరించినట్లు తెలిపారు

రాష్ట్రంలో సిఎం కెసిఆర్ చాలా హామీలిచ్చారని కానీ వాటిలో ఒక్కటీ నెరవేర్చలేదన్నారు. ఆయన పేదల పనులు చేయరని, కేవలం ఆయన కుటుంబం కోసమే పనులు చేస్తుంటారని విమర్శించారు. ఈ సభలో కేంద్ర మంత్రి, పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కిషన్‌రెడ్డి, కరీంనగర్ ఎంపి బండి సంజయ్, ఎన్నికల మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మెన్ ఈటల రాజేందర్, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి తరుణ్‌చుగ్, ఆదిలాబాద్ ఎంపి సోయం బాపురావు, బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జనవరిలో అంతర్జాతీయ తెలుగు మహాసభ

- గజల్ శ్రీనివాస్

ప్రజాశక్తి - రాజానగరం (తూర్పుగోదావరి జిల్లా)

వచ్చే ఏడాది జనవరి 5, 6, 7 తేదీల్లో 2వ అంతర్జాతీయ తెలుగు మహా సభలను తూర్పు గోదావరి జిల్లా రాజానగరం సమీపంలోని గైట్ కళాశాల ప్రాంగణంలో నిర్వహించనున్నామని ఆంధ్ర సారస్వత పరిషత్ అధ్యక్షుడు డాక్టర్ గజల్ శ్రీనివాస్, చైతన్య విద్యా సంస్థల వ్యవస్థాపకుడు కెవివి సత్యనారాయణరాజు (చైతన్య రాజు) తెలిపారు. రాజానగరంలోని గైట్ కళాశాలలో మంగళవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వారు వివరాలను వెల్లడించారు. శ్రీ రాజరాజ నరేంద్ర పట్టాభిషేక సహస్రాబ్ది ఉత్సవాలను ఆంధ్రా సారస్వత పరిషత్, చైతన్య విద్యా సంస్థల సంయుక్తంగా నిర్వహిస్తున్నాయని తెలిపారు. ఇందులో భాగంగానే అంతర్జాతీయ తెలుగు మహా సభలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మహాసభలకు జాతీయ, అంతర్జాతీయ నాయకులు, పీఠాధిపతులు, చలనచిత్ర ప్రముఖులు పాల్గొంటారని అన్నారు.

మహా సభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న గజల్ శ్రీనివాస్, చైతన్యరాజు తదితరులు

తెలుగు భాషలో సుమారు 25 సాహితీ ప్రక్రియలపై సదస్సులు ఉంటాయన్నారు. 3 వేల మంది కవి సమ్మేళనంలో పాల్గొంటారని, 50 దేశాల నుంచి ప్రముఖులు హాజరుకానున్నారని తెలిపారు. భారతీయ సాంస్కృతిక ప్రదర్శనలు, కవులు, కళాకారులు, జానపద కళారూపాలు, కళాకారులు, హరిదాసులు, కొమ్ముదాసులు, భాషా పండితులు వస్తారన్నారు. వీటి నిర్వహణకు ఒక ప్రధాన వేదిక, రెండు ఉప వేదికలను సిద్ధం చేస్తున్నామని చెప్పారు. పుస్తక, కళా ప్రదర్శనలు ఉంటాయన్నారు. సంప్రదాయ కళలతోపాటు సంచార జాతుల కళా ప్రదర్శనలు ఉంటాయని చెప్పారు. 15 వేల మంది వీక్షించేలా సదుపాయాలు ఏర్పాటు చేశామని తెలిపారు. దూర ప్రాంతాల వారికి వసతి ఏర్పాట్లు చేస్తామని చెప్పారు. అనంతరం మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో పరిషత్ కార్యదర్శి రెడ్డిప్పా ధవేటి, ఉపాధ్యక్షుడు కడివెళ్లవారు ప్రసాద్, సమన్వయ కర్త కేశిరాజు రామప్రసాద్, గౌరవ సలహాదారులు బాబుశ్రీ, సభ్యులు అడ్డాల వాసుదేవరావు, గైట్ కళాశాల ప్రిన్సిపల్ టివి.శర్మ పాల్గొన్నారు.

అమాంతం పెరిగిన కుబేరులు

- 12 ఏళ్లలో 4.4 రెట్లు పెరిగిన సంఖ్య
- ఏడాదిలో రెట్టింపైన పలువురి సంపద
- అదానీని వెనక్కి నెట్టిన అంబానీ
- గౌతంకు హిండెన్‌బర్గ్ మర్చిపోని దెబ్బ
- ప్రతీ 20 రోజులకు ఇద్దరు కొత్త బిలియనీర్లు
- హురున్ రిచ్ లిస్ట్ -2023 వెల్లడి

న్యూఢిల్లీ : భారత్‌లో సామాన్యులు ఆదాయాలు లేక.. అధిక ధరలతో విలవిలలాడుతోంటే.. మరోవైపు కుబేరులు మాత్రం ఊహించని రీతిలో పెరిగిపోతున్నారు. సంఖ్యా, ఆదాయ పరంగాను భారీగా పెరిగారు. ఏడాదికేడాదికి వేల కోట్లు పోగేసుకుంటున్నారని హురున్ రిస్ట్ లిస్ట్ రిపోర్ట్‌తో వెల్లడయ్యింది. మంగళవారం నాడు "360 వన్ వెల్త్ హురున్ ఇండియా రిచ్ లిస్ట్ 2023" పేరుతో హురున్ ఓ రిపోర్ట్‌ను విడుదల చేసింది. క్రితం ఏడాది ఈ సంఖ్య 24గా ఉంది. ఆగస్టు 30 నాటి సంపద ఆధారంగా దేశ వ్యాప్తంగా 1,319 మందితో కూడిన ధనవంతుల జాబితాను హురున్ విడుదల చేసింది. లిస్టెడ్ కంపెనీల షేర్ ఆధారంగా, అన్‌లిస్టెడ్ కంపెనీలకు సంబంధించి ఇన్వెస్టర్ రౌండ్‌ల విలువ ఆధారంగా ఈ జాబితాను రూపొందించింది.

హురున్ రిపోర్ట్ వివరాలు.. భారత్‌లో గతేడాది వ్యవధిలో ప్రతి మూడు వారాలకు ఇద్దరు బిలియనీర్లు పుట్టుకొచ్చారు. ప్రస్తుతం దేశంలో 259 మంది బిలియనీర్లు ఉన్నారు. గత 12 ఏళ్లలో ఈ సంఖ్య 4.4 రెట్లు పెరిగింది. హురున్ జాబితాలో ఉన్నవారిలో 51 మంది సంపద వార్షిక ప్రాతిపదికన రెండింతలు పెరిగింది. గతేడాదిలో ప్రతీ 10 మందిలో ఎనిమిది మంది ఆదాయాలు పెరిగాయి.

ఈ జాబితాలో గౌతం అదానీని అధిగమించి రిలయన్స్ ఇండస్ట్రీస్ అధిపతి ముకేశ్ అంబానీ అగ్రస్థానంలోకి వచ్చారు. దీంతో భారత్‌లో మళ్లీ అత్యంత ధనవంతుడిగా అంబానీ నిలిచారు. అదానీ గ్రూపు ఛైర్మన్ గౌతం అదానీ సంపదకు హిండెన్‌బర్గ్ రిపోర్ట్ మర్చిపోలేని దెబ్బ కొట్టింది. అదానీ కంపెనీలు తీవ్ర ఆర్థిక అవకతవకలకు పాల్పడుతున్నాయని.. కృత్రిమంగా షేర్ల ధరలను పెంచుతుందని.. విదేశాల్లోని పలు డొల్ల కంపెనీలతో మోసాలకు పాల్పడుతోందని హిండెన్‌బర్గ్ ఈ ఏడాది జనవరిలో రిపోర్ట్ చేసిన విషయం తెలిసిందే. దీనిపై ప్రస్తుతం సుప్రీంకోర్టులో విచారణ జరుగుతోంది. దీంతో అదానీ సంపద 57 శాతం పతనమై రూ.4.74 లక్షల కోట్లకు పడిపోయింది. ప్రస్తుత ఏడాదిలో ముకేష్ అంబానీ సంపద రెండు శాతం పెరిగి రూ.8.08 లక్షల కోట్లకు చేరింది. హిండెన్‌బర్గ్ రిపోర్ట్‌లో గౌతం అదానీ సంపద తగ్గిపోయిందని హురున్ మేనేజింగ్ డైరెక్టర్, రీసెర్చ్ చీఫ్ అనస్ రెహ్మాన్ జునైద్ తెలిపారు.

హురున్ జాబితాలో సీరం ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన సైరస్ పూనావాలా దేశంలో మూడో అత్యంత సంపన్నుడిగా ఉన్నారు. గతేడాది పోలిస్తే ఆయన సంపద 36 శాతం ఎగిసి రూ.2.78 లక్షల కోట్లకు చేరింది. తర్వాత హెచ్‌సిఎల్ టెక్‌కు చెందిన శివ్ నాడార్ సంపద 23 శాతం ఎగబాకి రూ.2.28 లక్షల కోట్లకు పెరగడంతో ఆయన నాలుగో స్థానంలో నిలిచారు. తర్వాత స్థానాల్లో గోపిచంద్ హిందుజా, దిలీప్ సంఘ్వీ, లక్ష్మీ నివాస్ మిట్టల్, రాధాకృష్ణన్ దమానీ, కుమార్ మంగళం బిర్లా, నీరజ్ బజాజ్ నిలిచారు. బైజూస్ అధినేత రవీంద్రన్‌కు ఈ దఫా జాబితాలో చోటు దక్కలేదు.

ఇ-కామర్స్ వేదిక జెప్టో సహ వ్యవస్థాపకుడు కైవల్య వోరా ఈ జాబితాలో అత్యంత చిన్న వయస్కుడుగా ఉన్నారు. 20 ఏళ్ల వోరా రూ.1,000 కోట్ల సంపదను కలిగి ఉన్నారు. 94 ఏళ్ల వయసులో ప్రెసిషన్ వైర్స్ ఇండియాకు చెందిన మహేంద్ర రతిలాల్ మెహతా హురున్ ధనవంతుల జాబితాలో తొలిసారి చోటు దక్కించుకున్నారు. అత్యధికంగా ముంబయి నుంచి హురున్ ధనవంతుల జాబితాలో 328 మంది చోటు దక్కించుకున్నారు. తర్వాత ఢిల్లీ 199, బెంగళూరు 100మందితో తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. ఫార్మాస్యూటికల్ రంగం నుంచి 133 మంది, రసాయనాలు, పెట్రోకెమికల్స్ రంగం నుంచి 119 మంది, పారిశ్రామిక ఉత్పత్తుల రంగం నుంచి 96 మంది చొప్పున బిలియనీర్లు ఉన్నారు.

కాలవ శ్రీనివాసులును ఇంటి నుంచి బయటకు వెళ్లకుండా అడ్డుకుంటున్న పోలీసులు

రూ.100 కోట్లకు పైబడి ఖర్చు చేసే ప్రాజెక్టులకే జ్యుడీషియల్ ప్రివ్యూ

- గనులశాఖ సంచాలకులు విజి వెంకటరెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రభుత్వం రూ.100 కోట్లకు పైబడి ఖర్చు చేసిన ప్రాజెక్టులకే జ్యుడీషియల్ ప్రివ్యూకు పంపాలని నిబంధనల్లో ఉందని గనులశాఖ సంచాలకులు విజి వెంకటరెడ్డి స్పష్టం చేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఇసుక ఆపరేషన్స్‌లో ప్రభుత్వం ఎటువంటి వ్యయం చేయలేదన్నారు. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ ద్వారా టెండర్ల ప్రక్రియ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. టెండర్లు దక్కించుకున్న లీజుదారుడు ఇసుక తవ్వకం, విక్రయం చేస్తారన్నారు. అందుకు గానూ నిర్దేశించిన మొత్తాన్ని ప్రభుత్వానికే చెల్లిస్తారన్నారు. ప్రభుత్వ రంగ సంస్థ ఎపిఎండిసి రూ.100 కోట్లకు వ్యయం చేస్తోందని, అందుకే బీచ్ శాండ్ టెండర్లు జ్యుడీషియల్ ప్రివ్యూకు సమర్పించినట్లు పేర్కొన్నారు.

మాజీ మంత్రి కాలవ గృహ నిర్బంధం

ప్రజాశక్తి-రాయదుర్గం

మాజీ మంత్రి, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యుడు కాలవ శ్రీనివాసులును అనంతపురం పోలీసులు గృహ నిర్బంధం చేశారు. ఆయనపై రాయదుర్గం పోలీస్ స్టేషన్లో ఇటీవల నాలుగు కేసులు నమోదయ్యాయి. తనపై అక్రమంగా ఈ కేసులు ఎందుకు బనాయించారో తెలుసుకోవాలని అనంతపురం నుంచి రాయదుర్గం వెళ్లేందుకు మంగళవారం ఆయన సిద్ధమయ్యారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు అనంతపురంలోని ఆయన నివాసం వద్దకు పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. ఉదయం పది గంటలకు కాలవ ఇంటి నుంచి బయటకు వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ సమయంలో పోలీసులకు, కాలవ శ్రీనివాసులుకు మధ్య తోపులాట జరిగింది. బలవంతంగా పోలీసులు ఆయనను గృహ నిర్బంధం చేశారు. పోలీసుల తీరును నిరసిస్తూ ఆయన తన నివాసం ఎదుట రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ వైసిపి నాయకుల ప్రోద్భలంతో పోలీసులు కావాలనే టిడిపి నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్రమ కేసులు, కక్షసాధింపుల ద్వారా జగన్ మోహన్‌రెడ్డి ఏమీ సాధించలేరన్న విషయాన్ని తెలుసుకోవాలన్నారు. త్వరలోనే గుణపాఠం చెప్పే రోజు వస్తుందని హెచ్చరించారు.

చంద్రబాబును కాపాడటమే పురందేశ్వరి అజెండా

- మంత్రి అంబటి రాంబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఏనాడూ చట్టాన్ని గౌరవించకుండా, వ్యవస్థలను మేనేజ్ చేస్తూ విచారణను తప్పించుకున్న చంద్రబాబు నాయుడు ఇప్పుడు ఆధారాలతో దొరికిపోయారని జలవనరులశాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు.

అందుకే ఆయన్ను కాపాడుకోవాలని పురందేశ్వరి ఢిల్లీ పర్యటనకు వెళ్లినట్లు ఆరోపించారు.

తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్‌లో పురందేశ్వరి వున్నప్పుడు కేంద్ర మంత్రిగా కాపాడారని, ఇప్పుడు బిజెపి రాష్ట్ర అధ్యక్షులుగా చంద్రబాబు రక్షణకు పూనుకున్నారని ఆరోపించారు. టెక్నికల్ అంశాలపైనే చంద్రబాబు న్యాయవాదులు వాదనలు వినిపిస్తున్నారు తప్ప, నేరం చేయలేదని చెప్పడం లేదని అన్నారు. నారా లోకేష్ కూడా తప్పించుకోలేరని తెలిపారు.

నిధులు రావడం లేదు

- వివిధ శాఖల అసంతృప్తి

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

ఆర్థిక వ్యవహారాల కోసం ఏర్పాటుచేసిన పిడి (పబ్లిక్ డిపాజిట్) ఖాతాలు, గ్రీన్ ఛానెల్‌పై అనేక శాఖలు పెదవి విరుస్తున్నాయి. వీటి కారణంగా తమకు రావాల్సిన నిధులు సకాలంలో రావడంలేదన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నాయి. అత్యవసర వ్యయం కోసం ఏర్పాటు చేసిన గ్రీన్ ఛానెల్ పరిధిలో దాదాపు అన్ని శాఖలు ఉన్నాయి. ఆయా శాఖలకు బడ్జెట్‌లో కేటాయించిన నిధుల్లో కొంత భాగాన్ని ఈ గ్రీన్ ఛానల్‌లోకి జమ చేస్తున్నారు. అయితే ఈ మొత్తాన్ని ఆర్థికశాఖ ఇతర అవసరాలకు వాడుకుంటోందన్న విమర్శలు ఉన్నాయి. దీంతో అత్యవసర పనులకు కూడా నిధులు ఉండటం లేదు. శాఖాధిపతులు ఈ విషయాన్ని ఆర్థికశాఖ దృష్టికి కూడా తీసుకువచ్చారు. గ్రీన్ ఛానల్ నిర్వహణలలో క్రమశిక్షణ కనిపించడం లేదని కొన్ని శాఖల ఉన్నతాధికారులే వ్యాఖ్యానిస్తున్నారు. పిడి ఖాతాల్లోని నిధులను కూడా ఇతర అవసరాలకు మళ్లిస్తున్నారు. దీనిపై కూడా ఇంధన, పౌర సరఫరాల శాఖ వంటి కీలక శాఖలు ఆర్థికశాఖకు అనునిత్యం లేఖలు రాస్తూనే ఉన్నాయి. తమ దైనందిక వ్యవహారాలకు, తీసుకున్న రుణాలకు వడ్డీలు కూడా కట్టుకోలేకపోతున్నామని ఆ శాఖలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. అయితే, వీటిని ప్రభుత్వం పట్టించుకోవడం లేదు.

మనీలాండరింగ్ కేసులో లావా ఎండి అరెస్టు

వివోకు చెందిన మరో ముగ్గురు..

న్యూఢిల్లీ : మనీలాండరింగ్ అంశంలో లావా ఇంటర్నేషనల్ వ్యవస్థాపకుడు హరి ఓం రాయ్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) అరెస్ట్ చేసింది. రాయ్‌తో పాటు వివో మొబైల్స్ ఇండియాకు చెందిన ముగ్గురు ఎగ్జిక్యూటివ్‌లను అదుపులోకి తీసుకుంది. వివో మొబైల్స్ ఇండియా, గ్రాండ్ ప్రాస్పెక్ట్ ఇంటర్నేషనల్ కమ్యూనికేషన్స్ (జిపిఐసిపిఎల్)తో సహా 23 అనుబంధ కంపెనీలకు చెందిన 48 ప్రాంతాల్లో ఇడి సోదాలు నిర్వహించింది. జిపిఐసిపిఎల్ నేరపూరిత చర్యలకు పాల్పడిందని ఆరోపిస్తూ కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ చేసిన ఫిర్యాదు ఆధారంగా ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు చేస్తోంది. అయితే ఈ కేసులో లావా ఎండి అరెస్ట్‌నకు సంబంధించిన వివరాలను వెల్లడించలేదు.

భారత వృద్ధి 6.3 శాతమే..

- ఐఎంఎఫ్ అంచనా

న్యూఢిల్లీ : భారత వృద్ధి రేటు పడిపోనుందని ప్రపంచ బ్యాంక్ బాటలోనే అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ (ఐఎంఎఫ్) అంచనా వేసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జిడిపి 6.3 శాతానికి పరిమితం కావొచ్చని ఐఎంఎఫ్ తాజా రిపోర్ట్ స్పష్టం చేస్తోంది. 2023లో ప్రపంచ వృద్ధి రేటు 3 శాతం పెరుగొచ్చని పేర్కొంది. 2024లో 10 బేసిస్ పాయింట్లు తగ్గి 2.90 శాతంగా ఉండొచ్చని అంచనా వేసింది. ఐదు ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థ వైపు దూసుకుపోతోన్నామని ప్రధానీ మోడీ పదేపదే చెబుతున్న మాటలకు భిన్నంగా ఈ అంచనాలు వెలుపడటం గమనార్హం. ఇంతక్రితం 2022-23లో భారత స్థూల దేశీయోత్పత్తి (జిడిపి) 7.2 శాతంగా నమోదయ్యింది. 2021-22లో 9.1 శాతం వృద్ధి చోటు చేసుకుంది.

150 స్టోర్లకు విస్తరించిన కోస్టా కాఫీ

న్యూఢిల్లీ : కాఫీ బ్రాండ్ భారత్‌లో 150 స్టోర్లకు విస్తరించినట్లు ప్రకటించింది. నూతన స్టోర్‌ను న్యూఢిల్లీలో ఏర్పాటు చేయడం ద్వారా ఈ మైలురాయిని చేరినట్లు పేర్కొంది. కోకా కోలాకు చెందిన ఈ బ్రాండ్ 2005లో భారత మార్కెట్‌లోకి ప్రవేశించింది.

దేవయాని ఇంటర్నేషనల్ సహకారంతో విస్తరించింది. దేశంలోని టాప్ 8-10 నగరాల్లో కొత్త స్టోర్‌లను ప్రారంభించాలనే లక్ష్యంగా పెట్టుకున్నట్లు కోస్టా కాఫీ ఇండియా జిఎం వినయ్ నాయర్ పేర్కొన్నారు.

పోర్టర్ కొత్త క్యాంపెయిన్

న్యూఢిల్లీ : ప్రీమియర్ టెక్ ఆధారిత ఆన్ డిమాండ్ లాజిస్టిక్స్ కంపెనీ పోర్టర్ కొత్త క్యాంపెయిన్‌ను ప్రారంభించినట్లు తెలిపింది. క్రీడల సమయంలో డిజిటల్ ప్లాట్‌ఫారాలపై ప్రసారం చేసేందుకు మూడు ఆసక్తికర వాణిజ్య ప్రకటనలను సిద్ధం చేసినట్లు పేర్కొంది. వీటిలో తమ వేగవంతమైన, సమర్థవంతమైన, సరసమైన డెలివరీలను నిర్ధారించడంలో పోర్టర్ కట్టుదిట్టంగా అనుసరిస్తున్న నిబద్ధతను ప్రధానంగా ఈ క్యాంపెయిన్ సాగుతుందని పోర్టర్, కస్టమర్ గ్రోత్ మరియు ఎంగేజ్‌మెంట్ ఉపాధ్యక్షుడు మోహిత్ రాఠీ పేర్కొన్నారు. ప్రస్తుత క్రికెట్ పోటీల డిమాండ్‌ను లక్ష్యంగా చేసుకున్నామన్నారు.

సంపాదకీయం

యుద్ధం ఆపండి!

పాలస్తీనా సాయుధ పోరాట గ్రూప్ హమాస్, యూదు జాత్యహంకార ఇజ్రాయిల్ దళాల మధ్య దాడులు, ప్రతి దాడుల్లో అన్నెం పున్నెం ఎరుగని చిన్నారులతో సహా వందలాది మంది అమాయక పౌరులు చనిపోవడం యావత్ ప్రపంచాన్ని కలచివేస్తోంది. 'ఆపరేషన్ అల్ అక్సా'కు ప్రతిగా 'ఆపరేషన్ స్వోర్డ్స్' పేరుతో ఇజ్రాయిల్ చేపట్టిన భీకర వైమానిక దాడుల్లో 91 మంది పిల్లలతో సహా 560 మంది పాలస్తీనీయులు గత నాలుగు రోజుల్లో చనిపోయారు. మరో 2,900 మంది దాకా గాయపడ్డారు. పాలస్తీనా ప్రతిఘటనా గ్రూపులు చేపట్టిన భారీ ఆపరేషన్‌లో 800 మంది దాకా ఇజ్రాయిలీయులు మరణించారని, మరో 2,243 మంది గాయపడ్డారని పాశ్చాత్య మీడియా తెలిపింది. ఇంత భారీ యెత్తున ఘర్షణలు, హింస చోటు చేసుకోవడం గత ఇరవై ఏళ్లలో ఇదే మొదటిసారి. ఈ భయంకర మారణ హోమానికి పూర్తి బాధ్యత ఇజ్రాయిల్‌దేననడంలో మరో మాటకు తావులేదు. ఇజ్రాయిల్ చరిత్రలోనే అత్యంత ఫాసిస్టు తరహా పాలకుడిగా పేరుమోసిన నెతన్యాహు హమాస్ భారీ ఆపరేషన్‌ను సాకుగా తీసుకుని పాలస్తీనీయులపై పెద్దయెత్తున వైమానిక దాడులు కొనసాగించడంతోబాటు గాజాను పూర్తిగా దిగ్బంధించే చర్యలకు పాల్పడుతున్నాడు. పాలస్తీనా ప్రజలకు నీరు, ఆహారం, కరెంటు, ఇంధన సరఫరాలను అందకుండా చేస్తున్నాడు. 75 ఏళ్లుగా పాలస్తీనీయుల భూ భాగాలను ఆక్రమించుకుని, పాలస్తీనీయులను తమ సొంత గడ్డపై శరణార్థులుగా మార్చిన ఇజ్రాయిల్ అకృత్యాలకు అడ్డు అదుపులేకుండా పోయింది. అమెరికా అండ చూసుకునే అది మోర విడుచుకుని ఇంతగా బరితెగిస్తున్నది. ఇజ్రాయిల్ మిలిటరీ బడ్జెట్‌కు అమెరికా ప్రతి యేటా భారీగా సాయం అందిస్తున్నది. ఈ ఒక్క ఏడాదే 330 కోట్ల డాలర్ల నిధులు సమకూర్చింది. గాజాపై దండెత్తుతున్న ఇజ్రాయిల్‌కు మద్దతుగా బైడెన్ ప్రభుత్వం తన భారీ యుద్ధ విమాన నౌకలను, క్షిపణులను మధ్య దరా సముద్ర తీరంవైపు పంపుతున్నది. ఇజ్రాయిల్‌పై హమాస్ జరుపుతున్న దాడిని ఖండించాలని ప్రపంచ దేశాలపై ఒత్తిడి తెస్తున్నది. భారత్‌లో మోడీ ప్రభుత్వం ఇప్పటికే ఆ ఒత్తిడికి తలొగ్గింది. మితవాదం, జాత్యహంకారం వంటి విషయాల్లో నెతన్యాహుకు మోడీ ఏమాత్రం తీసిపోరనడానికి గత తొమ్మిదేళ్లలో దేశంలో చోటు చేసుకున్న ఘటనలే నిదర్శనం.

అసలు ఇజ్రాయిల్ పుట్టుకే విచిత్రమైనది. 1947 నవంబర్ 29న ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ పాలస్తీనా భూభాగాన్ని మూడు భాగాలుగా విభజించాలని ప్రతిపాదించింది. దీనికి 33 దేశాలు మద్దతు పలకగా, స్వతంత్ర భారతదేశం సహా 13 దేశాలు అభ్యంతరం తెలిపాయి. చైనా సహా 10 దేశాలు గైర్హాజరయ్యాయి. 1948లో ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి ఆమోదం లేకుండానే బ్రిటన్ అండతో ఇజ్రాయిల్ ఏకపక్షంగా దేశాన్ని ప్రకటించుకుంది. 'ఇంగ్లండ్ ఆంగ్లేయులకు, ఫ్రాన్స్ ఫ్రెంచి వారికి చెందినట్లే పాలస్తీనా అరబ్బులకు చెందినది' అని మహాత్మా గాంధీ 'హరిజన్' వారపత్రికలో 1931లోనే రాశారు. చమురు వనరులకు కొదవ లేని పశ్చిమాసియాలో వనరులను కొల్లగొట్టుకుపోయేందుకు సామ్రాజ్యవాద దేశాలు పన్నిన కుటిల పన్నాగంలో భాగంగానే ఇజ్రాయిల్ ఆవిర్భావం జరిగింది. తూర్పు జెరూసలెం రాజధానిగా స్వతంత్ర పాలస్తీనా ఏర్పాటుకు ఐక్యరాజ్యసమితి చేసిన తీర్మానాలు, రూపొందించిన ప్రణాళికలు ఇంతవరకు వాస్తవరూపం దాల్చలేదు. ఐరాస ఆధీనంలో ఉండాలని నిర్ణయించిన జెరూసలెమ్‌ను మూడేళ్లలోనే ఇజ్రాయిల్ ఆక్రమించుకుంది. 1993 నాటి ఓస్లో ఒప్పందాలు పాలస్తీనా రాజ్యం ఏర్పడుతుందనే భావన కలిగించినా, ఆచరణ అందుకు భిన్నంగా సాగింది. ఇజ్రాయిల్ సెక్యులర్ శక్తులను నాశనం చేసి, పాలస్తీనా భూభాగాలను ఆక్రమించుకుంటూ వెళ్లింది. నాటి పాలస్తీనా భూభాగంలో 13 శాతం మాత్రమే నేడు పాలస్తీనా నియంత్రణలో ఉంది. ఇప్పుడు గాజాపై నెతన్యాహు దండెత్తి ఆ భూ భాగాన్ని కూడా కబళించాలని చూస్తున్నాడు. పశ్చిమాసియాపై తన ఆధిపత్యాన్ని కొనసాగించేందుకు ఇజ్రాయిల్ కేంద్రంగా అమెరికా తన రాజకీయ భౌగోళిక వ్యూహాన్ని దూకుడుగా అమలుచేస్తున్నది. అమెరికా అండతోనే పాలస్తీనాకు చెందిన వెస్ట్‌బ్యాంకు, తూర్పు జెరూసలెమ్‌లలో పాలస్తీనీయులను గెంటివేసి 63 లక్షలకు పైగా ఇజ్రాయిలీ సెటర్లు అక్రమంగా నివాసాలు ఏర్పాటు చేసుకోవడం, ఈ సెటర్ గ్యాంగ్‌లు, ఇజ్రాయిల్ ఆర్మీ కలసి హువారా ప్రాంతంలో పాలస్తీనీయుల ఇళ్లను, కార్లకు తగులబెట్టడం వంటి దుశ్చర్యలకు పాల్పడ్డారు. వీటన్నిటి పర్యవసానమే హమాస్ గత శనివారం జరిపిన ఆపరేషన్. ఇజ్రాయిల్‌ను సమర్థించేవారు దీనికి ఏం సమాధానం చెప్తారు? గాజా ప్రజలపై వార్ డిక్లేర్ చేసిన నెతన్యాహు ప్రభుత్వం తెల్ల భాస్వరాన్ని ఆయుధంగా ఉపయోగించడం అత్యంత హేయమైన చర్య. ఇటువంటి పదార్థాలను యుద్ధంలో ఉపయోగించకుండా అంతర్జాతీయ చట్టం నిషేధం విధించింది. ఇటువంటి క్లిష్టమైన పరిస్థితుల్లో పౌర మరణాలను అరికట్టాల్సిన బాధ్యత అంతర్జాతీయ సమాజంపై ఉంది. దీనికి ఒకే ఒక పరిష్కారం పాలస్తీనీయుల న్యాయసమ్మతమైన డిమాండ్లను అంగీకరించడం. అదే సమయంలో అమాయక పౌరులకు హాని కలిగించే చర్యలను నిర్ద్వంద్వంగా ఖండించాలి. భద్రత ఇజ్రాయిలీలకు మాత్రమే కాదు, పాలస్తీనీయులకు కూడా ఉండాలి. మానవ హక్కులు, పూర్తి స్థాయి పౌరసత్వం, తమ స్వస్థలాలకు తిరిగి వచ్చే పాలస్తీనీయుల హక్కును అమలు చేసేందుకు ఐరాస కృషి చేయాలి. శాంతిని, ప్రజాస్వామ్యాన్ని కోరుకునే వారంతా పాలస్తీనాకు సంఘీభావంగా నిలవాలి.

మహనీయుల మాట



నేను, నా దేశం..
ఈ రెండిటిలో
నా దేశమే ముఖ్యమైనది.
- డా॥ బి.ఆర్. అంబేద్కర్,
భారత రాజ్యాంగ నిర్మాత.

క్రీడాకారులకు అభినందనలు - పట్టించుకోని పాలకులకు అక్షింతలు!

విశ్లేషణ

చైనా లోని హాంగ్ ఝౌ లో శనివారం నాడు ముగిసిన పందొమ్మిదవ ఆసియాడ్‌లో మన క్రీడాకారులు కొత్త చరిత్ర సృష్టించారు. పతకాల వేటలో గత 70 రికార్డును అధిగమించి వంద పతకాలను సాధిస్తామన్న ఆత్మవిశ్వాసంతో వెళ్లి 107 పతకాలతో తిరిగి వచ్చినందుకు యావత్ దేశం వారిని అభినందిస్తోంది. రానున్న రోజుల్లో మరిన్ని పతకాలను తెచ్చి దేశ కీర్తిపతాకను సమున్నతంగా ఎగురవేయాలని ఆశిస్తోంది. నాలుగేళ్లకు ఒకసారి జరుగుతున్న ఆసియా క్రీడలు చైనాలో కరోనా నిరోధ చర్యల కారణంగా 2022లో జరగాల్సినవి ఈ ఏడాది నిర్వహించారు. 2026లో జపాన్ లోని ఇచి, నాగోయా నగరాల్లో జరగనున్నాయి. మన క్రీడాకారులు 28 బంగారు, 38 రజిత, 41 కాంస్య పతకాలను సాధించారు. వీటిలో కొన్ని అనూహ్య పతకాలు ఉన్నాయి. చైనా, జపాన్, దక్షిణ కొరియా తరువాత నాలుగవ స్థానంలో మన దేశం ఉంది. జనాభాతో, ఆర్థికంగా చైనాతో పోటీ పడుతున్న మనం క్రీడల్లో ఎందుకు పోటీలో లేము అని ఎవరైనా అనుకోవచ్చు. దానికి ఏడున్నర దశాబ్దాలుగా దేశాన్ని పాలిస్తున్న పార్టీలు, వాటి నేతలు తప్ప క్రీడాకారులు కాదు. అధికారం నిలుపుకోవటం మీద ఉన్న యావ యువతలో ఉన్న నైపుణ్యాలను వెలికి తీయాలన్నదాని మీద ఏ మాత్రం లేదు. పోటీలకు ముందు రెజ్లర్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ (బిజెపి ఎంపీ) నిర్వాకం, క్రీడాకారుల ఆందోళన గురించి తెలిసిందే. కేంద్ర ప్రభుత్వం తన ఎంపీని కాపాడుకొనేందుకు ఇచ్చిన ప్రాధాన్యత పోటీల్లో పాల్గొనేవారి పట్ల చూపలేదు. అందుకే చివరికి ఫెడరేషన్ లేదు, జాతీయ శిక్షణా శిబిరాలు లేవు, అంతర్జాతీయ శిక్షకులు లేరు. అయినప్పటికీ తాజా క్రీడల్లో వారు ఒక వెండి, నాలుగు కాంస్య పతకాలను సాధించారు. మరికొన్ని క్రీడలకు సంబంధించిన వివాదాల కారణంగా చివరి వరకు ఎంపికలు జరగలేదంటే మన యాజమాన్య నిర్వహణ ఎంత అసమర్థంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఉదాహరణకు ఈక్వెస్ట్రియన్ పోటీలో పాల్గొనాలంటే క్రీడాకారులతో పాటు గుర్రాలను కూడా తీసుకుపోవాల్సి ఉంటుంది. క్వారంటైన్ నిబంధనల కారణంగా భారత గుర్రాలను చైనా అనుమతించటం లేదనే కీలక అంశాన్ని తన దగ్గర దాచారని క్రీడాకారుడు గౌరవ్ పుందిర్ చెప్పాడు. తీరా తెలుసుకున్న తరువాత ఐరోపా, మరోచోట తగిన గుర్రాల కోసం వెళ్లేందుకు, శిక్షణ పొందేందుకు తనకు అవకాశం లేకుండా పోయిందని, ఎంపిక విధానాన్ని కూడా మార్చారని వాపోయాడు. పోటీలకు వెళ్లకుండా తనను అడ్డుకోవటమే ఫెడరేషన్ అధికారుల ఎత్తుగడగా కనిపించిందని ఆరోపించాడు. పతకాలు వచ్చిన వారికి బహుమతులు ఇచ్చి గొప్పలు చెప్పుకోవటం కాదు కావాల్సింది. ప్రతిభను గుర్తించి అవసరమైన శిక్షణ సౌకర్యాలు, క్రీడలనే ఆలంబనగా చేసుకున్న వారు జీవితంలో స్థిరపడేందుకు ఇచ్చే చేయూతను బట్టే యువతరం ముందుకు వస్తుంది. ఇప్పుడు వచ్చిన పతకాల కీర్తి కూడా క్రీడాకారుల తపనకు, వారిని ప్రోత్సహించిన తల్లిదండ్రులకు తప్ప మరొకరికి దక్కదు. ఈ క్రీడల్లో కొన్ని అనూహ్య పతకాలను మన దేశానికి సాధించటం సంచలనం కలిగించింది.

ఎం. కోటేశ్వరరావు

1951లో మన దేశమే తొలి ఆసియాడ్‌కు ఆతిథ్యమిచ్చింది. నాడు 17 దేశాల వారు 489 మంది పాల్గొంటే ఇప్పుడు 41కి, పోటీలు 57 నుంచి 481 అంశాలకు పెరిగాయి. చైనా 1962 నుంచి మాత్రమే పాల్గొంటున్నది. ఇప్పటి వరకు వివిధ దేశాలు సాధించిన బంగారు పతకాల సంఖ్య ఇలా ఉంది (బ్రాకెట్లలో ఉన్నవి మొత్తం పతకాల సంఖ్య)- చైనా 1,674 (3,570), జపాన్ 1,084 (3,240), దక్షిణ కొరియా 787 (2,425), ఇరాన్ 193 (611), భారత్ 183 (779). తొలి ఆసియన్ గేమ్స్ జరిగిన తీరు చూస్తే అసలు నిర్వాహకులు ఎంత ఇబ్బంది పడింది, అధికారంలో ఉన్నవారికి క్రీడల పట్ల శ్రద్ధ లేమి స్పష్టంగా కనిపించింది. నాటి నుంచి నేటి వరకు ఉత్సాహవంతులైన వారి చొరవే ప్రధానంగా కనిపించింది. తొలి క్రీడల్లో జపాన్ 24 బంగారు పతకాలతో మొత్తం 58 పొందగా రెండవ స్థానంలో మన దేశం 15 స్వర్ణాలతో 51 పతకాలు సాధించింది. తరువాత 1962లో జపాన్ 73 స్వర్ణాలతో ముందుండగా పదింటితో రెండవ స్థానంలో మన దేశం ఉండటం తప్ప అప్పటి నుంచి ఇప్పటి వరకు మన దేశం రెండవ స్థానానికి ఎదగలేదు. టెహ్రాన్ 1974 క్రీడలలో చైనా 32 స్వర్ణాలతో రెండవ స్థానంలోకి వచ్చింది. తరువాత 1982లో న్యూఢిల్లీలో జరిగిన ఆసియాడ్‌లో తొలిసారిగా 61 పతకాలతో జపాన్‌ను వెనక్కు నెట్టి మొదటి స్థానానికి వచ్చిన చైనా అప్పటి నుంచి వెనక్కు తిరిగి చూడలేదు. 1990లో తొలిసారిగా చైనాలో ఆసియా క్రీడలు జరిగాయి. 183 బంగారు, మొత్తం 341 పతకాలతో చైనా క్రీడాకారులు అదరగొట్టారు. తాజా పోటీలలో 200 స్వర్ణ, 111 రజత, 71 కాంస్యాలతో మొత్తం 382 పతకాలను సాధించింది.

1896 నుంచి 2020 వరకు జరిగిన ఒలింపిక్స్‌లో మన దేశం నిరాశాజనక ప్రతిభనే కనపరిచింది. 2024లో జరిగే పారిస్ ఒలింపిక్స్‌లో మంచి ప్రతిభ కనపరచాలని కోరుకుందాం. 2020లో జరగాల్సిన టోక్యో ఒలింపిక్స్ మరుసటి ఏడాది జరిగాయి. వాటిలో 39 స్వర్ణాలు, మొత్తం 113 పతకాలతో అమెరికా, 38 స్వర్ణాలు, మొత్తం 89తో చైనా, 26 స్వర్ణాలు, మొత్తం 57 పతకాలతో జపాన్ తొలి మూడు స్థానాల్లో నిలిచాయి. మన దేశం ఒక స్వర్ణం, మొత్తం ఏడు పతకాలతో 48వ స్థానంలో ఉంది. ఇప్పటి వరకు జరిగిన 32 పోటీల్లో ఐదు స్థానాలో అధిక పతకాలు తెచ్చుకున్న తొలి దేశాల వివరాలు ఇలా ఉన్నాయి. సోవియట్ యూనియన్‌కు వెయ్యికి పైగా పతకాలు వచ్చినప్పటికీ అది ఉనికిలో లేనందున దాన్ని పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం లేదు. చైనా ఆలస్యంగా ఒలింపిక్స్‌లో (1984 లాస్ ఏంజల్స్ నుంచి) అడుగు పెట్టిందన్న అంశాన్ని గమనంలో ఉంచుకోవాలి.

క్రీడలకు రాజకీయాలు ఉండవు. రాజకీయ కారణాలతో కొన్ని దేశాలు కొన్ని పోటీలను బహిష్కరించిన ఉదంతాలు ఉన్నాయి. చైనాతో జనాభాను అధిగమించిన మనం క్రీడల్లో ఎందుకు దూసుకుపోలేకపోతున్నాం అన్నది ప్రశ్న. మన దేశంలో పిల్లలతో ఆటలాడించేందుకు స్థలాలు లేకుండానే పాఠశాలలకు అనుమతులు ఇస్తున్నారు. ఎన్ని స్కూళ్లలో క్రీడలకు ఉపాధ్యాయులు ఉన్నారు, ఎన్ని చోట్ల ఆటలాడిస్తున్నారు, అవసరమైన కనీస పరికరాలు ఎన్ని చోట్ల ఉన్నాయి అన్నది రోజూ మనం చూస్తున్నదే. కేంద్రమైనా, రాష్ట్రాలైనా ఒకే విధంగా ఉన్నాయి. పిండి కొద్దీ రొట్టె అన్నారు. క్రీడల మీద మనం చేస్తున్న ఖర్చు ఎంత? మాజీ అథ్లెట్, 2018లో కేంద్ర మంత్రిగా ఉన్న రాజ్యవర్ధన్ సింగ్ రాథోడ్ పార్లమెంటులో ఒక ప్రశ్నకు సమాధానమిస్తూ 2017-18లో కేంద్ర క్రీడల బడ్జెట్ రూ.1,329 కోట్లని, 2011 జనాభా లెక్కల ప్రకారం రోజుకు తలకు మూడు పైసలు క్రీడలకు ఖర్చు చేస్తున్నట్లు చెప్పారు. ఆ వార్తను ప్రచురించిన స్పోర్ట్స్ క్రీడా డాట్ కామ్ చైనా డైలీలో వచ్చిన సమాచారం ప్రకారం చైనా ప్రభుత్వం ఏటా 316.5 బిలియన్ యువాన్లు ఖర్చు చేస్తున్నదని దాన్ని రూపాయల్లో మారిస్తే మూడు లక్షల కోట్లని (2018 జనవరి 9) పేర్కొన్నది. ఈ ఏడాది మార్చి 28వ తేదీన టైమ్స్ ఆఫ్ ఇండియాలో వచ్చిన వార్త ప్రకారం 2007-08లో మన కేంద్ర బడ్జెట్‌లో రూ.708 కోట్లు కేటాయించారని తరువాత కామన్‌వెల్త్ క్రీడలు ఉన్నందున 2009-10లో రూ.3,760, మరుసటి ఏడాది రూ. 2,841 కోట్లుగా ఉందని 2015-16లో రూ.1,121 కోట్లకు తగ్గింది. ఖేలో ఇండియా కార్యక్రమం ప్రకటించిన తరువాత 2019-20లో రూ.2,636 కోట్లు కేటాయించారు. కరోనాలో రూ.1,800 కోట్లకు తగ్గించారు. 2023-24 బడ్జెట్‌లో రూ.3.397 కోట్లు కేటాయించగా దానిలో ఖేలో ఇండియాకు వెయ్యి కోట్లు పక్కన పెట్టారు. ఈ మొత్తం 140 కోట్ల జనాభాకు తలకు ఏటా రూ.24 అవుతుంది. బ్రిటన్‌లో 2022-23లో తలకు రూ.4,898, ఆస్ట్రేలియాలో రూ.976 ఖర్చు చేస్తున్నారు. 2014 నుంచి ఇప్పటి వరకు కేంద్ర ప్రభుత్వం ఏటా కేటాయిస్తున్న మొత్తాలు రూపాయలలో పెరుగుతున్నట్లు కనిపిస్తాయి. కానీ ఎంత పెరిగినప్పటికీ మొత్తం బడ్జెట్‌లో వాటా 0.6 నుంచి 0.8 శాతం మధ్యనే ఉంటోంది. మన దేశంలో ఇంత తక్కువ ఖర్చు పెడితే క్రీడాకారులు ఎలా తయారవుతారు? పతకాలు ఎలా వస్తాయి? పోనీ ప్రతిభ గలవారికి కొరత ఉందా?

★

> మన దేశంలో పిల్లలతో ఆటలాడించేందుకు స్థలాలు లేకుండానే పాఠశాలలకు అనుమతులు ఇస్తున్నారు. ఎన్ని స్కూళ్లలో క్రీడలకు ఉపాధ్యాయులు ఉన్నారు, ఎన్ని చోట్ల ఆటలాడిస్తున్నారు, అవసరమైన కనీస పరికరాలు ఎన్ని చోట్ల ఉన్నాయి అన్నది రోజూ మనం చూస్తున్నదే. కేంద్రమైనా, రాష్ట్రాలైనా ఒకే విధంగా ఉన్నాయి. పిండి కొద్దీ రొట్టె అన్నారు. క్రీడల మీద మనం చేస్తున్న ఖర్చు ఎంత? మాజీ అథ్లెట్, 2018లో కేంద్ర మంత్రిగా ఉన్న రాజ్యవర్ధన్ సింగ్ రాథోడ్ పార్లమెంటులో ఒక ప్రశ్నకు సమాధానం ఇస్తూ 2017-18లో కేంద్ర క్రీడల బడ్జెట్ రూ.1,329 కోట్లని, 2011 జనాభా లెక్కల ప్రకారం రోజుకు తలకు మూడు పైసలు క్రీడలకు ఖర్చు చేస్తున్నట్లు చెప్పారు.

బాలిక భారమేనా?

సందర్భం

బాలిక అంటే భారం. ఆడపిల్లంటే అత్తారింటికి వెళ్లి పోయేదే. అమ్మాయంటే ఆట పట్టించే వస్తువు....నేటికీ మన మధ్య వున్న కొన్ని అభిప్రాయాలివి. నిర్భయలు, ఉన్నావ్‌లు, హత్రాస్‌లు, దిశల గత భయానక అనుభవాలు అనుక్షణం వెన్నాడుతూనే వున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా 18 ఏళ్ల లోపు వయసున్న బాలికలు 110 కోట్లు. విశ్వవ్యాప్తంగా బాలికలకు సంబంధించిన పలు సమస్యలు, భద్రత, సాధికారత, లింగ వివక్ష, విద్య వంటి అంశాలను చర్చించడంతో పాటు ప్రజల్లో అవగాహన కల్పించేందుకు కెనడా మహిళ 'రోనా ఆంబ్రోస్' చొరవతో ఐక్యరాజ్యసమితి 2012 నుండి ప్రతి యేటా అక్టోబర్ 11న అంతర్జాతీయ బాలికల దినోత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తున్నది.

బాలికలను విద్యకు దూరం చేయడం, అమ్మాయిల్ని వంటింటికి పరిమితం చేయడం, బాల్యవివాహాలు, పోషకాహార లోపం, హక్కుల్ని కాలరాయడం, కుటుంబంలో నిర్ణయాధికారం లేకుండా ద్వితీయ శ్రేణి పౌరురాలిగా పక్కన బెట్టడం, వివక్ష, లైంగిక హింసలు, మానభంగాలు, బాలికల్ని కార్మికులుగా మార్చడం, వైద్య సదుపాయాల లేమి, లింగ వివక్ష లాంటి పలు సమస్యలు అనాదిగా వస్తున్నాయి. విశ్వవ్యాప్తంగా 6.2 కోట్ల మంది బాలికలు నిరక్షరాస్యతతో సతమతమవుతూ వంటింటికి, వృత్తులకే పరిమితం అవుతున్నారు. బాలికల్లో 25 శాతం బలవంతంగా బాల్యవివాహాల ఉచ్చులో పడుతున్నారు. మన దేశంలో పదేళ్లు దాటిన బాలికలు నేటికీ బాల్య వివాహాలు, ఫిమేల్ జనిటల్ మ్యుటిలేషన్ లాంటి దురాచారాలకు గురవుతున్నారు. పేద కుటుంబాలలో 80 శాతం బాలికలు ప్రాథమిక విద్యకు కూడా దూరమవుతున్నారు. ప్రపంచ బాల్యవివాహాలలో 33 శాతం భారత్ లోనే జరుగుతున్నాయని అంచనా. భారత మహిళల్లో 75 శాతం ఏదో ఒక గృహహింసకు గురవుతున్నారు. గ్రామీణ బాలికలు వ్యవసాయ క్షేత్రాలు, బీడీ పరిశ్రమలు, వంట శాలలు, ఇటుక బట్టీలు...వంటి అసంఘటిత రంగాల్లో తమ బాల్యాన్ని కోల్పోతున్నారు.

అంతర్జాతీయ బాలికల దినోత్సవం-2023 సందర్భంగా "డిజిటల్ జనరేషన్, అవర్ జనరేషన్" నినాదం తీసుకున్నారు. కౌమార దశలో ఉన్న అమ్మాయిలను లింగ వివక్ష లేకుండా సాధారణ జన జీవన స్రవంతిలోకి ఆకర్షించడానికి ప్రభుత్వాలు పలు చట్టాలను చేశాయి. బాలికలకు విద్య, ఉద్యోగం, ఆరోగ్య సదుపాయాలు, గౌరవప్రద జీవితం, ఆర్థిక స్వేచ్ఛ, నిర్ణయాధికారంలో భాగస్వామ్యం, లైంగిక వేధింపుల కట్టడి, అత్యాచారం చేసిన వారికి కఠిన దండన, హక్కుల కల్పన, ఆస్తి హక్కు, నాయకత్వ అవకాశాల కల్పన, గృహ హింస లేకుండా చూడడం, నైపుణ్యాభివృద్ధి, మహిళా భద్రత, అన్ని రంగాల్లో సమానత్వానికి సకారాత్మక చర్యలు తీసుకోవడం వంటివి జరగాలి. అయితే క్షేత్ర స్థాయిలో ఇవి నెరవేరడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. అబ్బాయిలతో సమానంగా విద్య, వైద్య, ఉద్యోగ ఉపాధి, లింగ సమానత్వం, వృత్తి నైపుణ్య వికాసం, పోషకాహారం అందించడం, బాల్య వివాహాలు-బాల కార్మిక వ్యవస్థను నిషేధించడం, ఆచారాల పేరుతో అమ్మాయిల అణచివేతను వ్యతిరేకించడం, విద్యాలయాల్లో టాయిలెట్ల ఏర్పాటు, సదుపాయాల కల్పన, ఆస్తి హక్కు కల్పన, ప్రసూతి ఆసుపత్రుల అందుబాటు, అత్యాచారాల కట్టడి, పరిసరాల పరిశుభ్రత లాంటి చర్యలను తీసుకోవాలి.

భారతదేశంలో 2020 అంచనాల ప్రకారం 108 మంది పురుషులకు 100 మంది మహిళలు ఉన్నారు. భారత జనాభాలో 51.96 శాతం పురుషులు, 48.04 శాతం మహిళలు. ప్రపంచవ్యాప్తంగా పురుషులు 50.4 శాతం, స్త్రీలు 49.6 శాతం ఉన్నారు. ఆరోగ్య సదుపాయాల లేమి, బాల్యవివాహాల వల్ల కౌమార దశలోనే గర్భం దాల్చడం, ప్రసూతి ఆసుపత్రులు సమీపంలో లేకపోవడం, అవిద్యతో అవగాహనా లేమి...అమ్మాయిల సంఖ్య తగ్గడానికి కారణాలుగా చెప్పవచ్చు. భ్రూణహత్యల్లో 90 శాతం గర్భస్థ శిశువు ఆడపిల్లని తెలిసి జరిగినవని తేలింది. దీనిని గమనించిన ప్రభుత్వాలు లింగ నిర్ధారణ పరీక్షలను నిషేధించినా భ్రూణ హత్యల పరంపర కొనసాగుతూనే వుంది. అయితే భ్రూణహత్యల నిరోధానికి 'కిశోరి శక్తి యోజన', ప్రసూతి వైద్య సదుపాయాల కల్పనకు 'సమృద్ధి యోజన', వైద్య సదుపాయాల కల్పనకు 'ఆయుస్మతి యోజన' పథకాలను తీసుకొచ్చారు. కేంద్రం 2015లో తెచ్చిన "బేటీ బచావో, బేటీ పఢావో" పథకం పేరుకు మాత్రమే కనిపిస్తున్నది. ఎందుకంటే మణిపూర్‌లో మహిళల నగ్న ఊరేగింపు, హత్యాచారాలు దేనికి సంకేతం?

దేశంలో నిత్యం ఏదో ఓ చోట బాలికలకు రక్షణ లేదనేది దీన్నిబట్టి తెలుస్తోంది. ఇటీవల మధ్యప్రదేశ్ లోని ఉజ్జయినిలో పన్నెండేళ్ల బాలికపై జరిగిన లైంగిక దాడి కేంద్రం అసమర్థతను తెలియజేస్తోంది. ఆడపిల్లల్ని రక్షించుకోవడం, ఉన్నత విద్య అందించడం, భ్రూణహత్యలను నిరోధించడం, మహిళలపై అత్యాచారాలను కట్టడి చేయడం లాంటి చర్యలతో లింగ వివక్ష సమస్యకు పరిష్కారం దొరుకుతుంది. అమ్మాయిల మానసిక, సాంఘిక, భౌతిక, ఆర్థిక సమస్యలను అధిగమించడానికి తగు చర్యలు తీసుకోవాలి. వీటికి తోడు యువతులపై యాసిడ్ దాడులు, కిడ్నాపులు లాంటివి జరగకుండా కఠిన చర్యలు తీసుకోవడం ప్రభుత్వాల కనీస బాధ్యత.

- బి.ఎం.ఎస్. రెడ్డి,
సెల్ : 9949700037

కవిత్వం

గులాంగిరి

మాతృ భూమే
మరు భూమి అయిపోయే,
స్వంత ఇల్లే
పరాయిదయిపోయే,
ఆక్రమణదారే
అసలు యజమాని
అయిపోయే,
ఎదిరిస్తే
దాడి అని ముద్ర వేసే,
ఇదెక్కడి న్యాయం?
అయినా,
అంతర్జాతీయ పోలీస్ వారి
పక్షమే
విశ్వగురు ఇక సరేసరి,
మారణహోమంతో
అట్టుడుకుతున్న
మణిపూర్‌పై నోరెత్తం,
పాలస్తీనాను ఆక్రమిస్తున్న
ఇజ్రాయిల్ పక్షాన మాత్రం
వెంటనే స్పందిస్తాం,
ప్రజాస్వామ్యం అని వల్లె వేస్తాం
దురాక్రమణకు సమర్థిస్తాం,
అదే మా నీతి
అమెరికాకు గులాంగిరి.

- ఎ. అజ శర్మ

మీ వ్యాసాలు 5000 క్యారెక్టర్లు లేదా 700 పదాలు వుండాలి.
పంపాల్సిన మెయిల్ :
editpageps@gmail.com

'న్యూస్ క్లిక్'పై వింత కేసు

తీవ్రవాద చర్య లేకుండానే తీవ్రవాద ఎఫ్ఐఆర్ !

కత్తిరింపులు

'న్యూస్ క్లిక్' వ్యవస్థాపకుడు ప్రబీర్ పుర్కాయస్థ తదితరులపై ఢిల్లీ పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్, వాస్తవానికి, తీవ్రవాదం మినహా మరే ఇతర నేరాలను వెల్లడించని అస్పష్టమైన ఆరోపణల సమ్మేళనంగా వుంది. 'న్యూస్ క్లిక్'లో ప్రచురితమైన ఏ వార్తా కథనం లేదా సమాచారాన్ని ఉటంకించకుండానే, దేశ భద్రతను దెబ్బ తీయడానికి కుట్ర పన్నడం దగ్గర నుండి 2019 పార్లమెంట్ ఎన్నికలకు అంతరాయం కలిగించడం వరకు, ప్రభుత్వంపై అసంతృప్తికి కారణమవడం నుండి కీలక సేవలకు అంతరాయం కలిగించడం వరకు అనేక నేరాలకు పాల్పడ్డారంటూ ఎఫ్ఐఆర్ పేర్కొంది. కుట్రకు పాల్పడ్డారని, వివిధ గ్రూపుల మధ్య శతృత్వాన్ని పెంపొందించడానికి ప్రయత్నించారంటూ చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం (యు.ఎ.పి.ఎ-ఉపా), ఐపిసి నిబంధనలను వర్తింపచేశారు. చట్టవ్యతిరేక కార్యకలాపంగా లేదా తీవ్రవాద చర్యగా పేర్కొనగలిగే ఎలాంటి విధ్వంసకర చర్యను ఆ ఎఫ్ఐఆర్‌లో ప్రస్తావించకపోవడం అన్నింటి కంటే గుర్తుంచుకోదగ్గ అంశంగా వుంది. ప్రభుత్వంపై అసంతృప్తిని రగిల్చి, భారతదేశ సార్వభౌమాధికారాన్ని, ప్రాదేశిక సమగ్రతను దెబ్బ తీసే, దేశ ఐక్యత, భద్రతకు ముప్పు కలిగించే లక్ష్యంతో, శత్రువులు భారత్ లోకి అక్రమంగా విదేశీ నిధులను చొప్పించారనే సాధారణ వర్ణన మాత్రమే ఆ ఎఫ్ఐఆర్‌లో వుంది. అరుణాచల్ ప్రదేశ్, కాశ్మీర్‌లు భారత్‌లో భాగం కాదని చూపించే ఇ-మెయిల్స్ మార్పిడి ప్రాతిపదికగా కుట్ర జరిగిందంటూ ఎఫ్ఐఆర్ ప్రస్తావించింది. 2020-21లో రైతుల ఆందోళన సుదీర్ఘంగా సాగేలా చూసేందుకు ప్రయత్నాలు జరిగాయని, తద్వారా సేవలు, ఇతర నిత్యావసర సరఫరాలకు ఆటంకం కలిగిందని ఎఫ్ఐఆర్ పేర్కొంది.

మొత్తమ్మీద, 'న్యూస్ క్లిక్'కు అమెరికన్ కోటీశ్వరుడు నెవిల్లె రాయ్ సింగమ్ జరిపే చెల్లింపులు, అలాగే ఆ వెబ్‌సైట్ జర్నలిస్టు సమాచారాన్ని కలిపి దేశ భద్రతను దెబ్బ తీసేందుకు, చట్టవ్యతిరేక కార్యకలాపాలను రెచ్చగొట్టేందుకు, తప్పుడు ప్రచారాన్ని వ్యాప్తి చేసేందుకు చైనా నిధులను వినియోగిస్తున్నారనే ఒక కేసును రూపొందించేందుకు పోలీసులు ప్రయత్నించారనేది స్పష్టమైంది. ఇటువంటి దుర్వినియోగానికి యు.ఎ.పి.ఎ (ఉపా) కూడా చాలా అనుకూలంగా వుంటుంది. ఎందుకంటే విస్తృతంగా నిర్వచించబడిన దీని నిబంధనలు చాలా సులభంగా వ్యక్తులను వారి చర్యలకు బాధ్యులుగా చేసినట్లుగా, వారి 'ఆలోచనా నేరాలకు' నేరస్తులుగా చేయడానికి సాయపడతాయి. అసమ్మతివాదులను, అయిష్టులను సుదీర్ఘకాలం కటకటాల వెనుక వుంచేందుకు, విస్తృత మీడియా సోదరులకు ఒళ్ళు గగుర్పొడిచే సందేశాన్ని పంపడానికి 'ఉపా' ను వర్తింపచేయడం కూడా చాలా ఎత్తుగడతో అమలు చేసిన చర్యే. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో చైనా కుట్ర సిద్ధాంతాన్ని పాలక బిజెపి వాడుకునేందుకు కూడా అవకాశం వుంది. రెండు టెలికం కంపెనీలు బూటకపు కంపెనీలను సృష్టించాయని ఏ మాత్రమూ సంబంధం లేని రీతిలో ఎఫ్ఐఆర్‌లో ఆరోపించడం కేవలం సాధారణ ప్రస్తావన తప్ప మరేమైనా అందులో వుందా లేదా అన్నది ఇక్కడ సంబంధిత ప్రశ్నగా వుంది. తీవ్రవాద చర్యలకు నిధులు సమకూర్చడానికి ఈ కంపెనీలు అనుకూలంగా వ్యవహరించాయన్న అంశంపై విడిగా దర్యాప్తు జరపాలా లేదా అన్నది కూడా ఇందుకు సంబంధించిన ప్రశ్నగానే వుంది. ఈ కంపెనీల తరపున వాదించడం కోసం లీగల్ నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేయడంలో ఒక లాయర్ వున్నారంటూ ప్రస్తావించడం చూస్తే ఆ లీగల్ సర్వీసులను నేరపూరితం చేయడానికి పోలీసులు ప్రయత్నించినట్లుగా కనిపిస్తోంది. వ్యక్తిగత, మీడియా హక్కులకు విఘాతం కలిగించేందుకు తీవ్రవాద నిరోధక చట్టాలను దుర్వినియోగం చేయడం, జాతీయ భద్రతకు సంబంధించి మనోభావాలను రెచ్చగొట్టడం ప్రస్తుత ప్రభుత్వ ప్రవృత్తిగా వుందనే ఒక ఆందోళనకరమైన ధోరణిని ఈ కేసు ఎత్తిచూపుతోంది.

/ 'హిందూ' సంపాదకీయం /

సమస్యలు పరిష్కరించాలి : ఎన్‌ఎంయు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎపిఎస్‌ఆర్‌టిసి ఉద్యోగులకు సంబంధించిన పెన్షన్ సమస్యలను పరిష్కరించాలని ఎపి పిటిడి నేషనల్ మజ్దూర్ యూనిటి అసోసియేషన్ (ఎన్‌ఎంయు) డిమాండ్ చేసింది. మంగళవారం విజయవాడలోని ఆర్‌టిసి హౌస్‌లో ఆర్‌టిసి ఎగ్జిక్యూటివ్ డైరెక్టరు కెఎస్ బ్రహ్మానందరెడ్డి ఆధ్వర్యంలో పెన్షన్ సౌకర్యంపై సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎన్‌ఎంయు నాయకులు శ్రీనివాస్ రాజు, ఎస్ రాజేష్ కుమార్ ఆర్‌టిసి ఉద్యోగుల పెన్షన్ సమస్యలను బ్రహ్మానందరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆర్‌టిసిలో సిపిఎస్ సభ్యులు మాత్రమే జిపిఎస్‌కు అర్హులు అని చెప్పడంతో పిటిడి ఉద్యోగులకు అర్హత లేకుండా పోతోందన్నారు. ఈ విషయంపై ఉద్యోగులకు స్పష్టత ఇవ్వాలని కోరారు. ఆర్‌టిసి ఉద్యోగులకు ప్రయోజనకరంగా ఉన్న ఎస్‌ఆర్‌బిఎస్‌ను రద్దు చేయడం తగదని అన్నారు.

కందిపప్పు పంపిణీపై శ్రద్ధేది?

- 2 జిల్లాల్లోనే పంపిణీ
- సర్వర్లు పనిచేయక రేషన్ పంపిణీలో ఇక్కట్లు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

చౌకధరల దుకాణాల ద్వారా పేదలకు సబ్సిడీపై అందించే జాబితాలో కందిపప్పు కనుమరుగైంది. దసరా పండగనాడైనా పేదలు పప్పన్నం తినే పరిస్థితులు ప్రభుత్వ వైఖరితో లేకుండా పోయాయి. కందిపప్పు బయట మార్కెట్‌లో కిలో రూ.180 నుంచి రూ.200 పలుకుతోంది. ఈ నేపథ్యంలో సబ్సిడీపై కందిపప్పును ప్రభుత్వం పంపిణీ చేస్తుందని ఆశపడ్డ రేషన్ కార్డుదారులకు నిరాశే మిగిలింది. కందిపప్పు పంపిణీ కేవలం అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం జిల్లాలకు మాత్రమే ప్రభుత్వం పరిమితం చేయడం పట్ల కార్డుదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కందిపప్పుకు టెండర్లు పిలిచినా ఎవరూ ముందుకు రావడం లేదని ప్రభుత్వం పేర్కొంటోంది. రాష్ట్రంలో సరిపడా కంది పంట సాగు లేకపోవడంతో కార్డుదారులకు ఇవ్వలేకపోతున్నట్లు ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. ఇతర రాష్ట్రాల నుంచి కొనుగోలు చేసి సరఫరా చేసే అవకాశం ఉన్నప్పటికీ ప్రభుత్వం అందుకు సుముఖంగా లేదు. రాష్ట్రవ్యాప్తంగా 1.46 కోట్ల రేషన్ కార్డులు ఉన్నాయి. అందరికీ కిలో వంతున పంపిణీ చేయాలంటే 14 వేల టన్నుల కందిపప్పు అవసరమవుతుంది. గత రికార్డులను పరిశీలిస్తే పౌరసరఫరాలశాఖ ఏడు వేల టన్నులు మాత్రమే సరఫరా చేసేది. గత కొంత కాలంగా కందిపప్పునకు ప్రభుత్వం మంగళం పాడింది. దసరాకు అల్లూరి, మన్యం జిల్లాల్లో కార్డుదారులకు సుమారు 300 టన్నులు మాత్రమే పంపిణీ చేసేందుకు పౌరసరఫరాలశాఖ సిద్ధమైంది. ప్రస్తుతం ఈ నెలలో రాష్ట్ర వ్యాప్తంగా బియ్యం, గోధుమ పిండి, పంచదార సరఫరా చేస్తున్నట్లు ప్రభుత్వం పేర్కొంటోంది.

వెంటాడుతున్న నెట్‌వర్కు సమస్య

రాష్ట్ర వ్యాప్తంగా ఎండియు వాహనాల ద్వారా పంపిణీ చేసే రేషన్‌కు నెట్‌వర్కు సమస్య వెంటాడుతోంది. నాలుగు రోజులుగా సర్వర్లు పనిచేయకపోవడంతో వేలిముద్రలు పడక, రేషన్ తీసుకోలేక పేదలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నెట్‌వర్కు సమస్యను అధిగమించేందుకు పౌరసరఫరాలశాఖ ఐటి విభాగం కృషి చేస్తున్నప్పటికీ 8 జిల్లాల్లో మాత్రమే మంగళవారం నాటికి క్లియర్ చేయగలిగారు. క్లియర్ అయిన జిల్లాల్లో ఎన్‌టిఆర్, కృష్ణా, గుంటూరు, బాపట్ల, పల్నాడు, విజయనగరం, విశాఖపట్నం జిల్లాలు ఉండగా, మిగిలిన జిల్లాల్లో ఆఫ్‌లైన్ ద్వారా సరుకుల పంపిణీ జరుగుతున్నట్లు ఆ శాఖ ఉన్నతాధికారులు పేర్కొంటున్నారు.

'అమేస్ 28' ప్రారంభం

- కేరళలో త్రీడీ సాంకేతికతతో నిర్మించిన తొలి భవనం

అమేస్ 28 భవన ప్రారంభోత్సవానికి హాజరైన మంత్రి కె.రాజన్ తదితరులు

తిరువనంతపురం : కేరళలో త్రీడీ సాంకేతికతతో నిర్మించిన తొలి భవనం అమేస్ 28'ను రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి కె.రాజన్ మంగళవారం ప్రారంభించారు. ఆకస్మిక వాతావరణ మార్పుల వల్ల ఎదురయ్యే సమస్యలను ఎదుర్కొనే పద్ధతుల్లో ఈ భవనాన్ని తిరువనంతపురంలోని పిటిపి నగర్‌లో కేరళ రాష్ట్ర నిర్మిత కేంద్ర (కెస్నిక్) ప్రాంగణంలో నిర్మించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వి కె ప్రశాంత్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి రాజన్ మాట్లాడారు. భవన నిర్మాణ రంగంలో నవీన సాంకేతిక విద్య, హరిత నిర్మాణ పద్ధతులు ఉపయోగించుకోవచ్చని తెలిపారు. తక్కువ సమయంలో, తక్కువ ఖర్చుతో నాణ్యమైన గృహ నిర్మాణ పద్ధతులు అనుసరించవచ్చునని చెప్పారు. 380 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఈ 3డి భవనాన్ని నిర్మించారు. ఒక గదితో అమాజ్-28 సమ్మర్‌హౌస్ పేరుతో ఈ భవన నిర్మాణాన్ని కేవలం 28 రోజుల్లో పూర్తి చేశారు. కెస్నిక్‌తో కలిసి ఐఐటి మద్రాస్ పూర్వ విద్యార్థులకు చెందిన త్వస్తా అనే స్టార్టప్ ఈ భవనాన్ని నిర్మించింది. ఈ మేరకు కెస్నిక్-త్వస్తా మధ్య ఒక అవగాహన ఒప్పందం కుదిరింది.

ఈ నిర్మాణ కోసం పేటెంట్ కాంక్రీట్ మిశ్రమాన్ని ఉపయోగించారు. ఈ మిశ్రమాన్ని పొరలు పొరలుగా వేయడానికి ఒక రోబోటిక్ చేతిని ఉపయోగించారు. డెమో ప్రాజెక్ట్‌గా నిర్మించిన భవనానికి రూ.11 లక్షలు ఖర్చయింది. ఇలాంటి 3డి భవనాలు కేరళ నిర్మాణ రంగంలో గొప్ప మార్పులు తీసుకొస్తాయని భావిస్తున్నట్లు సభలో వక్తలు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఉద్యోగులకు మంత్రి రాజన్ అవార్డులను అందజేశారు.

కులరహిత సమాజంపై బహిరంగ సభ

- ఎఐసిసి అధ్యక్షులు ఖర్గేను ఆహ్వానించాం
- సిడబ్ల్యుసి సభ్యులు ఎన్ రఘువీరారెడ్డి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రాష్ట్రంలో కులరహిత సమాజంపై బహిరంగ సభ నిర్వహించనున్నామని, ఈ సభకు ఎఐసిసి అధ్యక్షులు మల్లికార్జున ఖర్గేను ఆహ్వానించామని ఎపిసిసి మాజీ అధ్యక్షులు, కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యులు ఎన్ రఘువీరారెడ్డి అన్నారు. మంగళవారం నాడిక్కడ ఎపి భవన్‌లో ఎపిసిసి అధ్యక్షులు గిడుగు రుద్రరాజుతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. కులగణన ప్రస్తావన రావడంతో బిజెపి గందరగోళంలో పడిపోయిందన్నారు. క్యాస్ట్ లెస్ సొసైటీ అనే కార్యక్రమాన్ని తొలుత ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఆంధ్రప్రదేశ్‌లో బహిరంగ సభ ఏర్పాటు చేయబోతున్నామని అన్నారు. మల్లికార్జున ఖర్గే అక్టోబరు 21న బహిరంగ సభలో పాల్గొనాలని ఆహ్వానించామన్నారు.

కాల్వ శ్రీనివాసులుపై కేసులు ఎత్తివేయాలి

- టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

టిడిపి నేత కాల్వ శ్రీనివాసులుపై నమోదుచేసిన అక్రమ కేసులను ఎత్తివేయాలని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. వరుస కేసులు నమోదు చేస్తూ జగన్‌మోహన్‌రెడ్డి పెత్తందారీ తనం మరొకసారి రుజువు చేసుకున్నారన్నారు. చంద్రబాబు అక్రమ అరెస్టుపై నిరసన తెలిపినందుకే అక్రమ కేసులు పెట్టారన్నారు. రాయదుర్గం ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి జన్మదిన వేడుకలను రెండు గంటలపాటు ట్రాఫిక్‌కు అంతరాయం కల్పించి చిందులేసిన వైసిపి నాయకులపై ఎలాంటి చర్యలూ తీసుకోలేదన్నారు. వైసిపి పాలన అంతం.. ప్రజల పంతంగా సాగనుందని అన్నారు.

చంద్రబాబుపై అనుచిత వ్యాఖ్యలు తగవు
- మాజీ మంత్రులు నక్కా ఆనంద్‌బాబు, కొల్లు రవీంద్ర

ప్రజల్లో ఉన్న ఆగ్రహావేశాల నుంచి తప్పించుకోవడానికే చంద్రబాబుపై సిఎం జగన్ అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని మాజీ మంత్రులు నక్కా ఆనంద్‌బాబు, కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో వారు మీడియాతో మాట్లాడుతూ.. టిడిపి లేకుండా చేయడం చంద్రబాబును జైలుకు పంపినంత తేలిక కాదన్నారు. ప్రత్యేకహోదా సాధిస్తామని చెప్పి కేసుల భయంతో మోడీ, అమిత్‌షా కాళ్లు పట్టుకోవడమే జగన్ విశ్వసనీయత అని విమర్శించారు.

శ్రమ ఆయుధమైతే విజయం సొంతం

- రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యులు కాంతారావు

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

విద్యార్థులు నిర్దేశించుకున్న లక్ష్యాల సాధనకు శ్రమను ఆయుధంగా మలుచుకుంటే విజయం మీ సొంతమవుతుందని రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యులు బి.కాంతారావు విద్యార్థుల్లో స్ఫూర్తి నింపారు. జిల్లా పర్యటనలో భాగంగా మున్సిపాలిటీ పరిధిలోని కొత్తవలస వద్ద చౌక ధరల దుకాణాన్ని, అంగన్వాడీ కేంద్రం, మున్సిపల్ ఉన్నత పాఠశాలను మంగళవారం సందర్శించారు. మున్సిపల్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన వంటకాల నాణ్యతను పరిశీలించి రుచి చూశారు. విద్యార్థులకు స్వయంగా పదార్థాలను వడ్డించారు. స్టోర్ రూంలో సరుకుల నిల్వలను, రికార్డులను తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న గుడ్లు, చెక్కీల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అంతకుముందు కొత్తవలస పెద్దవీధిలోని అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించి జగనన్న గోరుముద్ద పథకం అమలు, సరుకుల నిల్వ, రికార్డుల నిర్వహణను తనిఖీ నిర్వహించారు. వండిన వంటకాల స్వయంగా రుచి చూసి నాణ్యతను పరిశీలించారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూను సక్రమంగా అమలు చేయాలని అన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎంత మంది బాలింతలు, గర్భిణీలకు పౌష్టికాహారం, టి.హెచ్.అర్ అందిస్తున్నది వివరాలను ఆరా తీశారు. రక్తహీనత లోపం తలెత్తకుండా బలవర్ధకమైన ఆహారాన్ని సక్రమంగా అందించాలని సూచించారు. పథకాల అమలు క్షేత్ర స్థాయిలో పక్కాగా అమలు జరిగేందుకు తనిఖీలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. లోపాలను సరిదిద్దుకుని ప్రభుత్వ ఆశయం నెరవేర్చేందుకు పథకాలను సమర్థవంతంగా అమలు చేయాలని కోరారు. అలాగే కొత్తవలస లోని చౌక ధరల దుకాణాన్ని ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ జీవితం ఎంతో విలువైందని, ఆత్మ స్థైర్యంతో ముందడుగు వేయాలని అన్నారు. పేదరికం, అనారోగ్యంతో ఏ ఒక్కరూ చదువుకు దూరం కాకూడదనే ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తోందని వివరించారు.

IN THE COURT OF THE HON'BLE V ADDL. DISTRICT JUDGE, AT VIJAYAWADA
A.R.B.E.P. No. 299/2023 IN A.O.P. No. 212/2021

Between:
M/s. Shriram Transport Finance Co. Ltd.,
Rep. by its Authorized Signatory ...DHR/Claimant
Vs
1. Oruganti Sri Lakshmi
2. Venkata Suresh Medarametla ... JDRs/Respondents

NOTICE TO JDR NO.1&2/ RESPONDENT

1) Oruganti Sri Lakshmi, W/o. Ramesh D.No.5-78, Near Vyshnavi Apartments, Ramavarapdu, Krishna District - 521108
2) Venkata Suresh Mederametla, S/o Subbulu Naidu, Drno : 1-4-204, Lalitha Nagar Bhavanipuram, Apple Stone Company, Krishna Dist-520012

Take notice that the above Execution Petition filed by the DHR/ Climant praying orders against JDR-1&2. The same is posted to 12-10-2023 for your appearance on that day you should attend the court in person or through an advocate at 10.30 A.M. failing which the matter will be decided in your absence by the Hon'ble Court.

(BY ORDER OF THE HON'BLE COURT)
D. ANJANAYA PRASAD
Advocate for the Petitioner / DHR, Vijayawada.

IN THE COURT OF THE HON'BLE V ADDL. DISTRICT JUDGE, AT VIJAYAWADA
A.R.B.E.P. No. 300/2023 IN A.O.P. No. 692/2021

Between:
M/s. Shriram Transport Finance Co. Ltd.,
Rep. by its Authorized Signatory ...DHR/Claimant
Vs
1. A Srinivas Reddy
2. Govardhana Rao P ... JDRs/Respondents

NOTICE TO JDR NO.1&2/ RESPONDENT

1) Alla Srinivas Reddy, S/o Subba Reddy, D.No 8-123, Nehru Nagar, Ramavarapadu Vijayawada- 521108
2) P Govardhana Rao, S/o Chiranjeevi Rao, D.No - 49-3-135, Gandhi Colony, Gunadhala, Vijayawada Rural -520001

Take notice that the above Execution Petition filed by the DHR/ Climant praying orders against JDR – 1&2. The same is posted to 12-10-2023 for your appearance on that day you should attend the court in person or through an advocate at 10.30 A.M. failing which the matter will be decided in your absence by the Hon'ble Court.

(BY ORDER OF THE HON'BLE COURT)
D. ANJANAYA PRASAD
Advocate for the Petitioner / DHR, Vijayawada.

IN THE COURT OF THE HON'BLE V ADDL. DISTRICT JUDGE, AT VIJAYAWADA
A.R.B.E.P. No. 297/2023 IN A.O.P. No. 691/2020

Between:
M/s. Shriram Transport Finance Co. Ltd.,
Rep. by its Authorized Signatory ...DHR/Claimant
Vs
1. Raja Sekhar Ratnam
2. Srinivasa Rao Chandana ... JDRs/Respondents

NOTICE TO JDR NO.1&2/ RESPONDENT

1) Raja Sekhar Rathnam, S/O P. Rambabu, D. No. 6-153, Sai Nagar Ser Center, Near Sindhu Center, Ramavarapadu, Vijayawada Rural 521108
న్యూఢిల్లీ : చైనా స్మార్ట్‌ఫోన్ తయారీ సంస్థ వివోపై కొనసాగుతున్న మనీలాండరింగ్ కేసు విచారణలో భాగంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) మంగళవారం నలుగురిని అరెస్టు చేసింది. వీరిలో లావా అంతర్జాతీయ మొబైల్ సంస్థ ఎండి, ఒక చైనా దేశస్థుడు, ఒక చార్టర్డ్ అకౌంటెంట్, మరొక వ్యక్తి ఉన్నారు. స్థానిక కోర్టులో ఇడి వీరిని హాజరు పర్చి, కస్టడీకి కోరే అవకాశం ఉందని తెలుస్తోంది. మనీలాండరింగ్ ఆరోపణలతో ఇడి గత ఏడాది జులైలో వివో, సంస్థకు సంబంధం ఉన్న వ్యక్తులపై కేసు నమోదు చేసింది. భారత్‌లో పన్నులు చెల్లించకుండా ఉండటం కోసం వివో సంస్థ చైనాకు చట్టవిరుద్ధంగా రూ. 62,476 కోట్లు బదిలీ చేసిందని ఇడి ఆరోపిస్తోంది.

కేంద్ర మాజీ మంత్రికి తప్పని సైబర్ దాడి

- దయానిధి మారన్ బ్యాంక్ ఖాతా నుంచి రూ.99,999 చోరీ

చెన్నై: కేంద్ర సమాచార, ఐటి శాఖ మాజీ మంత్రి, ప్రస్తుత డిఎంకె ఎంపి దయానిధి మారన్‌ను కూడా సైబర్ కేటుగాళ్లు వదల్లేదు. ఆయన బ్యాంక్ ఖాతా నుంచి రూ. 99,999ను చోరీ చేశారు. దీనిపై గ్రేటర్ చెన్నై సిటీ పోలీస్‌కు చెందిన సైబర్ క్రైమ్ వింగ్‌లో ఫిర్యాదు నమోదయింది. ఈ విషయాన్ని మారన్ తన ట్విట్టర్ ఖాతా ద్వారా ధ్రువీకరించారు. బ్యాంక్ ఖాతాకు అనుసంధానించిన మొబైల్ నంబర్‌కు ఎలాంటి ఒటిపి రాకుండానే నగదు చోరీ చేశారని, సైబర్ దాడి ఏ విధంగా జరిగిందో బ్యాంక్ అధికారులు కూడా వివరణ ఇవ్వలేకపోతున్నారని చెప్పారు. ఈ చోరి విషయం తెలిసినవెంటనే ఖాతాకు చెందిన అన్ని కార్యకలాపాలు బ్లాక్ చేసినట్లు తెలిపారు.

షోఫియాన్‌లో ఎన్‌కౌంటర్

- ఇద్దరు ఉగ్రవాదుల మృతి

శ్రీనగర్ : జమ్ముకాశ్మీర్‌లోని షోపియాన్ జిల్లాలో మంగళవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో లష్కరే తోయిబాకు చెందిన ఇద్దరు ఉగ్రవాదులు మృతి చెందారు. జిల్లాలోని అల్షిపోరా ప్రాంతంలో తెల్లవారు జామున ఈ ఎన్‌కౌంటర్ జరిగింది. ఈ ప్రాంతంలో ఉగ్రవాదులు ఉన్నారనే స్పష్టమైన సమాచారంతో అక్కడకు వెళ్లిన భద్రతా సిబ్బందిపై ఉగ్రవాదులు కాల్పులు ప్రారంభించారు. దీంతో భద్రతా సిబ్బంది జరిపిన ఎదురుకాల్పుల్లో ఇద్దరు ఉగ్రవాదులు మృతి చెందారు. ఈ ఇద్దరిలో ఒకరికి ఈ ఏడాది ప్రారంభంలో జరిగిన బ్యాంక్‌గార్డు సంజయ్ శర్మ హత్యతో ప్రమేయం ఉన్నట్లు కాశ్మీర్ జోన్ అడిషనల్ డిజిపి విజయ్‌కుమార్ తెలిపారు.

కేరళలోని హెచ్‌ఐఎల్ మూసివేసిన కేంద్రం

కొచ్చి: కేరళలోని హిందుస్థాన్ ఇన్‌సెక్టిసైడ్స్ లిమిటెడ్ (హెచ్‌ఐఎల్) పునరుద్ధరణ ఆశలను కేంద్ర ప్రభుత్వం వమ్ము చేసింది. హెచ్‌ఐఎల్‌ను మూసివేస్తున్నట్లు న్యూఢిల్లీలోని కంపెనీ ప్రధాన కార్యాలయం మంగళవారం ఒక ఉత్తర్వు జారీ చేసింది. హెచ్‌ఐఎల్ అన్ని ప్లాంట్ల కార్యకలాపాలను మూసివేయడానికి బోర్డు ఆమోదం తెలిపిందని పేర్కొంది. దీంతో కేరళలోని ఉద్యోగమండల్, పంజాబ్‌లోని బటిండా వద్ద న్న హెచ్‌ఐఎల్ యూనిట్లు మూతపడ్డాయి. హెచ్‌ఐఎల్ కేరళలోని మొట్టమొదటి కేంద్ర ప్రభుత్వ రంగ యూనిట్. 1958 ఏప్రిల్ 24న స్థాపించారు. అప్పటి నుంచి లాభాల్లోనే నడిచింది. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత దీనిని నష్టాల్లోకి నెట్టింది. రెండేళ్ల క్రితమే ఇక్కడ ఉత్పత్తి కూడా నిలిపేసింది. ఈ సంస్థను కేరళ ప్రభుత్వం టేకోవర్ చేసుకోవడానికి ప్రయత్నించినా..కేంద్ర ప్రభుత్వం సహకరించలేదు. కనీసం ఇందులో పనిచేసే సిబ్బందిని ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్ ట్రావెన్‌కోర్ (ఎఫ్‌ఎసిటి)లోకి బదిలీ చేయాలన్న విజ్ఞప్తిని కూడా కేంద్రం పెడచెవినపెట్టింది. హెచ్‌ఐఎల్‌ను మూసివేయడంతో 45 మంది ఉద్యోగుల భవిష్యత్ అంధకారంలో పడింది. ఉద్యోగులకు ఇప్పటికే ఒక ఏడాది నుంచి జీతాలు చెల్లించడం లేదు. పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు గ్రాట్యుటీ ఇతర ప్రయోజనాలు లభించలేదు.

నిజాలు మాట్లాడితే దేశద్రోహ ముద్ర

- స్వతంత్ర మీడియాపై బిజెపి కుట్రలు ఫలించవు
- శ్రామికుల ఉద్యమాలు కవర్ చేసినందునే న్యూస్‌క్లిక్‌పై కక్షసాధింపు
- జంతర్ మంతర్ వద్ద వామపక్షాల ఆందోళనలో బృందాకరత్

జంతర్ మంతర్ వద్ద జరిగిన ధర్నాలో మాట్లాడుతున్న బృందాకరత్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

నిజాలు చెప్పేవారికి మోడీ సర్కార్ దేశద్రోహులుగా ముద్ర వేస్తోందని, ప్రశ్నించే తత్వాన్ని అది జీర్ణించుకోలేకపోతోందని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బృందాకరత్ విమర్శించారు. స్వతంత్ర మీడియాపై బిజెపి కుట్రలు ఫలించబోవని తెలిపారు. న్యూస్ క్లిక్, ద వైర్ తదితర స్వతంత్ర మీడియా సంస్థలను నాశనం చేయడానికి బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ చేస్తున్న కుట్రలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యంలో నాల్గో స్తంభంగా ఉన్న మీడియా స్వేచ్ఛను హరించివేయడంగా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిని నిరసిస్తూ మంగళవారం నాడిక్కడ జంతర్ మంతర్ వద్ద వామపక్షాల ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వివిధ సామాజిక తరగతులకు చెందిన ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. 'ప్రజాస్వామ్యాన్ని కాలరాస్తున్న మోడీ సర్కార్ నశించాలి.. మీడియా స్వేచ్ఛ వర్ధిల్లాలి' అంటూ నినదించారు. ఈ సందర్భంగా బృందా కరత్ మాట్లాడుతూ..కార్మికులు, అన్నదాతలు ఎదుర్కొంటున్న సమస్యలను, వారు చేస్తున్న ఉద్యమాలను కవర్ చేస్తున్నందునే 'న్యూస్ క్లిక్'పై బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నాయని ఆమె పేర్కొన్నారు. మరోవైపు విద్వేష విషం చిమ్మే సంఘ్ పరివార్ (ఆర్‌ఎస్‌ఎస్) వారపత్రిక 'ఆర్గనైజర్'కు మాత్రం ఎనలేని స్వేచ్ఛను కల్పించారని తప్పుబట్టారు. చైనాతో ముడిపెట్టి నకిలీ జాతీయవాదంతో పత్రికా స్వేచ్ఛపై మోడీ సర్కారు దాడి చేస్తోందన్నారు.

కేంద్ర ఏజెన్సీలు 2020 నుంచి న్యూస్ క్లిక్‌పై విచారణ జరుపుతున్నాయని, మూడేళ్లు శ్రమించినా ఇడి, సిబిఐ, ఐబిలు న్యూస్ క్లిక్‌కు వ్యతిరేకంగా ఏమీ కనుగొనలేకపోయాయని పేర్కొన్నారు. ప్రబీర్ పుర్కాయస్థతో సహా ఎవరినీ అరెస్టు చేయొద్దని హైకోర్టు స్పష్టమైన ఆదేశాలు గతంలోనే ఇచ్చిందని గుర్తు చేశారు. ఈ కేసును హైకోర్టు మళ్లీ విచారిస్తున్న సమయంలోనే ప్రబీర్ పుర్కాయస్థ, అమిత్ చక్రవర్తిని యుఎపిఎ కింద అరెస్టు చేశారని అన్నారు. ఎమర్జెన్సీ చీకటి రోజుల్లో జైలుశిక్ష అనుభవించిన వ్యక్తి ప్రబీర్ పుర్కాయస్థ అని, పోలియో కారణంగా శారీరక సమస్యను ఎదుర్కొంటున్న వ్యక్తి అమిత్ చక్రవర్తి అని బృందాకరత్ తెలిపారు. అలాంటి నిస్వార్థ పాత్రికేయులపై తప్పుడు కేసులు పెట్టి అక్రమంగా అరెస్టు చేసినందుకు మోడీ ప్రభుత్వం సిగ్గుపడాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం ఢిల్లీ రాష్ట్ర కార్యదర్శి కెఎం తివారి, అమర్‌జిత్ కౌర్ (సిపిఐ), జి దేవరాజన్ (ఫార్వర్డ్ బ్లాక్), రవిరాయ్ (సిపిఐ-ఎంఎల్), ఆర్‌ఎస్ దాగర్ (ఆర్‌ఎస్‌పి), ప్రకాశరావు (సిజిపిఐ) తదితరులు మాట్లాడారు.

ప్రబీర్, అమిత్‌కు 10 రోజుల జ్యుడీషియల్ కస్టడీ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఉపా కేసులో న్యూస్ క్లిక్ వ్యవస్థాపకులు ప్రబీర్ పుర్కాయస్థ, మానవ వనరుల (హెచ్‌ఆర్) హెడ్ అమిత్ చక్రవర్తికి ఢిల్లీ కోర్టు మంగళవారం పది రోజులపాటు జ్యుడీషియల్ కస్టడీ విధించింది. ఈ మేరకు పాటియాలా హౌస్ కోర్టు అదనపు సెషన్స్ జడ్జి (ఎఎస్‌జె) హర్దీప్ కౌర్ ఉత్తర్వులు జారీ చేశారు. సోమవారం ఈ కేసు తీర్పును రిజర్వు చేసిన కోర్టు మంగళవారం తీర్పు వెల్లడించింది. పుర్కాయస్థ తరపున న్యాయవాది అర్షదీప్ ఖురానా వాదనలు వినిపిస్తూ.. అరెస్టు చేయడానికి కారణాలు తెలియజేయనందున, అరెస్టు చట్టవిరుద్ధమని అన్నారు. జ్యుడీషియల్ కస్టడీని వ్యతిరేకించారు. 'జ్యుడీషియల్ రిమాండ్ అవసరం లేదు. ఈ కేసును ఇప్పటికే అనేక సార్లు ఢిల్లీ పోలీసులు, ఇడి, ఐటి అధికారులు పరిశీలించారు' అని ఖురానా తెలిపారు. 2021 జూన్, జులైలో ఢిల్లీ హైకోర్టు పుర్కాయస్థకు రక్షణ కల్పించిందని కూడా గుర్తు చేశారు. 'ఇది ఇప్పటికీ కొనసాగుతోంది. ఆ పిటిషన్లు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయి. హైకోర్టు రక్షణను పక్కదారి పట్టించేందుకే ఈ అరెస్టు జరిగింది' అని ఖురానా వాదించారు. అధికారంలో ఉన్న ప్రభుత్వాన్ని విమర్శించినందుకు జర్నలిస్టులను శిక్షించలేమని అన్నారు. ప్రభుత్వం, దాని విధానాల గురించి విమర్శనాత్మకంగా నివేదించడం ఉపా కిందకు రాదని తెలిపారు. జ్యుడీషియల్ కస్టడీకి పంపడం న్యాయాన్ని అపహాస్యం చేయడమే అవుతుందన్నారు. అమిత్ చక్రవర్తి తరపున న్యాయవాది కూడా జ్యుడీషియల్ కస్టడీని వ్యతిరేకించారు.

ఆగస్టు5 విభజనకు ప్రజలు వ్యతిరేకం

- కార్గిల్ హిల్ కౌన్సిల్ ఫలితాలు రుజువు చేశాయి

లడఖ్ : జమ్మూ కాశ్మీర్ రాష్ట్రాన్ని మూడు కేంద్ర పాలిత ప్రాంతాలుగా విభజించిన 2019 ఆగస్టు 5నాటి పరిణామాలను కార్గిల్, లడఖ్ ప్రాంత ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని కార్గిల్ జిల్లా హిల్ కౌన్సిల్ ఫలితాలతో స్పష్టమైంది.

లడఖ్‌లోని కార్గిల్ జిల్లా హిల్ కౌన్సిల్‌కి ఈ నెల 4న జరిగిన ఎన్నికల్లో మొత్తంగా 26 సీట్లకు గానూ 22 సీట్లను నేషనల్ కాన్ఫరెన్స్, కాంగ్రెస్ కూటమి గెలుచుకుంది. బిజెపి రెండు సీట్లు గెలుచుకుంది. ఇండిపెండెంట్లు రెండు స్థానాలను కైవసం చేసుకున్నారు. 30స్థానాలు కలిగిన హిల్ కౌన్సిల్‌లో నాలుగు సీట్లు మహిళలకు, మైనారిటీలకు కేటాయించారు. ఈ స్థానాలకు అభ్యర్థులను ప్రభుత్వం నామినేట్ చేస్తుంది. 370వ అధికరణ కింద కాశ్మీర్‌కు గల ప్రత్యేక ప్రతిపత్తిని రద్దు చేసి, పూర్వపు రాష్ట్రం నుండి వేరు చేయడంతో కార్గిల్ ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. దాన్ని పరిగణనలోకి తీసుకుంటే ఈ కూటమి విజయం ఏమాత్రమూ ఆశ్చర్యం కలిగించదు. కొంతమంది మాత్రంఈ తీర్పును ముందే ఊహించారు. నేషనల్ కాన్ఫరెన్స్ 12, కాంగ్రెస్ 10 స్థానాలను గెలుచుకున్నాయి. లడఖ్ స్వయంప్రతిపత్తి హిల్ డెవలప్‌మెంట్ కౌన్సిల్‌లో మెజారిటీకి 16 స్థానాలు అవసరం. లడఖ్‌ను కేంద్ర పాలిత ప్రాంతంగా చేసిన తర్వాత కార్గిల్‌లో జరిగిన మొదటి ఎన్నికలు ఇవి. 2019 ఆగస్టు 5నాటి కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలను కార్గిల్ ప్రజలు ఆమోదిస్తారా లేదా అని నిర్ణయించడానికి ఈ ఎన్నికలను ప్రామాణికంగా తీసుకున్నారు.

ప్రజల ఆమోదం లేకుండానే రాష్ట్రాన్ని మూడు కేంద్ర పాలిత ప్రాంతాలుగా అప్రజాస్వామికంగా, రాజ్యాంగ విరుద్ధంగా విభజించిన శక్తులకు, పార్టీలకు ఈ ఫలితాలు ఒక స్పష్టమైన సందేశాన్ని పంపాయని మాజీ ముఖ్యమంత్రి, నేషనల్ కాన్ఫరెన్స్ ఉపాధ్యక్షుడు ఒమర్ అబ్దుల్లా, ఆదివారం ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత ఎక్స్‌లో వ్యాఖ్యానించారు. 2019 వరకు హిల్ కౌన్సిల్ ఎన్నికలంటే కేవలం స్థానిక వ్యవహారాలకు మాత్రమే పరిమితమయ్యేవి. లడఖ్ సరిహద్దులు దాటిన అంశాల్లో వారికే మాత్రం ఆసక్తి లేదు. కానీ తాజాగా లడఖ్ కేంద్ర పాలిత ప్రాంతంగా మారిన తర్వాత ఈ ఎన్నికలు అసెంబ్లీ ఎన్నికలను తలపించాయి. తాజా ఫలితాలతో నేషనల్ కాన్ఫరెన్స్, కాంగ్రెస్ కూటమి మంచి ఫలితాలను సాధించిందని రుజువైంది.

ఇజ్రాయిల్ చర్యలను ఖండించిన ఐరాస

న్యూయార్క్ : గాజాను దిగ్బంధిస్తూ ఇజ్రాయిల్ జరుపుతున్న వరుస దాడులను ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల సంస్థ చీఫ్ వోల్కర్ తుర్క్ మంగళవారం ఖండించారు. అంతర్జాతీయ చట్టం ప్రకారం ఇలాంటి దిగ్బంధనాలు చట్టవిరుద్ధమని అన్నారు. ప్రజలను అపహరించి బందీలుగా వుంచడం కూడా అంతర్జాతీయ చట్టాల ప్రకారం నిషిద్ధమని అన్నారు. గాజాలో ఆహార, వైద్య సరఫరాలను అందకుండా చేయడంకూడా యుద్ధ నేరం కిందకే వస్తుందని ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల ప్రతినిధి రవీనా షామ్‌దాసాని వ్యాఖ్యానించారు. ఈ ఘర్షణల్లో ఇరు పక్షాలూ యుద్ధ నేరాలకు పాల్పడినట్లు స్పష్టమైన సాక్ష్యాధారాలున్నాయని ఐక్యరాజ్య సమితి నియమించిన విచారణా కమిషన్ ఒక ప్రకటనలో పేర్కొంది. గాజా నుండి ఇప్పటికే దాదాపు 2 లక్షల మంది ఇళ్లను వీడినట్లు ఐక్యరాజ్య సమితి మానవతా కార్యాలయ ప్రతినిధి తెలిపారు. విద్యుత్, ఆహారం, నీరు, ఇంధనం ఇలా నిత్యావసరాలేవీ లేకుండా గాజాను దిగ్బంధించడం పట్ల యునిసెఫ్ కూడా తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది.

ఇద్దరు హమాస్ నేతల మృతి

దక్షిణ గాజా స్ట్రిప్‌లో ఖాన్ యూనిస్ వద్ద జరిగిన వైమానిక దాడిలో హమాస్ పొలిటికల్ ఆఫీస్‌కి చెందిన ఇరువురు సభ్యులు మరణించారని ఆ గ్రూపునకు చెందిన అధికారి తెలిపారు. ఇజ్రాయిల్ ఓడరేవు నగమైన అష్కెలాన్‌ను మంగళవారం సాయంత్రం ఐదు గంటల కల్లా వీడి వెళ్ళాల్సిందిగా హమాస్ సాయుధ విభాగ ప్రతినిధి ప్రజలను కోరారు.

చైనా ఖండన

హమాస్-ఇజ్రాయిల్ ఘర్షణలో పౌరులకు హాని కలిగించే చర్యలను చైనా తీవ్రంగా ఖండించింది. తక్షణమే కాల్పుల విమరణ జరపాలని కోరింది. పాలస్తీనా, ఇజ్రాయిల్ పక్షాల మధ్య జరుగుతున్న ఘర్షణల పట్ల చైనా తీవ్రంగా ఆందోళన చెందుతోందని మధ్య ప్రాచ్యంపై చైనా ప్రత్యేక దూత ఝాయి జున్ తెలిపారు. కాగా తాజాగా చెలరేగిన ఘర్షణలు చూస్తుంటే మధ్య ప్రాచ్యంలో అమెరికా రాజకీయాలు విఫలమయ్యాయని రుజువవుతోందని రష్యా అధ్యక్షుడు పుతిన్ అన్నారు.

భారత్‌ది కీలక పాత్ర : పాలస్తీనా దూత

పాలస్తీనా ప్రయోజనాలకు భారత్ మద్దతివ్వడమనేది మహాత్మా గాంధీ కాలంనుండి వుందని, పైగా అంతర్జాతీయంగా భారత్ ఎదుగుతున్న తీరు, పశ్చిమాసియాలో కీలక పక్షాలను ప్రభావితం చేయగల సత్తా ఇవన్నీ కలిసి భారత్ కీలక పాత్ర పోషించడానికి దోహదపడతాయని పాలస్తీనా రాయబారి అదన్ అల్హాజియా మంగళవారం వ్యాఖ్యానించారు. ఇరు దేశాలకు భారత్ మిత్ర దేశమని, ఉద్రికత్తలు తగ్గించే, పాలస్తీనా సమస్యకు పరిష్కారం అందించే దిశగా కృషి చేసేందుకు అర్హత వుందని అన్నారు.

భిన్నమైన వైఖరితో మోడీ సర్కార్

పాలస్తీనా ప్రజానీకానికి భారత్ ఎప్పటి నుంచో అండగా ఉంటోంది. కానీ మితవాద ధోరణులతో ప్రజాస్వామ్య విలువలకు తిలోదకాలిస్తున్న వైనం ఇటీవల కాలంలో పెరిగిపోయింది. యుద్ధోన్మాదం రగిలిపోతున్న అమెరికాకు వంత పాడుతున్న మోడీ సర్కార్ ఇప్పుడు ఇజ్రాయిల్‌కు అండగా నిలుస్తామని చెప్పడం ఆందోళనకు గురిచేస్తోంది. యుద్ధవాతావరణంలో తమకు అండగా నిలువాలంటూ ఇజ్రాయిల్ ప్రధానమంత్రి నెతన్యాహు మంగళవారం నాడు భారత ప్రధాని మోడీకి ఫోన్ చేశారు. దీనిపై స్పందించిన మోడీ..ఇజ్రాయిల్‌కు అండగా నిలుస్తామంటూ హామీ ఇచ్చారు. తీవ్రవాదం ఏ రూపంలో వున్నా భారత్ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. ఈ మేరకు ఆయన సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారు.

న్యూయార్క్‌లోని టైమ్ స్క్వేర్‌లో పాలస్తీనీయులకు సంఘీభావంగా వేలాది మంది ప్రదర్శన

పాలస్తీనాకు సంఘీభావంగా దేశ దేశాల్లో ప్రదర్శనలు

వాషింగ్టన్: ఇజ్రాయిల్‌లో హమాస్ భారీ సాయుధ ఆపరేషన్ తరువాత ఇజ్రాయిల్ దళాలు గాజా స్ట్రిప్‌ను దిగ్బంధనం చేస్తూ , భీకర వైమానిక దాడులు కొనసాగించడానికి వ్యతిరేకంగా అరబ్ దేశాల్లోనే కాదు, అమెరికా, బ్రిటన్ వంటి పశ్చిమ దేశాల్లోనూ పెద్ద యెత్తున నిరసనలు వ్యక్తమవుతున్నాయి.

పాలస్తీనాకు సంఘీభావంగా అమెరికాలోని న్యూయార్క్, శాన్‌ఫ్రాన్సిస్కో, చికాగో, లాస్‌ఏంజెల్స్, అట్లాంటాతో సహా పలు నగరాల్లో వేలాది మంది వీధుల్లోకి వచ్చారు. బ్రిటన్ రాజధాని లండన్‌లోనూ పెద్దయెత్తున ప్రదర్శనలు జరిగాయి. లండన్‌లోని ఇజ్రాయిల్ దౌత్యకార్యాలయం ఎదుట వందలాది మంది నిరసన ప్రదర్శన జరిపారు. పాలస్తీనీయులకు నీరు, ఆహారం, ఇంధనం వంటివి ఏవీ అందకుండా అన్ని మార్గాలను దిగ్బంధించడాన్ని, తెల్ల భాస్వరం వంటి ప్రమాదకరమైన రసాయనాన్ని ఆయుధంగా చేసుకోవడాన్ని వారు ఆక్షేపించారు.

బొలీవియాలో లాపాజ్‌లోని అమెరికన్ ఎంబసీ వెలుపల వేలాది మంది గుమికూడి పాలస్తీనాకు తమ సంఘీభావం తెలియజేశారు. టర్కీ,ట్యునీసియా, కువైట్, మొరాకల్లో పాలస్తీనా యాక్షన్ గ్రూపు ఆధ్వర్యంలో వేలాదిమంది వీధుల్లోకి వచ్చి తమ సంఘీభావం తెలిపారు.

ఇజ్రాయిల్ వైఖరే కారణం ! : కమ్యూనిస్టు పార్టీల విమర్శ

జెరూసలేం : గాజాలో తాజాగా నెలకొన్న పరిణామాలు, హమస్ సాగిస్తున్న పోరుకు ప్రధాన బాధ్యత ఇజ్రాయిల్ ఆక్రమణ శక్తులదేనని ప్రపంచవ్యాప్తంగా గల కమ్యూనిస్టు పార్టీలు పేర్కొన్నాయి. పాలస్తీనా పీపుల్స్ పార్టీ ఆదివారం ఒక ప్రకటన చేస్తూ, పాలస్తీనా ప్రజలు తమ చట్టబద్ధమైన హక్కులను పొందకపోతే ఈ ప్రాంతంలో, ప్రపంచంలో శాంతి, భద్రత, సుస్థిరతలు సాధించలేమని తాజా ఘర్షణలు రుజువు చేశాయని పేర్కొంది. నెతన్యాహు ప్రభుత్వం అనుసరిస్తున్న నేరపూరితమైన ఆక్రమణ విధానాన్ని ఇజ్రాయిల్ కమ్యూనిస్టు పార్టీ (ఎంకెఐ) తీవ్రంగా విమర్శించింది. తూర్పు జెరూసలేంతో సహా వెస్ట్ బ్యాంక్‌లో అక్రమ ఆక్రమణనలు తక్షణమే ఇజ్రాయిల్ నిలుపుచేయకపోతే ఈ ప్రాంతంలో శాంతి వుండదని బ్రిటన్ కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి రాబర్ట్ గ్రిఫిత్ పేర్కొన్నారు. గాజా స్ట్రిప్‌ను నులిమివేయడానికి పాల్పడుతున్న చర్యలను తక్షణమే విరమించాలన్నారు. పాలస్తీనియన్లకు ప్రపంచవ్యాప్తంగా విస్తృతంగా మద్దతు, సంఘీభావం లభిస్తున్న వేళ కమ్యూనిస్టు పార్టీల ప్రకటనలు వెలువడ్డాయి. పాలస్తీనియన్లకు మద్దతుగా అమెరికా, యూరప్, బ్రిటన్, అరబ్ దేశాల్లోని పలు నగరాలు, పట్టణాల్లో ఆదివారం ప్రదర్శనలు జరిగాయి. మరోవైపు ఇజ్రాయిల్ వరుస బాంబు దాడులతో గాజాను ఉక్కిరి బిక్కిరి చేస్తోంది. ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి ఆదివారం అత్యవసరంగా సమావేశమైంది, కానీ ఎలాంటి చర్యలు తీసుకోవడంలో విఫలమైంది. ఐక్యరాజ్య సమితిలో రష్యా రాయబారి వాసిలీ నెబెంజియా మాట్లాడుతూ, తక్షణమే కాల్పుల విరమణ జరగాలని కోరారు. అర్ధవంతమైన చర్చలు జరగాలన్నారు. దశాబ్దాల తరబడి ఇలాంటి చర్చలు లేకపోవడం వల్లనే ఈ పరిస్థితి ఎదురైందన్నారు. చైనా రాయబారి ఝాంగ్ జున్ కూడా రెండు దేశాల ఏర్పాటే ఈ సమస్యకు పరిష్కారమని స్పష్టం చేశారు.

ఉద్రిక్తతలకు ఆజ్యం పోస్తున్న అమెరికా

- చైనా పరిశీలకుల వ్యాఖ్య

బీజింగ్ : హమాస్ దాడి చేసిన వెంటనే ఇజ్రాయిల్‌కు ఆయుధాలు, యుద్ధ నౌకలు పంపాలని అమెరికా ఏకపక్షంగా తీసుకున్న నిర్ణయంతో ఉద్రికత్తలకు మరింత ఆజ్యం పోసినట్లైందని, మానవతా సంక్షోభం మరింతగా పెచ్చరిల్లిందని చైనా పరిశీలకులు వ్యాఖ్యానించారు. పైగా, ఈ ఆకస్మిక దాడికి అమెరికా తప్పుడు రీతిలో స్పందించడం చూస్తుంటే మధ్యప్రాచ్యంలో విధానాల రూపకల్పనలో విఫలమైనట్లు అర్ధమవుతోందని అన్నారు. రష్యా-ఉక్రెయిన్ సంక్షోభంలో చేసినట్లుగానే ఇక్కడ కూడా ఉద్రిక్తతలను రెచ్చగొట్టడమే అమెరికా లక్ష్యంగా వుందన్నారు. ఇజ్రాయిల్‌కు అమెరికా మిలటరీ సామాగ్రిని తరలించడంపై చైనా విదేశాంగ వ్యవహారాల ప్రతినిధి మావో నింగ్ స్పందిస్తూ, దీనిని చర్చలు, సంప్రదింపుల ద్వారానే పరిష్కరించుకోవాలని చైనా గట్టిగా విశ్వసిస్తోందని అన్నారు. తక్షణమే కాల్పుల విరమణ జరిపి, యుద్ధాన్ని ఆపి, పరిస్థితిని మరింత క్షీణించకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అంతర్జాతీయ ఘర్షణలు తలెత్తినపుడు సాధారణంగా అమెరికా వ్యవహరించే పక్షపాత ధోరణి అంతిమంగా ఉద్రిక్తతలకు ఆజ్యం పోస్తుందని చైనా పరిశీలకులు వ్యాఖ్యానించారు. సైనిక సంపత్తి దృష్ట్యా చూసినట్లైతే పాలస్తీనా కన్నా ఇజ్రాయిల్ పై స్థానంలో వుంటుందని, అమెరికా నిజంగా శాంతిని కోరుకున్నట్లైతే, ఏకపక్షంగా వ్యవహరించడానికి బదులు ఉద్రిక్తతలను చల్లార్చే చర్యలు చేపట్టాల్సి వుందని చైనా సమకాలీన అంతర్జాతీయ సంబంధాల సంస్థకు చెందిన రీసెర్చ్‌ఫెలో తియాన్ వెన్‌లిన్ వ్యాఖ్యానించారు.

క్షేమంగానే అమర్త్యసేన్

- ఆయన కుమార్తె నందన వెల్లడి

న్యూఢిల్లీ: ప్రఖ్యాత ఆర్థిక వేత్త, నోబెల్ గ్రహీత అమర్త్యసేన్ (89) క్షేమంగా ఉన్నారని ఆయన కుమార్తె నందనా సేన్ తెలిపారు. ఆయన చనిపోయారంటూ మంగళవారం సాయంత్రం సామాజిక మాధ్యమాల్లో వదంతులు వ్యాపించాయి. ఈ ఏడాది ఆర్థికశాస్త్ర నోబెల్ బహుమతికి ఎంపికైన మహిళా ఆర్థిక వేత్త క్లాడియా గోల్డిన్ పేరుతో ట్విట్టర్ (ఎక్స్)లో ఉన్న అన్‌వెరిఫైడ్ ఖాతాలో 'అమర్త్యసేన్ ఇకలేరు' అంటూ ఒక ట్వీట్ చేయడంతో ఈ వార్త కొద్దిసేపట్లోనే వైరల్‌గా మారింది. అయితే అది తప్పుడు వార్త అని అమర్త్యసేన్ కుటుంబ సభ్యులు స్పష్టం చేశారు. సామాజిక మాధ్యమాల్లో వచ్చిన వదంతులను నిజం అనుకొని ఆందోళన వ్యక్తం చేసినవారందరికీ అమర్త్యసేన్ కుమార్తె నందనాసేన్ కృతజ్ఞతలు తెలిపారు. తమ తండ్రి సంపూర్ణంగా క్షేమంగా ఉన్నారని ట్వీట్ చేశారు. 'మిత్రులారా, నాన్న పట్ల మీ ఆందోళన వ్యక్తం చేసినందుకు కృతజ్ఞతలు, అయితే అది తప్పుడు వార్త, నాన్న పూర్తిగా క్షేమంగా ఉన్నారు. కేంబ్రిడ్జ్‌లో నాన్నతో పాటు కుటుంబ సభ్యులమంతా వారమంతా అద్భుతంగా గడిపాం. సోమవారం రాత్రి వీడ్కోలు చెబుతున్న సమయంలోనూ ఆయన ఇచ్చిన ఆత్మీయ కౌగిలింత ఎప్పటిలాగే దృఢంగా ఉంది. హార్వర్డ్ యూనివర్సిటీలో ఆయన వారానికి రెండు కోర్సులు బోధిస్తున్నారు. అలాగే ఆయనకు సంబంధించిన రంగంలో ఒక పుస్తకాన్ని కూడా రాస్తున్నారు. ఎప్పటిలాగే బిజీగా గడుపుతున్నారు' అని నందనాసేన్ పేర్కొన్నారు.

రాజ్యాంగ ధర్మాసనానికి ఎస్‌సి వర్గీకరణ పిటిషన్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఎస్‌సి రిజర్వేషన్ల వర్గీకరణ అంశంపై మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎంఆర్‌పిఎస్) దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బెంచ్ పంజాబ్ వర్సెస్ దవిందర్ సింగ్ కేసుకు అటాచ్ చేసింది. రిజర్వేషన్లకు సంబంధించిన అంశమైనందున రాజ్యాంగ ధర్మాసనం విచారిస్తోన్న దవిందర్ కేసుకు జత చేస్తున్నట్లు స్పష్టం చేసింది. ఎస్‌సి రిజర్వేషన్లు చేపట్టాలంటూ ఎంఆర్‌పిఎస్ ఇటీవల సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ పిటిషన్‌ను మంగళవారం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డివై చంద్రచూడ్, జస్టిస్ జెబి పార్డీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాతో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. ఈ పిటిషన్‌ను ఏడుగురు సభ్యులతో కూడిన రాజ్యాంగ ధర్మాసనానికి అటాచ్ చేస్తున్నట్లు పేర్కొంది.

బాపట్లలో ధర్నా శిబిరంలో రాత్రి నిద్రిస్తున్న యానిమేటర్లు

సర్క్యులర్ 64ను రద్దు చేయాల్సిందే

(మొదటి పేజీ తరువాయి)

చేయలేదన్నారు. విత్తనాలు అమ్మడం, గేదెలు, గొర్రెల యూనిట్లను కొనుగోలు చేయించడం లాంటివి టార్గెట్ రూపంలో పెట్టి యానిమేటర్లను మానసిక ఒత్తిడికి గురిచేస్తుండడం శోచనీయమన్నారు. ప్రభుత్వ ఒత్తిడి, పనిభారం కారణంగా యానిమేటర్లు ప్రాణాలు కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే డిసెంబర్లో 'చలో విజయవాడ' కార్యక్రమానికి పిలుపు ఇస్తామన్నారు.

పశ్చిమగోదావరి జిల్లా భీమవరం కలెక్టరేట్ వద్ద 36 గంటల ధర్నాను పిడిఎఫ్ ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు ప్రారంభించి మాట్లాడుతూ యానిమేటర్ల జీతం రూ.పది వేలకు పెంచుతానని గత ఎన్నికల సమయంలో హామీ ఇచ్చి నేటికీ రూ.ఎనిమిది వేలే ఇవ్వడం దారుణమన్నారు. యానిమేటర్ల ఉద్యోగాలను మూడు సంవత్సరాలకే పరిమితం చేసే అధికారం ముఖ్యమంత్రి జగన్‌కు ఎవరిచ్చారని ప్రశ్నించారు. స్కీమ్ వర్కర్లపై పని ఒత్తిడి పెరిగిందన్నారు. అమలాపురం కలెక్టరేట్ ఎదుట యానిమేటర్ల ఆందోళనలో పిడిఎఫ్ ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు మాట్లాడారు. యానిమేటర్లకు గ్రూప్ ఇన్సూరెన్స్ కల్పించాలని, మెర్జింగ్‌ను నిలిపేయాలని, బకాయిలు చెల్లించాలని, అక్రమ తొలగింపులు ఆపాలని డిమాండ్ చేశారు. 15 సంఘాలలోపు ఉన్న వారికి జీతాలు చెల్లించకపోవడం అన్యాయమన్నారు. అనంతపురం, రాయచోటి, నంద్యాల, చిత్తూరు, ఒంగోలు, గుంటూరు, మచిలీపట్నం, ఏలూరు, శ్రీకాకుళం కలెక్టరేట్ల వద్ద, కర్నూలులో ధర్నా చౌక్‌లో, విశాఖలో జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద, అల్లూరి సీతారామరాజు జిల్లాలో పాడేరు, రంపచోడవరం ఐటిడిఎల వద్ద యానిమేటర్లు ఆందోళనకు దిగారు.

గింజకట్టని మొక్కజొన్న!

(మొదటి పేజీ తరువాయి)

చెప్పాయి. అయితే, 200 కిలోలలోపే దిగుబడి వచ్చింది. కావేరి, బేయర్ విత్తనాలతోపాటు సిరి, బయోసీడ్ విత్తనాలను కూడా కొంతమంది రైతులు వేశారు. వీరి కూడా నష్టపోయారు.

ఒప్పందాన్ని కంపెనీలు అమలు చేస్తాయా?

కావేరీ, బేయర్ విత్తన కంపెనీలు రైతులతో చేసుకున్న ఒప్పందాలను అమలు చేస్తాయా? లేదా? అనేది ప్రస్తుతం ప్రశ్నార్థకంగా ఉంది. మొక్కజొన్న వ్యాపారులే విత్తన కంపెనీలు, రైతుల మధ్య దళారులుగా వ్యవహరించి ఒప్పందాలు కుదిర్చారు. దీంతో, నష్టపోయిన తమకు వీరు న్యాయం జరిగేలా చూడడం లేదని, విత్తన కంపెనీలకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని రైతులు విమర్శిస్తున్నారు. అక్కడక్కడా కొందరికి పరిహారం ఇస్తామని కంపెనీలు చెప్తున్నాయని, అయితే, రబీ సీజన్లో కూడా తమ కంపెనీ విత్తనాలనే మళ్లీ వేయాలని షరతు విధిస్తున్నాయని, ఇందుకు ఒప్పుకున్న వారికి మాత్రమే నిబంధనలకు లోబడి పరిహారం ఇచ్చేందుకు ప్రయత్నిస్తామని కంపెనీలు చెప్తున్నాయని పలువురు రైతులు 'ప్రజాశక్తి'కి తెలిపారు. పరిహారం ఇప్పించే విషయంలో వ్యవసాయ శాఖ ప్రేక్షక పాత్ర పోషిస్తోందని విమర్శిస్తున్నారు. తమ ప్రమేయం లేకుండా ఒప్పందాలు జరుగుతున్నందున తాము బాధ్యత వహించలేమని వ్యవసాయ శాఖాధికారులు చెప్తున్నారు.

మా దృష్టికి రాలేదు

మొక్కజొన్న పంట దెబ్బతిన్న విషయం ఇంకా మా దృష్టికి రాలేదు. విత్తన కంపెనీలతో రైతులు నేరుగా ఒప్పందం చేసుకుంటున్నారు. నష్టం జరిగితే నిబంధనల మేరకు ఆ కంపెనీలు రైతులకు పరిహారం చెల్లించాలి

- ఎం.మధుసూధనరావు, వ్యవసాయ శాఖ ఎడి

పరిహారం కోసం ఎదురు చూస్తున్నాను



నేను కావేరి సీడ్స్ కంపెనీ విత్తనాలు నాటాను. పంట దిగుబడి పూర్తిగా లేదు. రెండు ఎకరాల్లో సాగు చేశాను. నష్టం జరిగితే పరిహారం చెల్లిస్తానని విత్తన కంపెనీ నోటిమాటగా ఒప్పందం చేసింది. ఎకరానికి రూ.30 వేలు ఇస్తామని చెప్పింది. పరిహారం కోసం ఎదురుచూస్తున్నాను. రబీలో కూడా ఇదే కంపెనీ విత్తనం నాటితే పరిహారం గురించి ఆలోచిస్తామని ఆ కంపెనీ ప్రతినిధులు చెప్తున్నారు.

- కిలారి రామకృష్ణ, రైతు, మామిడిపల్లి

ఎకరానికి రూ.35 వేలు ఇస్తామన్నారు

నేను రెండున్నర ఎకరాల్లో సిరి కంపెనీ విత్తనాలు వేశాను. పంట పూర్తిగా దెబ్బతింది. ఎకరానికి రూ.35 వేలు పరిహారం చెల్లిస్తామని విత్తన కంపెనీ ప్రతినిధులు నోటిమాటగా అప్పట్లో చెప్పారు. ఇప్పుడు ఎంతిస్తారో చూడాలి.

- కర్రి బంగారునాయుడు, రైతు, మామిడిపల్లి

మీకోసం

నెయ్యి కరగబెట్టినప్పుడు గిన్నె అడుగుభాగంలో పేరుకుపోయిన జిడ్డు వదలాలంటే ఆ గిన్నెలో కొంచెం నీళ్లు ఒక చెంచా సోడా ఉప్పు వేసి ఐదు నిమిషాలు బాగా మరగబెడితే జిడ్డు త్వరగా వదులుతుంది.

జీవన సౌరభం

ఓడిపోతాననే భయంతో ముందుకు సాగని వ్యక్తి జీవితంలో ఎప్పటికీ విజయం సాధించలేడు.

తరగతి గది

కల్మషం లేని నవ్వుల నిధి
చిచ్చర పిడుగుల సన్నిధి
విజ్ఞానాల పెన్నిధి
నైతిక విలువల నది

నల్లబల్లపై రాతలు
సుద్దముక్క విన్యాసాలు
మనసులు గెలిచే గురువులు
మానవ వనరుల ఆనవాలు

ఆటపాటల విన్యాసాలు
రెక్కలు విప్పిన ఊహలు
చిగురులు తొడిగే భావాలు
మనిషి జీవన విలువలు

అజ్ఞాన తిమిర సంహారిణి
విజ్ఞాన జీవన వాణి
అనుభవాల ప్రవాహిని
ఆనందాల సుహాసిని

తరగతి గది
చిన్నారుల మది
శాస్త్ర విజ్ఞాన వారధి
సమాజ ప్రగతి సారథి

- మొర్రి గోపి,
88978 82202.



జత చేయండి

పిల్లలూ, ఇక్కడ కొన్ని ఆకు బొమ్మలను ఇచ్చాం. వాటిని లెక్కపెట్టి వాటికెదురుగా ఉన్న సరైన అంకెలతో, ఆ తరువాత పక్కనే చెట్లలో దాగి ఉన్న రంగుల ఆకులతో కూడా జతపర్చండి.

నేను గీసిన బొమ్మ

ఆన్వీ సజ్జా, కిండర్ గార్డెన్, ఆస్ట్రేలియా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

ఒకప్పుడు రోజు కూలీ.. ఇప్పుడు పతక విజేత..

ఆశ.. ఆకాంక్ష.. అలుపెరగని పట్టుదల.. ఎంతోమందిని ఉన్నత శిఖరాలు అందుకునేలా చేస్తుంది. అలా ఓ రోజు కూలీ చేసుకునే కుర్రాడు మనుగడ కోసం హోటల్లో కప్పులు కడిగే పని చేశాడు. ఉపాధి కూలీగా గుంటలు తవ్వాడు. రోడ్లు వేశాడు. ఇన్ని చేస్తున్నా అతని కళ్ల ముందు మాత్రం ఓ ఉన్నత లక్ష్యం పెట్టుకున్నాడు. ఆ లక్ష్యం దిశగా పరుగులాంటి నడక సాగించాడు. ఇటీవల జరిగిన ఆసియా గేమ్స్‌లో 'రేస్ వాక్' విభాగంలో మంజురాణితో జంటగా కాంస్య పతకం తీసుకున్న రాంబాబు గురించే ఇప్పుడు మనం చెప్పుకుంటోంది.

ఉత్తరప్రదేశ్ సోన్‌భద్ర జిల్లా బెహురా గ్రామానికి చెందిన రాంబాబుది నిరుపేద కుటుంబం. బాబు తండ్రి పారిశుధ్య కార్మికుడిగా నెలకు రూ.3000 నుండి రూ.3500 సంపాదించేవాడు. నలుగురు బిడ్డలున్న ఆ కుటుంబంలో మొత్తం ఆరుగురు సభ్యులు మూడు పూటలా తిండి తినడానికే నానా ఇబ్బందులు పడేవారు. అటువంటి స్థితిలో ముగ్గురు తోబుట్టువుల మధ్య పుట్టిన ఒకే ఒక్క మగపిల్లవాడు రాంబాబు నాన్నకు తోడుగా పొలం బాట పట్టాడు. 'పేదింటి కుటుంబాల్లో ఇదే తంతు జరుగుతుంది. నాన్న పనిచేసేందుకు మాకు స్వంత భూమి లేదు. ఇతరుల పొలంలోకి కూలీగా వెళ్లేవాడు. సీజనల్‌గా పనులు ఉండేవి. ఇలాంటి పరిస్థితుల్లో నేను చదువుపై శ్రద్ధ పెట్టకుండా నాన్నతో పొలం వెళ్లేవాడ్ని. కానీ అమ్మ మాత్రం చదివించాలనుకుంది. ఇంటికి దూరంగా హాస్టల్‌లో చేర్పించింది. అలా నేను జవహర్ నవోదయ స్కూల్లో చేరాను' అంటున్న రాంబాబు 2012 ఒలింపిక్ గేమ్స్‌లో ఇండియా ఆరు పతకాలు సాధించడం, అప్పటివరకు ఏ లక్ష్యమూ లేని తనను ఓ ఉన్నత లక్ష్యం వైపు అడుగులు వేసేలా చేసిందని చెబుతున్నాడు.

ఆ ఒలింపిక్ గేమ్స్ నా లక్ష్యాన్ని నిర్దేశించాయి

'2012 ఒలింపిక్ ప్రసారాలను మా హాస్టల్ టీవీలో చూశాను. మరుసటి రోజు మన దేశ విజేతల ఫొటోలను న్యూస్‌పేపర్ల మొదటిపేజీల్లో వేశారు. మేరీ కోమ్, సైనా నెహ్వాల్, సుశీల్ కుమార్, గగన్ నారంగ్‌ల క్రీడా ప్రయాణాన్ని ఎంతో గొప్పగా రాశారు. అవన్నీ చదివాను. ఆ క్లిప్పింగులను కత్తిరించి జాగ్రత్తగా భద్రపరుచుకున్నాను. ఆ రోజే నా లక్ష్యం నిర్దేశించుకున్నాను. ఎన్ని అడ్డంకులు ఎదురైనా వెనుకడుగు వేయకూడదనుకున్నాను' అంటున్న రాంబాబు మొదట్లో పరుగును క్రీడాంశంగా ఎంచుకున్నాడు. 10 వేలు, 5 వేల మీటర్ల పరుగుపందెంలో కూడా పాల్గొన్నాడు. కానీ పోషకాహార లోపంతో బాధపడుతున్న అతనికి మోకాళ్ల నొప్పులు తీవ్రంగా వేధించేవి. దీంతో పరుగు నుండి పరుగు లాంటి నడకను సాధన చేయడం మొదలుపెట్టాడు.

వెయిటర్‌గా అవమానాలు పడ్డాను

ఈ ప్రయాణంలో శిక్షణ కోసం గ్రామాన్ని వదిలి నగరానికి చేరాడు. కోచ్ చంద్రబాహన్ యాదవ్ నిర్వహిస్తున్న అథ్లెటిక్ స్టేడియంలో పేరు నమోదు చేసుకున్నాడు. అక్కడే ఓ ఇంట్లో అద్దెకు ఉండేవాడు. 'అమ్మానాన్న ఇంటి నుండి డబ్బులు పంపించేవారు. అయితే అవి ఇంటి అద్దెకే సరిపోయేవి కాదు. దీంతో శిక్షణ ముగిశాక పార్ట్‌టైమ్‌గా ఓ హోటల్లో వెయిటర్‌గా పని చూసుకున్నాను. నెలకు రూ.3000 ఇచ్చేవారు. అర్ధరాత్రి వరకు పనిచేసేవాడ్ని. హోటల్‌కి వచ్చే కస్టమర్లు చాలా అనుచితంగా ప్రవర్తించేవారు. అమర్యాదగా మాట్లాడేవారు. ఇక అక్కడ ఉండలేక గ్రామానికి తిరిగి వచ్చేశాను' అంటూ గతంలో తనకెదురైన చేదు అనుభవాలను గుర్తుచేసుకున్నాడు.

ఉపాధి కూలీగా గుంటలు తవ్వాడు

అవమానాలు పడుతున్నా తన లక్ష్యం మాత్రం విడిచిపెట్టలేదు రాంబాబు. గ్రామానికి వచ్చేశాక, 2020లో నిర్వహించిన 50 కిలోమీటర్ల నేషనల్ రేస్ వాక్ పోటీల్లో పాల్గొని పతకం సాధించాడు. అయితే ఆ తరువాత దేశంలో విధించిన కరోనా లాక్‌డౌన్‌తో పనుల్లేక రాంబాబు కుటుంబం వీధిన పడింది. అప్పుడే గ్రామంలో ఉపాధిహామీ పనులు మొదలయ్యాయి. ఆ పనులకు తండ్రి వెళుతుంటే రాంబాబు కూడా వెంట వెళ్లాడు. 'నాన్నకు పనిలో సాయంగా వెళ్లి గుంటలు తవ్వేవాడిని. రోడ్ల మరమ్మతు పనులు చేసేవాడ్ని. రోజుకు రూ.300 వరకు వచ్చేవి. ఆ సంపాదనే ఆ రోజు మా కుటుంబాన్ని నడిపించింది' అంటున్నాడు.

మనుగడ కోసం ఒక పక్క పనులు చేయడం, మరోపక్క జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో పాల్గొనడం అతని దినచర్యగా ఉండేది. 'ఖర్చుల కోసమే పనులు చేసేవాడ్ని. 2021 నుండి వరుసగా పోటీల్లో పాల్గొంటున్నాను. ఈ ప్రయాణంలో నికర ఆదాయం వచ్చే ఉపాధి దొరికితే చాలనుకునేవాడ్ని. కానీ ఇప్పుడు నేను ఎంచుకున్న లక్ష్యం నా కుటుంబానికి, దేశానికి పేరు తెచ్చిపెడుతుందని అసలు ఊహించలేదు' అంటున్నాడు.

శిక్షణ కోసం ఆవుదూడను అమ్మేశారు

నైపుణ్య శిక్షణ ఇస్తే కొడుకు ఇంకా రాణిస్తాడని ఆ తల్లిదండ్రి తమకున్న ఒక్క ఆవుదూడను సంతలో అమ్మేసి అకాడెమీ శిక్షణకు పంపించారు. ఆనాటి సంఘటన ఇప్పుడు గుర్తుచేసుకుంటూ తల్లిదండ్రులు ఆనందంతో ఆనందభాష్పాలు రాలుస్తున్నారు.

'నా బిడ్డ ఎప్పుడో ఒకప్పుడు విజయం సాధిస్తాడని నాకు తెలుసు. అయితే అది ఇంత త్వరగా వస్తుందని మాత్రం ఊహించలేదు. ఇప్పుడు నా బిడ్డ పేరు మీదే ఓ రికార్డు ఉంది. ఇది తలచుకుంటేనే ఆనందంతో నా కాళ్లు తేలిపోతున్నాయి' అంటోంది రాంబాబు తల్లి. ఎన్ని ఒడుదుడుకులు ఎదురైనా, పేదరికం వేధిస్తున్నా రాంబాబు తన పరుగు ఆపలేదు. నడకనే పరుగుగా చేసుకుని పతకాలు సాధిస్తున్నాడు. ఎంతోమంది యువతకు ఆదర్శంగా నిలుస్తున్నాడు.

ఉల్లి మేలు..

ఉల్లిపాయల్లో ఆరోగ్యానికి మేలు చేసే అనేక గుణాలు ఉన్నాయి. ప్రతి రోజూ మనం తీసుకునే ఆహారంలో ఉల్లిపాయలను ఒక భాగం చేసుకొంటాం. పచ్చి ఉల్లిపాయలను తీసుకోవడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి.

- పచ్చి ఉల్లిపాయలను తినేవారిలో డయాబెటిస్ వచ్చే అవకాశాలు తక్కువగా ఉంటాయి.
- ఉల్లి క్యాన్సర్ వంటి సమస్యలను రాకుండా చేస్తుంది. శరీరంలో వ్యాధి నిరోధక శక్తిని పెంచడానికి, జ్వరంతోపాటు దగ్గును తగ్గించడానికి ఉల్లిపాయలు ఉపయోగపడతాయి.
- ఉల్లిలో ఫైబర్, విటమిన్ బి, విటమిన్ బీ సిక్స్, విటమిన్ బీ నైన్, ఖనిజ లవణాలు ఎన్నో ఉన్నాయి. కూరలలో వండుకుని తినడమే కాకుండా, పచ్చి వాటిని కూడా తీసుకోవడం చాలా మంచిది.
- కొలెస్ట్రాల్‌ను తగ్గించే గొప్ప గుణం ఉంటుంది. శరీరంలో ఉండే చెడును తగ్గించి, మంచి కొలెస్ట్రాల్ పెరగడానికి దోహదం చేస్తుంది.
- జీర్ణ సమస్యలు తగ్గుతాయి. యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు వ్యాధులకు వ్యతిరేకంగా పోరాటంలో ఎంతగానో ఉపయోగపడతాయి.

'అంబాజీపేట మ్యారేజీ బ్యాండు' టీజర్

'ఈ సినిమా ఇంత బాగా రూపుదిద్దుకోవడానికి మా నిర్మాతలే కారణం. ధీరజ్ గారు మాకు కావాల్సిన సపోర్ట్ ఇచ్చి ఎంకరేజ్ చేశారు. అలాగే ఇంత మంచి కథను నా దగ్గరకు తీసుకొచ్చిన దుశ్యంత్‌కు థ్యాంక్స్. నా కోస్టార్ శివానీ, లక్ష్మీ క్యారెక్టర్‌లో చాలా బాగా నటించింది. సినిమాటోగ్రఫీ, మ్యూజిక్, ఎడిటింగ్.. ఇలా ప్రతి డిపార్ట్‌మెంట్ ఔట్‌పుట్ సూపర్బ్‌గా ఇచ్చారు. నా డైరెక్టర్స్ నా కెరీర్‌ను ఒక్కో ఇటుక పేర్చి ఇల్లులా తీర్చిదిద్దారు. నా కెరీర్‌లో గొప్ప సినిమా 'అంబాజీపేట మ్యారేజి బ్యాండు' అని హీరో సుహాస్ అన్నారు. సుహాస్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'అంబాజీపేట మ్యారేజి బ్యాండు' చిత్రం నుండి తాజాగా టీజర్ విడుదలైంది. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో సుహాస్ పైవిధంగా మాట్లాడారు. జీఏ2 పిక్చర్స్, దర్శకుడు వెంకటేష్ మహా బ్యానర్ మహాయన మోషన్ పిక్చర్స్, ధీరజ్ మొగిలినేని ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్స్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. దుశ్యంత్ కటికినేని దర్శకత్వంలో తెరకెక్కుతోన్న ఈ సినిమా త్వరలోనే థియేటర్లలోకి రానుంది.

'బబుల్‌గమ్' టీజర్ విడుదల

రోషన్ కనకాల కొత్త చిత్రం 'బబుల్‌గమ్' నుండి మంగళవారం టీజర్ విడుదలైంది. రవికాంత్ పేరెపు దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని పీపుల్ మీడియా ఫ్యాక్టరీ, మహేశ్వరి మూవీస్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. మానస చౌదరి కథానాయిక. టీజర్ లాంచ్ కార్యక్రమానికి నాని ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. 'రోషన్ తొలి సినిమాకే చాలా కాన్ఫిడెంట్‌గా కనిపిస్తున్నాడు. టీజర్ చూసినప్పుడు చాలా అద్భుతంగా చేశాడనే ఫీలింగ్ వచ్చింది. రోషన్‌కి ఆల్ ది వెరీ బెస్ట్. మరో సక్సెస్ ఫుల్ హీరో తెలుగు ఇండస్ట్రీ వచ్చాడని కాన్ఫిడెంట్‌గా చెప్పగలను. టీం అందరికీ ఆల్ ది బెస్ట్. డిసెంబర్ 29న విడుదల చేస్తున్నారు. గ్రేట్ డేట్ ఇది. న్యూ ఇయర్, న్యూ వేవ్ రాబోతుంది ఇండస్ట్రీలోకి. ఆ రోజు బ్లాక్ బస్టర్ సక్సెస్‌ని సెలబ్రేట్ చేసుకుందాం' అని నాని ఈ కార్యక్రమంలో మాట్లాడారు.

నాజర్ తండ్రి మృతి

విలక్షణ నటుడు నాజర్‌కు తండ్రి మాబూబ్ బాషా (95) మంగళవారం కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన తమిళనాడు చెంగల్పట్టు జిల్లాలోని స్వగృహంలో తుదిశ్వాస విడిచారు. ఈ విషయాన్ని నాజర్ కుటుంబ సభ్యులు వెల్లడించారు. తండ్రి మరణంతో నాజర్ కుటుంబంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

నవంబర్ 3న 'నరకాసుర'

రక్షిత్ అట్లూరి హీరోగా నటిస్తున్న 'నరకాసుర' సినిమా విడుదల తేదీ వచ్చేసింది. ఈ సినిమాలో అపర్ణ జనార్దన్, సంకీర్తన విపిన్ హీరోయిన్స్‌గా కనిపించబోతున్నారు. సుముఖ క్రియేషన్స్, ఐడియల్ ఫిలిం మేకర్స్ బ్యానర్స్‌లో డాక్టర్ అజ్జ శ్రీనివాస్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సెబాస్టియన్ నోవా అకోస్టా జూనియర్ దర్శకత్వం వహిస్తున్నారు. నవంబర్ 3నఉషా పిక్చర్స్ ద్వారా ఈ సినిమా థియేటర్లలో రిలీజ్‌కి సిద్ధమైనట్లు చిత్రబృందం ప్రకటించింది.

టాప్‌లో సాత్విక్-చిరాగ్

- నంబర్ ర్యాంక్‌తో కొత్త చరిత్ర
- బిడబ్ల్యుఎఫ్ ర్యాంకింగ్స్ విడుదల

లాసన్నె: ప్రపంచ బ్యాడ్మింటన్ సమాఖ్య(బిడబ్ల్యుఎఫ్) తాజా ర్యాంకింగ్స్‌లో భారత డబుల్స్ జోడీ సాత్విక్ సాయిరాజ్ రంకిరెడ్డి-చిరాగ్ శెట్టి సత్తా చాటారు. ఆసియా క్రీడల్లో పసిడి పతకం కైవసం చేసుకున్న ఈ జంట.. తాజాగా బిడబ్ల్యుఎఫ్ డబుల్స్ ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానానికి ఎగబాకారు. దీంతో పురుషుల డబుల్స్‌లో నంబర్ ర్యాంక్ దక్కించుకున్న తొలి భారత ద్వయంగా రికార్డుల్లోకెక్కారు. ప్రపంచ చాంపియన్‌షిప్‌లో కాంస్య పతకం సాధించిన భారత జంట బర్మింగ్‌హామ్ కామన్వెల్త్ క్రీడల్లోనూ స్వర్ణం పతకం సాధించారు. ఈ క్రమంలోనే ఇటీవల ముగిసిన ఆసియా క్రీడల్లో భారత్ తరపున డబుల్స్‌లో స్వర్ణం నెగ్గిన తొలి జోడీగా చరిత్రకెక్కారు. ఈ ఏడాది స్విస్ ఓపెన్ నెగ్గిన ఈ జోడీ.. జూన్‌లో ఇండోనేషియా ఓపెన్ నెగ్గడం ద్వారా భారత్ నుంచి బిడబ్ల్యుఎఫ్ ప్రపంచ సూపర్-1000 సిరీస్ నెగ్గిన తొలి జంటగానూ రికార్డు నెలకొల్పారు. ఓవరాల్‌గా భారత్ నుంచి గతంలో ప్రకాశ్ పదుకోన్, సైనా నెహ్వాల్, కిడాంబి శ్రీకాంత్ టాప్ ర్యాంక్‌కు చేరుకున్నారు. మంగళవారం ప్రకటించిన బిడబ్ల్యుఎఫ్ పురుషుల సింగిల్స్‌లో లక్ష్యసేన్ 15వ ర్యాంక్ దక్కించుకోగా.. శ్రీకాంత్ 20వ స్థానంలో నిలిచాడు. మహిళల సింగిల్స్‌లో సింధు.. 13వ స్థానంలో నిలువగా.. మహిళల డబుల్స్‌లో గాయత్రీ గోపీచంద్-త్రిసా జాలీ జంట 16వ ర్యాంక్‌కు చేరారు.

పాకిస్తాన్‌కు మరో విజయం

- రిజ్వాన్, షఫీక్ సెంచరీలు
- శ్రీలంకపై భారీ లక్ష్యాన్ని ఛేదించిన మాజీ ఛాంపియన్
- మెండిస్, సమరవిక్రమ శతకాలు వృథా

హైదరాబాద్: ఐసిసి వన్డే ప్రపంచకప్‌లో పాకిస్తాన్ జట్టు మరో విజయాన్ని సొంతం చేసుకుంది. రాజీవ్‌గాంధీ ఇంటర్నేషనల్ స్టేడియంలో శ్రీలంకతో జరిగిన రెండో లీగ్ మ్యాచ్‌లో పాకిస్తాన్ జట్టు ఐదు వికెట్ల తేడాతో విజయం సాధించింది. టాస్ గెలిచి తొలిగా బ్యాటింగ్‌కు దిగిన శ్రీలంక జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 9వికెట్ల నష్టానికి 344పరుగుల భారీస్కోర్‌ను నమోదు చేసింది. లంక జట్టు 30 ఓవర్ల కేవలం 2 వికెట్ల నష్టానికి 229పరుగులు చేసి 400కు పైగా పరుగులు చేసేలా కనిపించినా ఆ తర్వాత పాక్ బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడం, లంక జట్టు వరుసగా వికెట్లను కోల్పోవడంతో 344పరుగులకే పరిమితమైంది. కుశాల్ మెండీస్(122), సమరవిక్రమ(108) సెంచరీలకి తోడు నిస్సంక(61) అర్ధసెంచరీతో మెరిసాడు. హసన్ అలీకి నాలుగు, రవూఫ్‌కు రెండు వికెట్లు దక్కాయి. ఛేదనలో పాకిస్తాన్ ఇమామ్, కెప్టెన్ బాబర్ వికెట్లను త్వరగా కోల్పోయింది. ఆ తర్వాత షఫీక్(113), రిజ్వాన్(131నాటౌట్) సెంచరీలతో కదం తొక్కారు. దీంతో పాక్ జట్టు 48.2ఓవర్లలో 345పరుగులు చేసి గెలిచింది. మధుశంకకు రెండు, తీక్షణ, పథీరణకు ఒక్కో వికెట్ దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ రిజ్వాన్‌కు దక్కింది.

ఇంగ్లండ్ బోణీ

బంగ్లాపై 137పరుగుల తేడాతో గెలుపు

ఐసిసి వన్డే ప్రపంచకప్‌లో ఇంగ్లండ్ జట్టు బోణీకొట్టింది. మంగళవారం జరిగిన రెండో లీగ్‌లో ఇంగ్లండ్ 137పరుగుల తేడాతో బంగ్లాదేశ్‌పై ఘన విజయం సాధించింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్ నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 364 పరుగుల భారీస్కోర్‌ను నమోదు చేసింది. మలన్(140) సెంచరీకి తోడు రూట్(82), బెయిర్‌స్టో(52) అర్ధసెంచరీలతో మెరిసారు. ఛేదనలో బంగ్లాదేశ్ 48.2ఓవర్లలో 227పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ లిటన్ దాస్(76), ముష్ఫికర్ రహీమ్(51) మాత్రమే బ్యాటింగ్‌లో రాణించారు.

వన్డే ప్రపంచకప్‌లో నేడు..
భారత్ × ఆఫ్ఘనిస్తాన్
(వేదిక: ఢిల్లీ; మ.2.00గం॥లకు)

పాయింట్ల పట్టిక

వ.స.	దేశం	ఆ	గె	ఓ	పా	నె.ర.
1.	న్యూజిలాండ్	2	2	0	4	+1.95
2.	పాకిస్తాన్	2	2	0	4	+0.92
2.	దక్షిణాఫ్రికా	1	1	0	2	+2.04
4.	భారత్	1	1	0	2	+0.88
5.	ఇంగ్లండ్	2	1	1	2	+0.55
6.	బంగ్లాదేశ్	2	1	1	2	-0.65
7.	ఆస్ట్రేలియా	1	0	1	0	-0.88
8.	శ్రీలంక	2	0	2	0	-1.16
9.	ఆఫ్ఘనిస్తాన్	1	0	1	0	-1.43
10.	నెదర్లాండ్స్	2	0	2	0	-1.80

ఆ:ఆడినవి; గె:గెలుపు; ఓ:ఓటమి; పా:పాయింట్లు; నె.ర:నెట్‌రన్‌రేట్

'కాంతారా -2'కి రంగం సిద్ధం

రిషబ్ శెట్టి కథానాయకుడిగా నటిస్తూ దర్శకత్వం వహించిన 'కాంతారా' చిత్రానికి ప్రీక్వెల్‌ను తెరకెక్కించబోతున్న విషయం తెలిసిందే. తాజా భాగంలో తొలి భాగం ఆరంభానికి ముందు జరిగిన కథను చూపించబోతున్నారు. డిసెంబర్‌లో ఈ చిత్రం సెట్స్ మీదకు వెళ్లనుందని చిత్ర నిర్మాణ సంస్థకు చెందిన ప్రతినిధి వెల్లడించారు. ఈ సినిమా కోసం రిషబ్‌శెట్టి గుర్రపుస్వారీతో పాటు కొన్ని ప్రాచీన యుద్ధ విద్యల్లో శిక్షణ తీసుకోబోతున్నారని తెలుస్తోంది. వచ్చే ఏడాది ఆగస్ట్ కల్లా చిత్రీకరణ పూర్తిచేసి దసరా కానుకగా విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.

'టైగర్-3' కత్రినా

సల్మాన్ ప్రధాన పాత్రలో యష్ రాజ్ ఫిలింస్ బ్యానర్‌లో రాబోతున్న టైగర్-3 రిలీజ్‌కు సిద్ధమైంది. టైగర్ సిరీస్‌లో మూడో ఫ్రాంచైజీగా రూపొందిన ఈ చిత్రానికి మనీష్ శర్మ దర్శకుడు. హిందీతో పాటు తెలుగు, తమిళ భాషల్లో విడుదల కాబోతున్న ఈ సినిమాలో సల్మాన్‌ఖాన్‌కు జోడీగా కత్రినా కైఫ్ నటిస్తున్నారు. తాజాగా ఆమె పోస్టర్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు. ఈ సినిమా ట్రైలర్ అక్టోబర్ 16న రిలీజ్ కాబోతుంది.

క్రీడల్లో తిరుగులేని చైనా..

అమెరికాతో ఢీ.. అంటే ఢీ...

1951నుంచి ఆసియా క్రీడలు ప్రారంభం కాగా.. చైనా 1974లో ఇరాన్‌లోని టెహ్రాన్ వేదికగా జరిగిన 7వ ఆసియా క్రీడలతో మాత్రమే ప్రాతినిధ్యం వహిస్తోంది. అరంగేట్రంలోనే 33 స్వర్ణాలతో సహా ఏకంగా 106పతకాలతో 3వ స్థానంలో నిలిచిన చైనా.. టాప్‌లో ఉన్న జపాన్‌కు దీటుగా నిలిచింది. ఆ తర్వాత 1978లో బ్యాంకాక్ క్రీడల్లో 51స్వర్ణాలతో 2వ స్థానానికి ఎగబాకింది. 1982లో భారత్ వేదికగా జరిగిన క్రీడలతో జపాన్‌ను వెనక్కి నెట్టి చైనా టాప్-1కు చేరుకుంది. 2023లో జరిగిన 19వ ఆసియా క్రీడల వరకు చైనా ప్రతిసారీ అగ్రస్థానంలో నిలుస్తూ 11సార్లు ఏకచక్రాధిపత్యాన్ని చెలాయించింది. ఈసారి ఆసియా క్రీడల్లో 12,500మంది అథ్లెట్లు ప్రాతినిధ్యం వహించగా.. ఇది ఫ్రాన్స్ వేదికగా జరిగే పారిస్ ఒలింపిక్స్ అథ్లెట్ల కంటే ఎక్కువే. పారిస్ ఒలింపిక్స్‌లో 10,500మంది అథ్లెట్లు మాత్రమే పాల్గొనున్నారు.

క్రీడల్లో చైనా హవా..

2020 టోక్యో ఒలింపిక్స్‌లోనూ చైనా 89 పతకాలతో రెండోస్థానంలో నిలిచినా.. చివరిరోజు వరకు అమెరికాకు ముచ్చెమటలు పట్టించింది. ఈ క్రీడల్లో అమెరికా(39), చైనా(38)ల మధ్య స్వర్ణ పతకాల వ్యత్యాసం ఒకటి మాత్రమే. ఓవరాల్‌గా అమెరికా 39స్వర్ణ, 41రజత, 33కాంస్యాలతో సహా 113పతకాలతో అగ్రస్థానంలో నిలిచినా.. చైనా 38స్వర్ణ, 32రజత, 19కాంస్యాలతో మొత్తం 89పతకాలతో రెండో స్థానం ఉండి గట్టి పోటీనిచ్చింది. అమెరికాకు ట్రాక్ అండ్ ఫీల్డ్, స్విమ్మింగ్, జిమ్నాస్టిక్స్‌లతో అత్యధిక పతకాలు దక్కితే.. చైనా డైవింగ్, టేబుల్ టెన్నిస్‌లో అత్యధిక పతకాలను కొల్లగొట్టింది. ఒకప్పుడు క్రీడల్లో అమెరికాకు రష్యా ధీటుగా నిలిస్తే.. ప్రస్తుతం చైనానుంచి ఆ దేశం క్రీడల్లో తీవ్ర పోటీని ఎదుర్కొంటోంది.

చిన్నప్పటినుంచే ప్రోత్సాహం..

క్రీడలను ప్రోత్సహించడంలో చైనా ఎప్పుడూ ముందంజలోనే ఉంటుంది. పిల్లలకు క్రీడలపట్ల ఉన్న ఆసక్తిని బట్టి వారికి ఆ క్రీడాంశంలో నాణ్యమైన కోచ్‌లతో తర్ఫీదునిస్తోంది. సౌకర్యాలు, క్రీడాపరికరాలు సమకూర్చడం, భోజనం, ఆర్థికపరమైన సౌకర్యాలన్నీ కల్పిస్తూ.. యువతను ప్రోత్సహిస్తోంది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68